సారస్వత

# వ్యాస ముక్తావళి

894.8274
RAM

డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు

C7

# సారస్వత
# వ్యాస ముక్తావళి

T-119

★

ఆంధ్ర సారస్వత పరిషత్తు
బొగ్గులకుంట, హైదరాబాదు.

1

వెల 1-4-0

894.8274
RAM

ఆంధ్ర సారస్వత పరిషత్తు
ప్రచురణ.

2

AOUA102B126

ACC. NO: 1562



8

# ప్రకాశకుల విజ్ఞప్తి

గోలకొండ, సుజాత, శోభ పత్రికలలో చాలకాలముక్రింద డాక్టర్ బూర్గుల రామకృష్ణారావుగారు ప్రకటించిన వ్యాసముల సంపుటీకరణము యీ గ్రంథము. ఇందులో "సర్మద్"ను గూర్చిన వ్యాసము మాత్రము యింతవరకు ప్రకటితము కాలేదు.

ఈ వ్యాసములను పరిషత్తు పక్షాన ప్రకటించుటకు ఆమోదించిన శ్రీ రామకృష్ణారావుగారికి పరిషత్తు పక్షాన కృతజ్ఞతా వందనములు. ఉర్దూ, ఫారసీ కవుల రచనా రీతులను గురించి తెలిసికొనుటకు యీ పుస్తకము ఉపకరించగలదు. ఈ విధమైన రచనలు తెలుగులో రాలేదు. ఎంకిపాటలను గురించి విమర్శన మరియు రెడ్డిరాజుల కాలపు మతసంస్కృతులు అను వ్యాసాలు కూడ మిక్కిలి విలువగలవి. ఈసారస్వత వ్యాసముక్తావళిని ఆంధ్ర పాఠక లోకము ఆదరించగలదని విశ్వసించు చున్నాము.

*

దుర్ముఖి,
శ్రీరామ నవమి

*

ఇట్లు
నూకల నరోత్తమరెడ్డి.
అధ్యక్షుడు.

5

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| నవీన వాఙ్మయము - రెంకి పాటలు | ... | 1 |
| ఉమర్ ఖయ్యాం | ... | 20 |
| ఈశ్వర తత్వము - ఉమర్ ఖయ్యాం | ... | 31 |
| కాకునూరి అప్పకవి జన్మస్థానము | ... | 43 |
| ఉర్దూభాషా సారస్వతములు | ... | 51 |
| సూఫీ సర్మద్ | ... | 75 |
| రెడ్డిరాజుల కాలపు మతసంస్కృతులు | ... | 92 |


6

# నవీన వాఙ్మయము - యెంకిపాటలు.

ప్రపంచమునందలి ప్రతివస్తువునకు పరివర్తనము సహజగుణము. దేశ చరిత్రములేగాక వాఙ్మయ చరిత్రములు గూడ సంఘముయొక్క వ్యవస్థాభేదముల వల్లను, కాలములయొక్క మార్పులవల్లను, పరివర్తన మొందుచుండును. 'ఉత్క్రాంతి' తత్త్వము వాఙ్మయ చరిత్రమునకును సంబంధించును. ఆంధ్ర వాఙ్మయ చరిత్రమున మొదటినుంటి నిప్పటి వరకును పరిశీలించితిమేని కాలముయొక్క ధర్మము ననుసరించి భాషయు వాఙ్మయమును ఎట్టిమార్పులు నొందెనో తెలియనగును.

ప్రస్తుత యుగమును (Democratic age) అనగా సామాన్య ప్రజలయుగమని పేర్కొనుట వినియున్నాము. ఈ పేరు పరిపూర్ణముగా సార్థకము గానప్పటికిని సామాన్య ప్రజాయత్త లక్షణములు లోకమందలి ప్రతి జాతియొక్క జీవనమందును కాన్పించు చున్నవి. జాతీయ జీవనముయొక్క విషయేతరములందు గన్పించు నీలక్షణములే వాఙ్మయ మున గూడ బొడగట్టుచున్నవి. "వాఙ్మయము సాంఘిక జీవనము యొక్క ప్రతిబింబమని" మాథ్యూ ఆర్నాల్డు (Mathew Arnold) అను ఆంగ్లేయ మహాకవి వచించినటుల సంఘముయొక్క జీవనమందు మార్పులు గలుగుటవల్ల వాఙ్మయ నిర్మాణ పద్ధతులందుగూడ మార్పులు గలుగుట సహజము. నవీనపద్ధతుల నవలంబించు వాఙ్మయ నిర్మాతలు సంఘ సంస్కారులవలెనే సక్రమ పద్ధతుల నవలంబించలేదను యపవాదులకు గూడ పాత్రులగుచుందురు. మార్పులు జేయునవసరమే

లేదని ప్రాతత్రోవల వదలజాలని మూఢ విశ్వాసములు గలవారు వాఙ్మయ చరిత్రములందు గూడ పెక్కండ్రు జూపట్టెదరు. కాని కాలప్రవాహమున కడ్డుపడి కట్టగట్ట నెవరితరము? అందులో కేవల భావనా మాత్రసంవేద్యములును మృదుమధుర రసార్ద్రములునునగు కవితా ప్రవాహముల దారి నడ్డగించువారెవరు? అడ్డగించినను గడ్డి పుల్లవలె త్రోసివేసి యాప్రవాహములు విచ్చలవిడిగా రసానుభవ లాల సులగు సహృదయుల యంతరంగ సీమల బారుచు భావాంకురములను దయింప జేయుచునే యుండును. పద్యకావ్యములేగాని గద్యకావ్య ములే గాని ప్రబంధములేగాని యితర నిర్మాణములులేగాని సారస్వ తమున వివిధపద్ధతుల పరిణమించినపుడు శోకించు వారెవరు? వాఙ్మయోద్యాన లక్ష్మికిని సర్వవిధపరిమళ ప్రసూన రాజములలంకార ములే! అట్లు గావనితలంచుట తప్పు. త్రసరేణువు మొదలు బ్రహ్మాం డమువరకు ననంతకోటి రూపాంతరముల గన్పరచు నాసచ్చిదానంద స్వరూపమువలె తత్స్ఫూర్తిలేశముగల మనుజుని మానసిక వ్యాపార ములు ప్రపంచముయొక్క వివిధావస్థల ననుసరించి యనేక విధముల వ్యక్తమగుచుండును. అట్లు గాగూడదని వాదించిన మానునా? భాష మనుజునియొక్క విచారభావనా ప్రపంచముల బయలుపెట్టు సంజ్ఞ, వాఙ్మయము సక్రమ పద్ధతులపైన నిర్మింపబడిన విజ్ఞానసౌధము. అది యెల్లప్పటికిని నిర్మింపబడుచు ఒకప్పుడు పరిపూర్ణతనొందని నిర్మాణ రాజము. అట్టిదాని స్వరూపమును సంకుచిత పరచుట కెవరితరము?

కవి ఆవేశపూరితుడు. భావనా ప్రపంచమున విచ్చల విడిగా దిరుగాడి ఆనందరస పరిపూర్ణతచే మత్తిల్లినవాడు. అట్టివానికి తన రసాను భవమును వెల్లడించుటయే ముఖ్యముగాని, యేభాషయందు యే

చందస్సునందు యెన్ని పదములందు వ్యక్తపరుచుట'యనునది ముఖ్యముగాదు. ఇట్టిరసానుభవ జనితో న్మాదము ముందు యేకట్టుబాటులును యేనిబంధనలును పనికిరావు. ఈ తత్వము ననుసరించి కేవల భావనాత్మకమును రసాత్మకమును నగు కళలు సృష్టించుట యేనవీన యుగము నందలి కళాధర్మము. దీనినే (Romanticism) అని పేర్కొనెదరు. దీనినే స్వర్ణయుగమని కొనియాడెదరు. నేటి నవలలు, ఖండ కావ్యములు, భావ గీతములు, చిన్నకథలు, ముచ్చటలు, మొదలగునవి నవీన కళా ధర్మము ననుసరించిన పద్ధతులు. ఆంగ్లేయ నాగరికతతో గలిగిన సంబంధమును ఆంగ్లేయ భాషా భ్యసనమును చాల వరకీ పరివర్తనమునకు కారణములనుట నిర్వివాదాంశము. ఆంధ్ర వాఙ్మయమున నవీన కళా ధర్మముల మొట్ట మొదట సూచించినవారు కీ॥ శే॥ రా॥ బ॥ కం॥ వీరేశలింగం పంతులుగారే యని చెప్పవచ్చును. కొంతవడి పురాతన పద్ధతుల నవలంబించు పండితులసంతుష్టి చూపినను ఆంధ్రుల యొక్క ఆధునిక సంస్కారమువలన నవీన పద్ధతులతి తీవ్రముగ ప్రబలి పరిపూర్ణ వికాసము నొందు చున్నయవి. షేక్స్పియర్, కీట్సు, షెల్లీ, బ్రౌనింగ్ మొదలగు ఆంగ్లేయ మహాకవుల ననుసరించి ఖండ కావ్యములు భావగీతములు వ్రాయుట ప్రస్తుతకాలమున విరివిగా గానవచ్చును. సంస్కృత భాషా సంస్కారముగల యాంధ్రభాష ఈ నవీన కావ్య రచనలకమితముగా ననుగుణ్యమైయున్నదని చెప్పవచ్చును. శ్రీయుతులు తిరుపతి వేంకటేశ్వర కవులును పూర్వాచార పరాయణులయ్యు వాఙ్మయమున నవీన సంప్రదాయముల ననుసరించుటకు ముందంజవేసి అనేక ఖండ కావ్యాదుల రచించియున్నారు. శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారును, దువ్వూరిరామిరెడ్డిగారును, అధికార్ల సూర్యనారాయణ

రావుగారును, నండూరి వెం॥ సుబ్బారావుగారును, మొదలగు యభినవ కవులు నవీన లావణ్యముల వెదజల్లుచు భావ ప్రపంచమున నవీన విలాసముల మూర్తీభవింప జేయుచున్నారు. ఈ క్రొత్త మార్గము లన్నియు యాంధ్రభాషా యోషామణికి భూషణములై యలరారు చున్నవి.

(గోలకొండ పత్రిక 10 మే నెల 1926)

నవీన కళల యొక్క ముఖ్యగుణములు మూడు. వాఙ్మయము సంఘము యొక్క ప్రతిబింబమను నార్యోక్తి నిబట్టి సార్వజనీనత గలుగ వలయును. ఉత్తమజాతియందుద్భవించిన నాయికా నాయకుల ప్రణయ కథలేకాని పౌరాణి గాథలేకాని "కేవల కల్పనాకథ" లైనను సంఘము యొక్క సర్వసామాన్య జనులకు సంబంధించక ప్రత్యేక జాతి వర్ణముల యొక్క ప్రత్యేకావస్థలను చిత్రించుట మధ్యయుగపు కవుల యలవాటు అట్లుగాకుండ సర్వజన సామాన్యగ్రాహ్యమగు భాషయందు జనసామాన్యమునకు సంబంధించు నట్టి విషయములను సంఘములోని వివిధావస్థలను చిత్రించుట నవీన వాఙ్మయ గుణములలో నొకటి. అట్లగుట వాఙ్మయము సంఘము యొక్క పరిపూర్ణ ప్రతిబింబమగుచు సార్వజనీనమగును. రెండవ గుణము సత్యానుకరణము. ప్రతినాయకుని అఖిల సుగుణగణవిరాజితడగు నుత్తమనాయకునిగా ప్రతినాయికను ఆదర్శ ప్రాయయగు విదుషీ మణిగా చిత్రించుట కవి సంప్రదాయము. సామాన్య పాత్రముల చిత్రించునపుడు గూడ మానుష స్వభావ సహజములగు లోపము లేమియు లేకుండ కేవల సుగుణప్రాధాన్యముగ చిత్రించుట మధ్య కాలపు కవుల యలవాటు. అట్లు గాకుండ కావ్యచిత్రములు ప్రకృతి యందలి రూపముల యొక్క సత్యానుకరణములు గానుండుటయే

నవీనకళ యొక్క రెండవ గుణము. ఈ రెండు గుణములను సంఘ జీవనమునకును, వాఙ్మయమునకును, పరస్పర సమన్వయము గలుగ జేయును. ప్రచలిత వాఙ్మయమునందలి నవలలు చిన్నకథలు దిలకించి తిమేని అందలి పాత్రములు సంఘమునందు ప్రస్తుతకాలమున జీవించి యున్నయనేక గుణదోష సహితులగు వ్యక్తులుగాని సంఘము యొక్క ప్రస్తుత స్థితికి దూరముగా నున్న సీతారామ చంద్రులు లేక శకుంతలా దుష్యంతులు, లేక సావిత్రీ సత్యవంతులు కారనితెలియనగును. జీవితో పవనమందు అంకురించి పుష్పించి పరిమళించి పడిపోవు రోజా మల్లె మొదలగు సామాన్య పుష్పములుకాని అందరాని నందనవనమందుండు మందారకుసుమములుగావు. నవీన కళ యొక్క మూడవ ధర్మము స్వతంత్ర నిర్మాణములు గావించుట. క్రొత్త శైలి క్రొత్త ఫక్కి క్రొత్త త్రోవలు క్రొత్త నడక యతిప్రాసాదినిబంధనలకులోబడి భావ సంకుచిత మొనరింపక పోవుట (Blank Verse) వ్రాయుట పామరజను లనుభవింపజాలు రచనలు రచించుట నవీనకళా స్వాతంత్ర్యము యొక్క నిదర్శనములు; సార్వజనీన (Universality) సత్యానుకరణము (Realism) స్వతంత్రత (Freedom) యీ మూడు ముఖ్య గుణములని తెలియదగినది.

ఈతత్వముల దృష్టియందుంచినచో ప్రచలిత వాఙ్మయము ఆంధ్రభాషను క్షీణదశకు దెచ్చుననియు ఆంధ్రసారస్వతమునకనర్థ మా పాదించుననియు యనుమానపడు కొందరి పండితుల యభిప్రాయము సత్యముగాదని తెల్లమగును; ఇంతవరకు జరిగిన వాదప్రతివాదములను పరిశీలించినచో ముఖ్యవాదము కేవల భాషాసమస్యయేయని గమనింప వగును. కాని నవీనకళాధర్మముల విషయమేగాని ఆధునిక వాఙ్మయ

తత్వముల విషయమేకాని వాద ప్రతివాదములులేవు. యెంకిపాటలు మున్నగు కావ్యములందుపయోగింపబడిన భాషనింద్యగ్రామ్యమనియు యిట్టిభాషను వాఙ్మయమునందు వాడుట యనర్థకమనియు పలువురు విమర్శించినారు. కాని భాషాతత్వములపై నెమ్మదిగా యోచించినచో గ్రాంథిక గ్రామ్యభాషలను విభాగము బొత్తిగానెగిరిపోవును. భాష యనేక శతాబ్దములనుండి రూపాంతరములనొందుచు ప్రతి దివసము అతిస్వల్పముగానైన మార్పుల నొందుచునేయుండును. ఆంగ్లేయ మహాకవియగు (Chaucer) చాసర్‌నాటి భాషనిపుడెవడైన తెలిసి కొనునా! (Shakespeare) షేక్స్ప్యియర్ భాషకును టెన్నిసన్ భాష కును గల భేదము మనకు దెలియదా! (Tennyson) టెన్నిసన్ భాష కును ఇప్పటి భాషకును గల సంబంధము దెలిసికొందుముగదా! ఇట్లే ఆంధ్ర కన్నడభాషల పరస్పర సంబంధములు మనకు విశదముగా దెలిసినచో ఆంధ్ర భాషా చరిత్రమును సమగ్రముగా విమర్శించినచో భాషయందలి మార్పులను కనుగొందుము. శబ్దానుశాసనునినాటి భాషలో నెన్నిపదములు వాడుకలో నున్నవియో, యెన్ని దుర్గ్రాహ్యములగుటయే గాక అపశబ్దాది దోషములవల్ల రూపాంతరములనొంది ఆరూపాంత రములే యిపుడా పదముల నిజస్వరూపములని వాడుకలో నున్నవియో కొంచెము పండితులందురు యోచింతురుగాక! భాషయొక్క జీవితము నందొక చమత్కారమేమన, దోషములైనను రూఢివల్ల భూషణములై మారును; తప్పులైనను తరతరముల వాడుకవల్ల ఒప్పులైపోవును. ఇట్టిస్థితిలో యేపదము గ్రామ్యమో యేపదము గ్రాంధికమో స్థిరపరచుట మిగుల దుష్కరము. ఐనను భాషాభిజ్ఞులు తమకుగల జ్ఞానపరిమితిని బట్టి కొన్ని కట్టుబాటులు పెట్టుకొనకతీరదు.

వాడుకభాష (Colloquial language) ను గ్రంథములందు వాడుటచే సుగ్రాహ్యమగుటయేగాక భాషయందొకశక్తి (force) గలుగును. చదువరుల బుద్ధికి తీవ్రమైన చాలన మొసంగుటయేగాక వారి తార్కిక భావనాశక్తులకు మహత్తరమైన యుత్తేజము గలుగజేయును. సంఘ దురాచారముల వెల్లడిచేసి వాఙ్మయముద్వారా కొంత సదాచార ప్రచారము జేయుట యాదర్శముగాగల ప్రతి సాంఘిక పద వాఙ్మయ నిర్మాత తప్పక వాడుకభాషయందే వ్రాయవలయును. లేనిచో చెవిటివాని ముందర శంఖూదినట్లు నిరర్థకముగానుండును. వాడుకభాషను వాఙ్మయము నందుపయోగించుట తప్పకానేరదు, సంఘములోని వివిధ తెగలయొక్క వాడుకభాష పలువిధములుగా నుండకపోవును. అట్లుండుటచే పాత్రౌచిత్యమునుబట్టి యేవిధమైన వాడుకభాష నుపయోగించవలయునో ఆవిధమైనవాడుకభాష నుపయోగించినయెడల చాలును ఇంతమాత్రమున పండితులందరు ఆంధ్రభాషానిర్మల సరసీజల మపవిత్రమగునని భయంపడ నక్కరలేదు. నండూరి వేంకటసుబ్బారావుగారు నాయుడుబావ యెంకియొక్క ముగ్ధప్రణయగాథలను వారి వాడుకభాషయందు పాడినందున అంతకంటె మంచిదైన వాడుకభాషనేగాని లేక కేవలపండితుల గ్రాంధికభాషనేగాని ఉపయోగించువారు నాయుడుబావ ననుకరింపబోరు. ఆభాషలోనేగాని నిజముగా నంత ఆకర్షణశక్తియులేదు. పండిత వీరులందరు వజ్రాయుధముల ధరించి రణరంగములోనికి దుముకుటయు మరియితరులను తమ తమ కత్తులను నూరుటయు చాల యసమంజసమని తలంచెదను.

(22 మే నెల – 1926 గోలకొండ)

భావ ప్రధానములగు కావ్యములను ఛందోనిబంధనలచే వ్యాకరణలాక్షిణిక శృంఖలములచే గట్టి వేసినచో నా కావ్యములందు

Spontaneity గలుగనేరదు. నిర్మాత తన రచనా నైపుణ్యతకేగాని లేక పాండిత్య ప్రకర్షాపేక్షకుగాని భావమునించుకైన బలియివ్వవలసి వచ్చును. భాషాకోవిదుడగు ప్రౌఢకవి భావమును భాషకు రెంటిని సమన్వయింపజేయును; గాని అదియును ప్రయత్న పూర్వకముగా నిర్మింపబడినకద! అ ప్రయత్నముగా భావతరంగములు పొంగిపై కుబికి వెల్లివిరిసినట్లుగా నుండు యావేశపూరిత కళగాదు. చిరకాలాధ్యయనమున పాండిత్యమలవడి శ్రావ్యశారీరమునగానమొనరించు సంగీత శాస్త్ర విశారదుని గానామృతముగాని కేవల రసానుభవ జనితోన్మత్తతచే సంస్కార కష్టములేకుండ యవ్యక్తమధురముగా పంచమ స్వరమున వెలువరించు కోకిల పాటల సుధాలహరులగావు. షెల్లీ (Shelley) మహాకవి పేర్కొన్న Unpremeditated art కాదు. ఆంధ్ర సారస్వతము నందు రెండు విధముల కావ్యములును గలవు. మొదటి తెగకు జేరిన ప్రబంధ రాజములనేకము లున్నటులు భక్తి భరితములును తత్వజ్ఞాన బోధకములు నగు గేయములు కీర్తనలు పాటలు అనేకములుగలవు. ప్రసిద్ధిగాంచినవారి యందు ముఖ్యముగా, త్యాగరాజు, రామదాసు, వేంకటదాసు, వరదరాజు, తాడంకివారు, ఏగంటివారు, మొదలగు మహాకవుల కీర్తనలు పాటలు ఆంధ్రుల హృదయంబుల నెప్పటికిని భక్తిరస ప్రపూర్ణముగా నొనరించు చుండును. అట్టి పామరుల శృంగారభావముల ప్రదర్శించుచు వారి నానందమున నోలలాడించు యేలపాటలనేకములుగలవు. వాఙ్మయచరిత్రముల నించుక పరిశీలించినచో శృంగార వీర రసాత్మకములగు నీలాటిపాటలే మొట్ట మొదట మనుజుని భావప్రపంచమునుండి భాషారూపమును దాల్చినవని తెలియనగును. మొదలుభాష, తర్వాత వ్యాకరణము. మొదలు కవిత్వము తరువాత లక్షణము పుట్టినవని తెలియనగును. నన్నయకు

పూర్వము నన్నెచోడునికి పూర్వము ఏభాషయుండినదో ఆంధ్రకవిత్వమే రూపమున నుండినదో ఇదమిత్థమని చెప్పజాలకున్నను భాషోత్క్రాంతి తత్వముల ననుసరించి పైవిధములగు పాటలు ద్విపదలు మున్నగునవి సంస్కృత భాషా సంపర్క విహీనమగు కేవల ప్రాకృత తెలుగునం దుండిన నుండవచ్చునని యూహింపవచ్చును. మధ్య యుగమున నాగరికత కొన్నిజాతులయందు కేంద్రీకరించి నాగరికులు పామరులను భేదము విస్పష్టమును తీవ్రము నైనందున ప్రబంధమునకును పాటలకును గల భేదము వ్యత్యాసము అతితీవ్రమై లాక్షణికుల ననుసరించిన పండితుల ప్రబంధములు కవిత్వమను పేరునకు దగుననియు తదితరములగు గేయములు పాటలు ఆపేరునకు దగననియు అందులోను గ్రామ్యభాష నుపయోగించిన యెడల బొత్తిగా దగవను నభిప్రాయము ప్రబలినది. కాని కవిత్వము లాక్షణికుల సొమ్మా? పండితుల సొమ్మా? ఒక భాష సొమ్మా? ఈ భాషలో వ్రాసినది కవిత్వము తదితరముగాదు'' అని శాసించువారు తమ వాఙ్మయ చరిత్ర జ్ఞానాభావమును వెల్లడి జేయుదురేగాని మరేమియులేదు. ఏ భాషలో వ్రాసిన నాభాషమాటాడు వారును, ఆభాష తెలిసిన వారును దానిని జదివి అందుగల రసము ననుభవింతురు. లాక్షణికుల నియమములు, ఆలంకారికుల విభాగములు వారి వారికే దెలియునుగాని రసాత్మకమగు కవితను జదివి యానందించు శక్తి భాషాజ్ఞానముగల ప్రతి మనుజుని కుండవచ్చును. అలంకార లక్షణశాస్త్రగ్రంథకీటకము లనందగు మహాపండితు లందరు రసవత్కవిత్వము జెప్పగలరా? కవిత్వ మందలి ప్రధానాంశము భాష, అలంకారము, లక్షణము, మున్నగువాటి నతిక్రమించినదియు, వాటి కంటె సహస్రాంశముల ముఖ్యమైనదియు, అనిర్వాచ్యమైనదియు నొక శక్తి, ఆశక్తిగలవాడే కవిగాని తదితరులుగానేరరు. కవిని విమర్శించు

నెడ ముఖ్యముగా జూడవలసినదేమన ఆ ప్రధానాంశమించుకయైన గలదాలేదా యనునది. అది రసానుభవైక వేద్యము. గులాబీ పువ్వును రెక్క రెక్కగా విడదీసి వేసినచో పనికిరాని చెత్తయగును. సంపూర్ణ రూపమున నదియే మన చక్షుర్ఘ్రాణేంద్రియముల కానంద మొసంగును. సమస్తవర్ణ సమాకీర్ణమగు ఇంద్రధనువు యొక్క స్వరూపము Physical laboratory యందు విడదీసిచూచిన పరిణామ మందును, కీట్సు లేక షెల్లీ మహాకవియొక్క సరసచిత్ర వర్ణనము యొక్క పరిణామ మందునుగల భేదమును కొంచము యోచింపవలయును. రసికులుగానట్టి వారికినిలేక లాక్షణిక శృంఖలా బద్ధులై యీ యభిప్రాయములు నచ్చని వారికిని ఈ భేదము గోచరింపదు గాబోలు! కవులకు గులాబీ పువ్వు యొక్క వృక్షశాస్త్రాత్మక పరిజ్ఞానము లేకపోవచ్చును గాని చదువరులను భావనాత్మకమగు నానందమయ ప్రపంచమున విహరింపజేయు శక్తి మాత్ర ముండ వచ్చును. ఈ రెండవదే కవిత్వ మందలి ప్రధానాంశము. దీని నిజ స్వరూపమును గనుగొని యానందింపగోరు విమర్శకుడు కవి ఏ వాతావరణము నందు ఏ పరిస్థితుల యందు దన మనోభావములకై యిటి పరిణామముల గాంచగల్గెనో వాని యందు లేశమాత్రమైన సానుభూతిగలిగి ఆ ప్రపంచమున నించుకయైనదిరుగాడి, ఆ మాధుర్యము నించుకయైన చవిగ్రోలి యుండవలయును. వేయేల కవియొక్క అనుభవమందు నించుకైన పాల్గొనలేనిది విమర్శకుడు కాజాలడు. అట్లైవరేని విమర్శించిన యెడల ప్రస్తుతము వెలువడునట్టి యప్రస్తుత విమర్శనములే బైలుదేరుచుండును.

యెంకిపాటలనుగురించి విమర్శించునపుడు పైసంగతులను జ్ఞాపకమునందుంచుకొనిన విమర్శ సులభమగును. జరిగిన వాద ప్రతివాద

ములనుండి, ప్రతి విమర్శనలనుండి తేలునవి ముఖ్యముగా రెండే యంశములు భాష, పాత్రములు. ఈరెండును గ్రామ్యములనియు రసవంత మగు కవితా సామగ్రిగావనియు ఒక తెగవారి యభిప్రాయము. రెండవ తెగవారు పురాణ లాక్షణిక గ్రంథ భండారముల నుండియే యెంకి నాయుడుబావల ప్రేమపాటలు సలక్షణములను నాధారమును దీసి సమాధానము జెప్ప ప్రయత్నించుచున్నారు. ఈ వ్యాకర్త పైరెండు తెగలకు జేరినవాడు గాడని తెలిసియే యుండవచ్చును. లక్షణ గ్రంథ ములలో నేయాధారమును యెంకినాయుడుబావల పాటలకు దొరకక పోవచ్చును. లేవని బ్ర॥ శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిలవారు నొక్కి చెప్పినందున నమ్మవలసినదే. లేకపోవునుగాక ! లక్షణ గ్రంథములు అనాగరికుల దంపతులను, యువతీ యువకులను శృంగార భావచేష్టా విహీనులగుటకు నోరుమూసి త్రాళ్ళచేబిగించి కట్టివేయనిగాక ! వారం తటితో నూరకుందురా ? పండిత శాసములకంటె ప్రకృతియొక్క శాస నముల నుల్లంఘనీయములుగదా ! మడిదున్నుకొనువారు నిస్సంశయ ముగా అనాగరికులే ! అచ్చజాతివారమని గర్వించు వారియెదుట నిశ్శంకముగా నికృష్టజాతివారే ! కాని కాపుదంపతుల కల్లకథలలో కపట హీనమగు కబుర్లలో, నావికయువతుల మోటు సల్లాపములలో, మోహపు పాటలలో రసమేలేదా ? (Romance) బొత్తిగా లేదందురా? వివిధసాంఘిక పరిస్థితుల సమ్మేళనముచేతను సంఘవిభజనచే గలిగిన ప్రత్యేకాచారముల చేతను ఏదోవిధముగ సంస్కరింపబడి నాగరికుల మనుకొను యువతీయువకులు మాత్రమే శృంగార రసమున కాలంబన విభావ సామగ్రి యగుదురా ? తదితరమగు ప్రపంచమును కవియొక్క భావనా వాతావరణమునుండి తొలగింప వలసినదేనా ? అట్లేల చేయ వలయునో తెలియకున్నది. పామరులగువారు తమ భావములను

కృత్రిమాచ్ఛాదనములచేతను తెచ్చికోలుముసుంగులచేతను కట్టివేయజాలక విస్పష్టముగా వెలిబుచ్చెదరనియా ? లక్షణ గ్రంథముల యుత్తరువిదియే యైనచో ప్రస్తుతయుగపు కవితా గ్రంథములతో వాటి యాధారములతో నేమిపని లేదనియే నానమ్మకము ! రసపరిప్లుతమగు భావ ప్రపంచమందు (Monopoly system) సా మ్రా జ్యా భి మా న ము (Imperialism) ధనత్వము (Capitalism) మొదలగునవి లేవు. కవి యొక్క నిరంకుశమగు (Republic) నందు వాటికి తావులేదు. ఉండ గూడదు. అట్లే భాషవిషయమునను దెలిసికొనదగినది. ఈ పాటలలో వాడినభాష సాధారణభాష గాదనియు ఉత్తర సర్కారుల యాసభాష యనియు నాగరికులగు రసికులానందింప జాలరనియు వాదింతురేమో? ఆభాషతెలిసినవారు మాటాడువారు అందరు ఆ పాటలలోగల స్వారస్యమును తెలిసికొనగలుగుదురు. కేవల విదేశీయమగు శాకుంతలము జర్మనీ కాళిదాసుడగు గెథె మహాకవి నానంద మధుమత్తతచే నృత్యము గావింపజేసినదే ! కావ్యములో రసమేకలదేని భాషయు పాత్రములు తదనుభవమున కడ్డుపడునా ? భాషయపరిచితమైనను పాత్రములనాగరికులైనను రసపోషణము పాత్రౌచిత్యము ముఖ్యముగా గ్రహణీయములు, విమర్శనయందు చర్చనీయాంశమిదియే !

(గోలకొండ పత్రిక 17 జులై 1926)

యెంకి నాయుడు బావలెవరు ! 'యెంకి స్వీయయా పరకీయయా' యను ప్రశ్న కొందరు విమర్శకులను బాధించినది. కొందరు యెంకి పరమ పతివ్రతయు మహాసాధ్వియునగు ఇల్లాలనియు, మరికొందరు నవయౌవనుండగు నాయుడు బావను మోహింప జేసిన శూద్ర విలాసినీ రమణియనియు అభిప్రాయపడి యున్నారు. శ్రీయుత బ॥ అప్పారావు

గారు ఈ పాటల యందు 'స్వీయ' యగు యెంకి యొకతె 'పరకీయ' యగు యెంకి యొకతె, ఇట్లిద్దరు నాయికలుగలరని తమ ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక వ్యాసమునందు సెలవిచ్చిరి. పాటలయందు మాత్రము యెంకి యీమూడువిధముల యభిప్రాయములకు వీలగునట్లు చిత్రింపబడి యున్నది. కవియొక్క Characterisation పద్ధతిని బాగా కనిపెట్ట నందున ఈత్రివిధాభిప్రాయములు బయలుపడియున్నవి. కాని నవీన వాఙ్మయముయొక్క Realistic గతులను గమనించి యుండినచో, యెంకి లోపములులేని మహా సాధ్వీలలామయగు నిల్లాలుగాదనియు వివర్ణయగు శూద్రవిలాసినియు కాదనియు ఈరెండువిధములగు రెండు ప్రత్యేకవ్యక్తులును లేవనియు దెలిసియుండును 'యెంకి' సాధారణముగ సంఘమందు గన్పడు యిల్లాలు, ఇట్టి 'యెంకి'యొక్క Character ఏ యేవిధముగ చిత్రింపబడినదో గమనించవలయును. 'గుండెగొంతుక లోన' అను మొదటి పాటలో మోహావేశితుడగు నాయుడుబావ 'యెల్లి మాటాడిస్తె యిసిరికొడ్తాది' 'యాడుండవంటాది యిలుదూరిపోతాది' అని వాపోవుచున్నాడు. 'మందో మాకో పెట్టి మరిగింది నాదీ' అని కూడా అనుచున్నాడు. రెండవపాటలో నాయుడు మనన జేయు 'యెంకి' జామురేతిరియేల జడుపుగిడు పూమానిచెట్టు పుట్టాదాటిచేను' లోకి పరుగెత్తడము, 'నీలిసీరా గట్టి నీటుగా' చేరవను యెదురుగా బోయిన నాయుడుబావ 'కంటికాపడగానె' 'కాలు కదపలేక పోవడము' 'తెల్లారబోతుంటె సెందురిణ్ణి తిట్టడము' 'సూరియుణ్ణి తిట్టడము మొదలగు చేష్టలు జేయుచున్నది. అట్లై దొడ్డితోవ కళ్ళై తొంగి సూడంగానే' 'తోటకాడేవుండు తొరగొస్తు' ననడము; 'కోడిగూసే సరికి కొంప కెల్లాలి నీ కోసరమె చెపుతాను కోపమొద్ద నడము; యెంత సేపున్నాను యిడిసి పెటాలేవు తగువోళ్ళలో మనకి

తలవొంపు' లనడనము; 'యెంకి' యభి సారికయనియు యిల్లాలు కాక పోవచ్చుననియును సందేహము కలిగించ వచ్చును. కాని మోహ పరవశయగు గడుసరియైన యిల్లాలు కాగూడదా? వయస్కయును ఒకపుడు విముఖయగుచు Coquetry జేయుచు మరొకపుడు తానే మోహావేశితయై విరహిత యగుచు నాయకు ననుసరించు ఇల్లాలుకాకూడదా! గడుసరి యిల్లాండ్రకు 'మందోమాకో పెట్టి మరిగించు కోవడము' అసహజముగాదు! కావున ఇంత మాత్రమున ఇల్లాలుకాదని ఇదమిద్ధమని పల్కవీలులేదు. ఈ యిల్లాలి ప్రేమ మాత్రము విచిత్ర ప్రేమగాదనియు సంస్కరింపబడ లేదనియు విస్పష్టము. 'సత్తెకాలపు నాయెంకి' అను పాటలో నాయికా నాయకుల సమావేశము సుందరముగా వర్ణింపబడినది. విముఖియగు నాయక స్వాధీనయగుటయేగాక పవిత్ర ప్రేమ యొక్క నిరాడంబర స్వరూపమును వెలిబుచ్చుచున్నది. అట్టె 'యేటిదరి నాయెంకి' అనెపాటలో 'యేటనరుగుల' నైనను 'సెంద్రవొంకలోను' ప్రణయాందోళనము చేయుచున్నది యెంకి. ఇట్లు కుపితయు విముఖియునగు యెంకి సౌమ్యయు స్వాధీనయునై నాయికా నాయకులనేక సారులీ పరిస్థితుల మార్పుల నొందుచున్నారు. ఐనను Coquetry చాపల్యము బొత్తిగాబోలేదు. ఈ యెంకికి 'రావొద్దె రావొద్దె' అను పాటతో fare well చెప్పి వేసిన పిదప కవికు మారుడు తననాయికను గృహిణీ పవిత్ర ప్రేమ వాహిని యందు నోలలాడించుట కుద్యుక్తు డైనట్లు గన్పడును. 'నన్నిడిసి పెట్టెళ్ళినాడే నారాజు' అను పాటలో యెంకి 'సల్లన్ని యెన్నెట్లొ సాపేసి కూకుంది' 'ఉలికులికి పడుతూ' వున్నది. ఇట్టె యెంకి "కళ్ళెత్తి తేసాలు కనకాళి సేకాలు' రానోరింటికైన రంగు తెచ్చేపిల్ల' అని గుణ గణంబుల వర్ణించుచును తాను 'పిచ్చియై కొట్లాడుతూంటె' యిరు

గమ్మ లక్కలతో యెకసక్కెం మాడుతూ' నెమ్మ నెక్కాడుతూ వున్నాదని' 'జాలిగుండెల' యెంకి యని 'నమలి మింగిన యెంకి' నా వొంకింకరాదోయి రాదోయి' యని నిరాశా పూర్ణహృదయుడై విలపించు చున్నాడు. ఇట్లు వా వోయినను 'సీకు సింతా లేక' సోకల్లె పడు కుంటుంది' యెంకి 'తోట పూసంటె' 'సీకాకుపడుతు విలపిస్తాడు నాయుడు బావ. ఇక ముందో నామాటె మాటంట' 'నా పాటె పాటంట' యెనక జల్మములోన యెవరమో, నంటి ! సిగ్గొచ్చి నవ్వింది సిలక' 'యెన్నాళ్ళో మనకోలె యీ సుకము' లంటీ ! కంటనీ రెట్టింది' అనిమౌగ్ధ్యము చాటించుచు 'సాలు సాలు' అనె పాటలోదన ప్రణయ సాఫల్య సంతృప్తిని గనుబరచు చున్నాడు నాయుడు బావ. అట్లే 'దూరాన నారాజుకే రాయడౌనో' యని తులిసెమ్మ వొరిగినదని' తొలి పూస పెరిగిందని చీకాకు పడుచున్నటులు "ఉత్తమా యిల్లాలినోయి ! నన్ను సురుపెడితే దోసమోయి !" అని తనను ప్రార్థించినటులను ప్రియు రాలి గుణ గణముల యెడల శిరఃకంపము జేయుచు పంటనేలకే పయనం' సాటేలా, మొదలగు తర్వాతి పాటలన్ని పాడియున్నాడు. ఆకటి గుండెల యెంకి' లో మందు బెట్టి మరిగించుకున్న యెంకిలో 'ఈకనుపాపలో నీడ సూసుకుంటా సుక్కెట్టుకునే యెంకిలో దాని నీడనే తొక్కుకొని సులువుగా ! కొండ నెక్కగల ప్రాభవముగలిగిన యెంకిలో భేదములేకపోలేదు. 'యెంకి'యొక్క స్వరూప స్వభావములు నాయుడు గారి తాత్కాలిక మనోగతులపై నాధారపడి అవి మారినపు డెల్ల యెంకి వర్ణనలు మారుచుండును. సౌమ్యమైనదాని నొకరీతిని విముఖయై కుపితయైన దానినొక తీరున నాయకుడు దన ప్రణయ వర్ణన గావించి నందున ఈ యెంకి వేరు ఆ యెంకి వేరనియు రెండు వ్యక్తు లనియు నూహింప వీలులేదు. మొదటి పాటలందు మోహ పరవ

ళుండుగు నాయకుడు దనవిరహ వేదనా భరంబున ప్రియుని యొక్క వింత చేష్టలనించుక నతిశయోక్తి గావర్ణించి యుండుట మిగుల సహజము. అట్టి తరుణముననే 'మందో మాకో పెట్టి మరిగించు కొన్నదని' నిందా రోపణముచేయుట గూడ సహజ వికారమే ! కావున కేవల మాయాధారములపై యెంకి పరకీయ యనిగాని లేక రెండు వ్యక్తులని గాని వాదించుట తగదు. ఒకప్పుడభిసారికయు ఒకప్పుడు స్వాధీనయు ఒకప్పుడు విముఖియు' ఒకప్పుడు చపలయు, ఒకప్పుడు రూపపూరితయు పరుషయునగు యెంకి కవికుమారుని భావనా ప్రపంచ మున ప్రణయాధారమగు నొకయేవ్యక్తి.

యెంకి స్వీయయోపరకీయయోనిజముగా కవిహృదయమునకెరుక ఆపరమాత్మునకెరుక ! కాని పాటలను జదివిన మాత్రము పరకీయ యని చెప్పుటకు వీలులేదు. ఉత్తమా యిల్లాలినోయి' అనుపాట యందు నాయకుడు కలలో గన్పడి నందున ఉలికి పడినటులను పొరు గమ్మలక్కలు 'యీబూతిపెట్టినటులు' యీపుతట్టినటులు చెప్పుచు, 'పాట నుండె యెంకి సబకు రాజేశావా? పదిమంది నోళ్ళలో పడమంటురాశాడ ?' అని విలపించు చున్నది. ఒక వేళ పరకీయయేయైనచో ఇంతటి మోహా వేశమునగూడ 'ఉత్తమా యిల్లాలి' నోయి అని ఉత్తమత్వము అప విత్రత నారోపించు కొనుటకు అసాధారణయగు గడుసరియై యుండవల యును. కాని ఇతర గీతములన్ని 'యెంకి' సరళముగ్ధ స్వభావయుక్తి ప్రపూర్ణ హృదయ యనియు చాటుచున్నయవి. 'ఆకాలపు' నాయెంకి, ముత్యాల పేరు, 'అనాటినావోడు' మొదలగు పాటలను జదివినచో, చీమసిటుకుమనడంతో మనసు చెదరి పోవడము. కాకమ్మచేతైన కబ రంపడమ్మా' యనివా పోవడము 'భావమౌగ్ధ్యమును వెల్లడించు

చున్నది. 'యెంకితో భద్రాద్రి' 'యెంకితో తిరుపతి' 'ముందుగతి' పిల్లోడు మొదలగునవి నాయికా నాయకులు దంపతులనియు భక్తి భరితులై 'ఆవుల్ని దూడల్ని అత్తోరి కాడుంచి' 'మూటా ముళ్ళెగట్టి ముసిలోళ్ళతో సెప్పి' 'కొండమెట్లన్నీని కొంగట్టుకెక్కాలె' అని సవిలాస ముగా పంతములాడుచు తీర్థయాత్రా పరులగుచున్నారనియు 'సంకలో పిల్లోడు సంబ్రాలుపడుతుంటె' సుఖముగా జీవితయాత్రగడుపుచున్నారనియు చాటుచున్నవి. కావున ఒక్కొక్కపాటను విడదీసిచూచి యెంకికనర్థ మాపాదింపక అన్నిచిత్రముల సమన్వయము గావించినచో నాయికా నాయకు లనురూపులును ననుకూలురును నగు కృషికదంపతులనియు మొదట యౌవన చాపల్యంబున నొకరి నొకరు నేమరించుచు ప్రణయ కోపాది నవయౌవన సహజ వికారము జూపుచు ఒకరి వెంట నొకరు 'నేనులో' సెట్టు పుట్టదాటి 'ఏతాముకాడ' 'అడవిలో' దిరుగుచు బాహ్య సౌందర్యలోలురై భ్రమసిన వారయ్యును, రాను రాను భావములు పరి పక్వదశనొంది ఉత్తమ దంపతుల పవిత్ర ప్రేమ యొక్క లౌకికానుభవ మును బొందుచు చిన్న బిడ్డనుగని శుభములు గన్నవారని తెలియు చున్నది.

శ్రీయుత బసవరాజు వేంకటప్పారావుగారు యెంకి పాటలకుగల గొప్ప యభ్యంతరము నొకదానిని సూచించినారు. కవి తన స్వకీయ మైన వాడుకభాషయందువలె ఇతరమగు భాషయందు తన భావముల నందముగాను అప్రయత్నముగాను వెల్లడి గావింపజాలడని వారిమతము. ఇది సత్యమే! కేవల Lyrical కావ్యము కవి తన స్వంతభాషయందే వ్రాయవలయును, వ్రాసితీరును. ఈపాటలు పాటకజనులయొక్క Lyrics భావములు యెంకి నాయుడుబావలవి. ఇవి వ్రాసినకవి Robert Burns వలె పాటకజనులందు లీనమైనవాడు గాకపోయినను,

అయినంతవరకుతనను ఆకృషీవల దంపతుల పరిస్థితులందు భావించుకొని యున్నాడు. 'కవిబ్రహ్మ తాను సృష్టించుపాత్రల స్వభావము' కనువైన భాషనే ప్రయోగిస్తాడు" అని పంతులవారు వ్రాసినట్లు పాత్రలకు సహజమగు నీభాష నుపయోగింపవలసి వచ్చినది. కాపుదంపతుల 'గోషా'లేకుండా కవి తన స్వంతభావములను ఉత్తమ పురుషకావ్యములుగా బాడునపుడు ఈభాష నుపయోగించినయెడల అది తప్పేయగును. కావున కవి తన స్వకీయ జీవితానుభవముల నైనప్పటికి ఏకారణమున నైననేమి ఇతర పాత్రముల ద్వారా పాడదలచినప్పుడు ఆపాత్రల కనువగు భాషను వాడకతప్పదు. అట్టిస్థితిలో కొన్ని సందర్భములలో భాషకంటె భావములు నున్నితముగానుండి అనౌచిత్యమునకు తావొసంగును. ఇటీవలి పాటలలో 'గోవుమాలచ్చిమి', 'పడవ' 'ముత్యాలపేరు' 'సుక్క' మొదలగు కొన్నిటిలో కొన్నిభావములు మిక్కిలి సున్నితములై సామాన్య కృషీవలులకును వారిభాషలకును సహజమగు భావముగాక సంస్కారులకు సహజమగు భావములున్నవి. కనుకనే వీటియందు భాష భావము పాత్రములు ఈమూడు ఒకటొకటికి కలియుట లేదు. Forcedness కావచ్చును. సప్రయత్నముగా కవి తనభావములను యెంకి నాయుడుబావల కారోపించినాడని స్పష్టమగును. అందువల్ల నిజముగా కొన్ని సందర్భములలో మాత్రము భావములను బట్టిజూడ భాషకు అంత Inevitability కాన్పించదు. ఈ సహజమగు Disadvantage కవిగారికిగూడ గోచరించి యుండును. 'ఉత్తమాటలునీవి పొమ్మందిరా' యెంకి కొత్తపాటలు పాడుకొమ్మందిరా' అను కడపటి గీతమున నీయనుమానము ధ్వనించుచున్నదేమో !

మొత్తముమీద తాత్కాలికముగా వెలువడిన ఖండనములు విమర్శనములు ప్రతివిమర్శనములు మున్నగునవి ఈపాటయొక్క నిజ

స్వరూప సారస్యముల నించుకైన తగ్గించలేవు. సహృదయులగు పాఠకులు వాటియందుగల మనోహరత్వము ననుభవింపకపోరు. కొన్ని కొన్ని తావుల భావౌచితికి భంగముకలిగినను మొత్తముమీద పాటలు సుందరముగా నున్నవి. కవిత్వము సరస శబ్దకల్పనము, భావసౌకు మార్యము, ధ్వనిప్రాధాన్యము, మొదలగు ముఖ్యగుణములచే రాజిల్లు చున్నయది సామాన్యమైన పాత్ర లందలి భావనీచత్వము మచ్చునకు గానరాదు, శృంగార ప్రబంధ సహజమగు ఏవగింపు గలుగజేయు వర్ణనములులేక సరసల్లాపములు నిర్దుష్టముగానున్నయవి. శైలికేవలము పాటల శైలిగాక నవీనగతులచే లలితమై యొప్పుచున్నది. వేయేల ఆంధ్రవాణి పదతలంబున కవికుమారు డర్పించిన ఈనవీన కుసుమ మంజరులు రమణీయముగా నున్నవి. నవీనవిలాసముల గూర్చినట్టి కవితా గుచ్ఛము లనేకములు వెలువడుచుండు గాతయని పరమేశ్వరుని ప్రార్థించుచు మిగుల విస్తరించిన నీవ్యాసమును ముగించుచున్నాను.

(గోలకొండ పత్రిక 18 ఆగస్టు 1926)

---

# ఉమర్ ఖయ్యామ్

పాశ్చాత్యుల ప్రశంసకు పాత్రులైన ఫారసీకవులందరిలో 'ఉమర్ఖయ్యామ్' కవి యగ్రగణ్యుడని చెప్పవలయును. ప్రాచ్య సారస్వతమునం దభిరుచిగల పాశ్చాత్యులలో 'ఉమర్' కవితామధువును గ్రోలినివారును 'టాగూర్' కావ్యామృతము నాస్వాదించనివారును మిగుల యరుదు. ఉమరుఖయ్యాము కావ్యమునకు ఫిట్జు జిరాల్డు అను ఆంగ్లేయకవి చక్కని యనువాదము చేసియున్నాడు. ఫారసీభాషరాని ఆంగ్లేయ విద్యాధికులగు భారతీయులు ఫిట్జుజిరాల్డు యొక్క యనువాద కావ్యమును తరుచు చవులూరజదివి యానందింతురు. ఆకావ్యము ననుసరించి శ్రీరాయప్రోలు సుబ్బారావుగారు రచించిన 'మధుకలశము' (భారతియందు బ్రకటితమయినది) నుండి చవిజూచినవారు 'ఉమర్' కవితయొక్క ప్రత్యేక సౌందర్యమును గొంతవరకు గమనించియుండిరి.

'ఉమర్ఖయ్యాం' కవి పారసీకదేశమునందలి ఖురాసాన్ ప్రాంతమున చేరియున్న 'నైషాపూర్' పట్టణమందు క్రీ॥ శ॥ 1015-1020 సంవత్సరముల మధ్యకాలమునజనించెననియు క్రీ. శ. 1123కు సరియగు 517 హిజిరీయందు శతాబ్దముకంటె నెక్కువవయసున స్వర్గస్థుడయ్యె ననియు దెలియుచున్నది. అతనిపేరు 'గియాసుద్దీన్ అబుల్పతహ ఉమర్బిన్ ఇబ్రాహిమ్ అల్ఖయ్యామీ' 'గియాసుద్దీన్' అను పూర్ణ నామమునకు బదులు సంక్షిప్తనామము 'ఉమర్' అనుపేర నందరిచే బేర్కొనబడుట గనుచున్నాము. 'ఖయ్యామ్' యను పదమునకు

గూడరములు నేయువాడు అనియర్థము. అనేక పారసీ కవులవలె ఈ విశేషణ మాతని పూర్వులవృత్తిని సూచించు చున్నదని పలువురు విశ్వ సించు చున్నారు. ఆ దేశపు కవుల చరిత్రమును ఆకాల పరిస్థితులను గనుగొనినచో నీ విశ్వాసమునకు బలమైన యాధారములు గలవు. ఈ కవి యొక్క జీవితచరితమును, స్వరూప గుణ విశేషములను, కవితా సారస్వమును అనుభవించి అందు ప్రీతి ఫలించిన వ్యక్తి యొక్క ప్రతి బింబమును మనోదృష్టిచే జూచియే తెలిసికొనవలయునుగాని జీవితము యొక్క వివరములు దెల్పు చారిత్ర కాధారములగు గ్రంథముల పెక్కు లేవు. ఐనను సమకాలికులగు కొందరి గ్రంథముల వల్ల 'ఉమర్' చరిత్రము గొంత తెలియుచున్నది.

ఈ మహాకవి 'నైషాపురము' నందలి, గొప్ప విద్వాంసుడును పండితుడునగు 'ఇమామ్ మునఫఖద్దీన్', వలన విద్యలనభ్యసించి, తర్కము, వైద్య శాస్త్రము, తత్వ శాస్త్రము, గణితము, జ్యోతిషము నందు గొప్ప పండితుడుగా బరిగణింప బడుచుండెను. ఇట్లు సకల శాస్త్ర వేత్తయైన ఉమరునకు గణిత జ్యోతిషముల పైనభిమానము మెండు. సమకాలికులచే గొప్ప దైవజ్ఞుడుగను శాస్త్ర వేత్తగను వర్ణింపబడి యున్నాడు. 'ఉమర్' యొక్క జీవితమునకు సమకాలిను లగు ప్రముఖులిద్దరి జీవితములతో చాల సంబంధము గలిగి యున్నట్లు తెలియు చున్నది. సల్జూఖీ రాజవంశము యొక్క మూల పురుషుడగు తోగ్రల్‌బేగ్ కుమారుడగు 'అలల్ అర్గలాన్' నకును, మనుమడు మలిక్ షాహ'కును వజీరుగా నుండిన 'నిజాముల్‌ముల్క్‌తూసీ' యీ యిద్దరిలో నొకడు 'నిజాముల్ ముల్క్' తన 'వసీయత్' (మరణ శాసనము) నందు కొన్ని సంగతులు వ్రాసియున్నాడు. 'హకీం ఉమర్ ఖయ్యామ్'

'నిజాముల్ ముల్కు' యొక్క సహాధ్యాయుడట, 'ఇస్మాయిలాను' పక్షము యొక్క సర్దారుడై (Cold man of the mountains) అను భయంకరమైన బిరుదు నొంది ఆకాలమునందా రాష్ట్రములలో హత్యలకు దోపిడులకును మతకలహములకును పెట్టినది పేరుగానుండి ఆబాల్య మిత్రుడగు 'నిజాముల్ ముల్క'ను గూడ దనకత్తికెర గావించిన హసన్‌బిన్ సబాహ్' రెండవ సహాధ్యాయియట, ఈ ముగ్గురు సహాధ్యాయులలో ముందెవడు గొప్ప పదవి నలంకరించినను దన మిత్రులిద్దరితో నాపదవి యొక్క గౌరవ సౌభాగ్యములను బంచుకొనవలయునను నొడంబడిక జరిగినదట. 'నిజాముల్ ముల్క' వజీరుగా నేర్పడిన పిదప 'హసన్‌బిన్ సబాహ్'కు ప్రాంతాధికార మిప్పించియు, ఉద్యోగముగై కొనని 'ఉమర్'నకు తగిన రాజసన్మానమును, ఉపకార వేతనము నేర్పాటు చేయించియు దన బాల్యపు టొడంబడికను నెరవేర్చెను.

'ఉమర్' గొప్ప వైద్యుడనియు రాజకుమారుడగు 'సంజార్'నకుపచార మొనర్చెననియు రాజు మెప్పు వడసెననియు దెలియుచున్నది. ప్లేటోయను తత్వశిరోమణి 'None but who can geo metrise can enter here' అనిదన Academy (విద్యా పీఠము) ద్వారమున నిబంధన వ్రాయించి కొట్టి యుండెనట. ఆ మహోక్తి ననుసరించి ఆ కాలపు తత్వజ్ఞులందరు గణితమును (తర్కనమునకు మొదటి మెట్టగు క్షేత్ర గణితము) పిదప జ్యోతిషమును ముఖ్యముగా నభిమానించెడివారు. 'ఉమర్'గూడ నట్లే స్వయముగా జ్యోతిష్యము యొక్క ఫలభాగమునందు విశ్వాసము లేకున్నను సిద్ధాంతము ఫలభాగము రెంటియందు పాండిత్యము సంపాదించెను. 'మలిక్‌షా' కాలమున హిలాలీ

శకమును సంస్కరించి తప్పుల సవరించి 'హిలాలీ' జంత్రీని సరిచేసెను. అట్లే తరుచురాజునకును వజీరునకును ముహూర్త నిర్ణయముచేయుచు ప్రశ్నోత్తరముల వలనను గొప్ప దైవజ్ఞుడుగా మెప్పు వడసెనని 550 వహిజిరీలో 'ఉమర్' యొక్క శిష్యుడగు 'నిజామీసమర్కందీ' తన 'చహార్ మికాలా' యను గ్రంధమున వర్ణించి యున్నాడు. కవిగా బేర్కొనలేదు. అంతియేగాక స్వదేశము నందును కవుల ప్రశంసకు గాని జనుల బహిరంగ సమాదరణకుగాని అతడు పాత్రుడుకాలేదు. ఆంగ్లేయ పండితుడగు ప్రొఫెసర్ బ్రౌనుగూడ దన పారసీక వాఙ్మయ చరిత్ర మునందు 'ఉమర్' మూడవ తరగతికవియని వ్రాసియున్నాడు. ఇందుకు కారణములు మున్ముందు తేట పడగలవు.

'ఉమర్' గొప్పతార్కికుడనియు శాస్త్రవేత్తయనియుపైన నుడివి యున్నాము. చతుశ్శాస్త్ర పాండితికిని (ముఖ్యముగా గణితమునకు ఈ రసపత్క వితాధారకును సామంజస్యముగాని లేక బాంధవ్యముగాని ఎట్లు కుదిరినదో చిత్రము! పండితాగ్రగణ్యుడగు 'ఉమర్' యొక్క తత్వ జ్ఞాన సూత్రములు సదాచారులగు ఆకాలపు ఇతర పండితులకు వెగటుగా దోచుటయేగాక అతని వర్తనముగూడ నిష్ఠుర నిరసనమునకు పాత్రమై యుండినదట! శాస్త్రాభ్యసనము వలన గలిగిన శ్రమనుబోగొట్టు కొనుటకో యన అపుడపుడాశువుగా జెప్పిన ఈ 'రుబాయ్యాత్' (గీత ములు) శిష్యులుగాని మిత్రులుగాని ఏర్పరచిన ఇతర సభలందు (మజాలి సునందు) చదువు చుండెడివారట. బహిరంగముగా మెచ్చదగినవి కావనియు ధర్మవిరుద్ధములగు సూత్రములను వెల్లడిచేయుచున్న వనియు బహిరంగ సభల నుండి 'ఉమర్' గీతములు బహిష్కంపబడినను ఎటులో నశింపక నిలిచియున్నవి. అసలు 'ఉమర్' చేరచింపబడిన గీతము లెన్నియని నిశ్చితముగా చెప్పవీలులేదు. హిజ్రీ 865 నందు

వ్రాయబడిన ప్రతి బాడ్లీన్ భాండాగారములో నున్నది. దాని యందు 158 గీతములు మాత్రము కలవు. ఇండియా ఆఫీసునందుగల ప్రతి యందు 326 ను, కలకత్తా Asiatic Society ప్రతి యందు 516 ను, Cam judye నందలి ప్రతియందు 801 యు, హైదరాబాద ఆసఫియా కుతుబ్‌ఖానా యందు గల వ్రాత ప్రతియందు 299 గలవు. హిజిరీ 1000 నందు వ్రాయబడిన ప్రతియందు 175 హిజిరీ 1017 యందు వ్రాయబడిన హైదరాబాదు ప్రతియందు 299 యుండుట జూడ పై యాధారములను బట్టి విచారింప, రానురాను గీతముల సంఖ్య హెచ్చినట్లు కనపడును. రమణీయములై యువకుల కానంద దాయకములగు నీ గీతములు లోక ప్రియత్వము నొందినట్లును అనేకులు 'ఉమర్' యొక్క సూత్రాన్వయము సమర్థించుచును, వివరించుచును, గీతముల వ్రాసి గురువునకు 'ఉమర్' పేరున కర్పించిరని తెల్లమగుచున్నది. క్రీ. శ. 1867 నందు ఫ్రెంచి రాయబారి J. B. Nicolas ప్రతుల నన్నిటిని పరిశీలించి భాషాంతర సహితముగా నొక ప్రతిని ప్రచురించెను. అందు 464 గీతములు గలవు. విన్‌ఫీల్డుగారు పరిశోధించి 'ఉమర్' యొక్క శైలని బట్టి విమర్శించి 500 గీతములను నిజముగా 'ఖయ్యామ్' వని ప్రచురించి యున్నారు. Misscadell వ్రాసిన ప్రకారము 'ఉమర్' వ్రాసినవని ప్రతీతిగల గీతముల సంఖ్య 1200. శైలిని, భావమును, భాషనుబట్టి విమర్శించి లెక్కించినచో సుమారు నాలుగు వందల గీతములు నిజముగ ఖయ్యామ్' వై యుండుననితోచును. సుమారు నూట యేబది గీతము లను వందకంటె తక్కువ గీతములందు సమన్వయించి Fitzgerald కవి యనువదించెను. రసవంతమగు నీ fitzgerald యొక్క కావ్య మునే మాతృకగా గొని కాటోలు రాయప్రోలు సుబ్బారావు పంతులుగారు 'మధుకలశమును' రచియించిరి.

'మధుకలశము'ను పారసీ గీతములతో బోల్చిచూచిన విశేషముగ భేదము గన్పడును. 'ఉమర్'కవి తార్కికశక్తిని మనోహరముగా లౌకిక పారలౌకిక జీవనసూత్రములపై ప్రయోగించుచు, ఆచార పరాయణులమనియు ధార్మికజీవనము చేయువారమనియు విఱ్ఱవీగు 'జాహిద్'లపైదాడి వెడలును. 'ఖయా' మొనరించు ద్రాక్షాసవస్తవము, ప్రేయసీ లాలనము, ఆచార నిష్ఠాగరిష్ఠుల నిరసనము, 'హఫీజు' మున్నగు మహాకవుల రచనలవలె సరళముగాక గొంచెము పరుషముగా నిష్ఠురముగా సత్యస్వరూప మజ్ఞాతమనియు, అజ్ఞేయమనియు, జీవితము క్షణభంగురమనియు' అందువల్లనే ఈజీవితముండు నంతకాలమున మధుసేవయు ప్రేయసీ లాలనమును జేయుచు తన్మయత్వము నొంది పారలౌకికచింతల మఱచిపొమ్మనియు హెచ్చరించును. ఈసూత్రములనే యనేక ఉదాహరణముల నిచ్చుచు వివిధ హేతువాద పూరితమగు తర్కములచేతను సమాధానములచేతను, బలపరచి యున్నాడు. చార్వకీయ నైతికతత్వములబోలు ఈసందేశములు (Fitzerald) కు నచ్చినను నచ్చకపోయినను (A. C, Benson) వ్రాసినప్రకారము వీటిని మాతృకగాగొని (fitzerald) కవి తనయ సాధారణమగు కవిత్వధారాశక్తిని వినియోగించి స్వతంత్రకావ్యమన దగియుండి తనకశానై పుణ్యమును చాటునట్టి అనువాదము నొనర్చెను. అట్లే రాయప్రోలు సుబ్బారావు పంతులుగారు 'ఖయ్యామ్'తో తన్మయత్వమునొంది మత భావ గాంభీర్యమును ధారాశక్తిని లలిత పదగుంభనము వెల్లడిజేయు 'మధుకలశమును' ఆంధ్రసోదరులు రుచిజూచుటకై రచించుట మిగుల సంతోషావహము (fitzerald) కావ్యమువల్ల ప్రసిద్ధిజెందిన 'ఖయ్యాం' యొక్క కళ తెనుగుకవియొక్క సహజసుందరమగు భాషయందు మరింత ప్రతిభావంత మగుచున్నది. తిక్కన పోతనాదుల యాంధ్రీకరణములవలె స్వతంత్రకావ్యము లనదగియున్నవి. కాని, 'ఉమర్'

యొక్క భాషాంతరములు కేవలము తర్జుమాలుకావు, ఉదాహరణమునకు మొదటి పద్యమునే జూడుడు.

ఖుర్షీదు కమందె సుబ్హొంబర్బాం అఫగండ్
కై ఖుసరవెరోజ్ బాదదర్జామ్ అఫగండ్,

అను రెండు పాదములుగల మాతృకయందలి సూర్యోదయము నెట్లువర్ణించిరో యనువాదకులు జూడుడు!

ఉ॥ లెమ్మని శాకమండలతలిన్ బడగావిసరెన్ బ్రభాతమం।
దమ్ములు జిమ్ముదిఙ్మణిని తారకలావల బోయెగాంతిసూ। త్రమ్ముల
యుచ్చులొడ్డెను సుతారపు తూరుపువేటకాడు ర। మ్యమ్మగు పాదు
షాకనకహర్మ్య శిఖాకలశాలి గట్టగన్.

సూర్యుడు గగనముపై ప్రభాతమను జాలమును వేసెనని మొదటిపాదముయొక్క యర్థము. రెండవపాదమున ఆకాశమును మధుపాత్రమనియు సూర్యకాంతులు మధువనియు నుత్ప్రేక్షగాఅర్థమును సూచించినాడు. తెనుగు పద్యములతో పోల్చి తారతమ్యము గనుడు. ఇంకొక పద్యము.

చ॥ కడునరుణమ్ముగానెచట కన్నెగులాబి జ్వలించునచ్చటన్
బడదగు మున్నుసీజరు నృపాలుని రక్తమటంచు నెంతు, నే
కడజవుదోట తొయ్యలి సుగంధసుమమ్ములు రాసిపోయు, నా
కడనొక యప్సరస్సఖినిగారపు పీడెమురాల యుండెడిన్.

పై పద్యముతో ఫారసీ గీతములనుబట్టి తెనిగించిన క్రింది పద్యమును బోల్చిచూడుడు.

చ॥ వనముల నెఱ్ఱనౌకుసుమ వారము కాంకులనీను చోటులన్.
వెనుక నృపాల రక్తము భువిన్‌బడిపేరెసు మట్టిగాగ నె
మ్మనమున నీలనీరజము మాటునదాగిన క్రొత్తయాకునన్
గనుమది కామినీ రుచిర గండయుగిన్ గలపుట్టుమచ్చయే।

ఇట్లే మధుకలశములోని ప్రతి పద్యము నుదాహరించుచు తెలుగు కవి యాంగ్లేయ కవిననుసరించి కాబోలు గావించిన మార్పుల జూపెట్ట వచ్చును. Fitzerald యొక్క యనువాదముకాని 'మధుకలశము' గాని కేవల భాషాంతరములుగాక మాతృకలోని భావములను అవసర మైనచో విస్తృతముగా లేక సంకుచితముగా మార్చి. కళా పోషణకు దగిన తొడవుల దొడిగి మనోహరముగ వ్రాయబడి యున్నవి. రస వంతములగు కల్పనలను గావించి రమ్యములగు చిత్రములను దిద్ది తమ భాషలకుందగిన యలంకారములను దొడిగి 'ఉమర్' గీతములకు వన్నె బెట్టిరి. ఫారసీ భాష యందు సహజ మాధుర్యముగలిగియు 'ఉమర్' గీతము లాంధ్ర పద్యములంత లలితముగా నుండవు. ఆంధ్ర పద్య ములందు వలె 'ఉమర్' నైతిక సందేశములు ఫారసియందు అలంకార ములను నాచ్ఛాదనముల నుండి తొంగిచూచుటలేదు విస్పష్టముగాను నిస్సందేహముగాను ఎదుర్కొనును. ప్రతిభాషకు కొన్ని గుణములు దాని వారసత్వమును బట్టి (పూర్వ చరిత్రమును బట్టి) కలుగును. ఫారసీ భాష యందు 'సూఫీ' తెగకు సంబంధించిన భక్తులుగాని సామాన్య కవులుగాని, ఇస్లాం మతమునకు విరుద్ధమైనప్పటికిని, మధు వును, పాన పాత్రను పాత్రలందిచ్చు 'సాకీ' మున్నగు విభావ సామ గ్రిని పరిత్యజించలేదు. భక్తి పూరితములగు కావ్యములందును ద్రాక్షాసవమునకు మిక్కిలి గౌరవముగలదు. ఫారసీభాష యొక్కయు జాతి యొక్కయు చారిత్రిక వార సత్వ పరిణామ మది.

పై కారణముల వలన 'ఉమర్' పేర్కొన్న మధువు కేవల ద్రాక్షా రసమో లేక, 'అంబు జోదర దివ్య పాదార వింద చింతనామృత' మో, కామించిన ప్రేయసి కేవల చంచలాక్షియో లేక పర బ్రహ్మమో, యను ప్రశ్న పలువురను బాధించినది. కొందరు చరిత్రమును బట్టి చూడ 'ఉమర్' సంతోషప్రియుడనియు, భోగపరాయణుడనియు, తరుణీలంపటుడనియు దెలియుచున్నది కావున నతని గీతములు, పాంచ భౌతిక శరీర ధారిణియగు నొకానొక లతాతన్విని గూర్చిన పలవరింతలు గాని పారలౌకిక వాంఛలచే బీడింపబడిన భక్తుని ప్రణవని వేదనములు కావని యభిప్రాయపడినారు. మరికొందరు తత్వజ్ఞానియు సూఫియు నగు హకీం ఉమర్ ఖయ్యామ్ అతికాంక్షతో వలచిన భోగము కేవల భక్తి పార వశ్య జనితా నందా తిరేకమనియు, త్రావిన మధువు భగత్పాదారవింద ధ్యానామృతమనియు, కామించిన పరాశక్తి సచ్చిదా నంద స్వరూపమగు పరబ్రహ్మమేయనియు నిరూపించెదరు. నిజమేమో 'ఉమర్'నకును వాని దైవమునకే తెలియును! కాని ఇది మిథ్యమని ఇతర సూఫీ కవుల తెగనుండి బహిష్కరించి ఉమర్ యొక్క ప్రణయ మును 'యిష్కెహకీకీ ? (దైవ భక్తి) నుండి యిష్కేమజాజీ (లౌకిప్రేమ) లోనికి దిగద్రొక్కుట కాధారములు గనపడవు. అనేక గీతములు ద్వ్యర్థి పరముగా నున్నను కొన్ని గీతములు దైవ పరముగాక యర్థమే కావని సకలసమ్మతము. కొన్ని కేవలైహిక సంబంధము లనిగూడ చెప్పవచ్చును. కాని అంతమాత్రమున 'ఉమర్'ను పాశ్చాత్య పండితుల వలె చార్వాకీయుడనిగాని ఎపిక్యూరియన్ అనిగాని తలంచుట గొప్ప పొరపాటు. శృంగార కవిత్వముయొక్క పరిభాష నుపయోగించుట సూఫీల సుప్రసిద్ధమైన యలవాటు, 'మౌలానారూం' 'జామీ' 'హాఫీజు' 'నర్మద్ నర్మస్తు' మున్నగు సూఫీమహాకవుల వాఙ్మయము నందనేక గీతములందు 'ఉమర్' యొక్క భావములే స్పష్టముగా ధ్వనించును.

ఆర్యుల వేదాంత తత్వముల నప్పటికే సూఫీలు కొంత వర కంగీకరించి యుండిరి. క్రీ. శ. 923వ సంవత్సరము 13వ మార్చి తేదిన 'అనల్ హక్' (సోహం బ్రహ్మ) యనితపస్సుజేయు 'మన్సూర్ అల్‌హల్లాజు' నకు ఉరిశిక్ష విధింపబడి యుండెను. మన్‌సూర్ యొక్క తత్వము సర్వ సమ్మతము బడయకున్నను సూఫీతెగవారు మహమ్మదీ యేతర సిద్ధాంతము లగు సాంఖ్య సిద్ధాంతములను గ్రీకుల నియోప్లైటా నిజం యొక్క తత్వములను స్వీకరించిరి. సత్య స్వరూప మజ్ఞేయమనియు, సర్వాంత ర్యామియగు శక్తి నిర్గుణమనియు, జీవుడు కర్మబద్ధుడనియు, జీవితము క్షణ భంగుర మనియు కావున ప్రేమయే (భక్తియే) ముక్తిసాధన మనియు సూఫీల యుపదేశము. వైరాగ్యమును గూడ నొక సాధన ముగా నంగీకరించినను జీవిత సామగ్రి నుపయోగించు కొనవలయు ననియే వారి యభిప్రాయము. ఐహిక ప్రేమ దైవభక్తికి మార్గ దర్శకమని వారి మతము. అందు వల్లనే స్త్రీ పురుషుల భేదము లేకుండ (అనగా ప్రేమింపబడిన వ్యక్తి స్త్రీయైననుగా వచ్చును పురు షుడైనను గావచ్చును) ప్రణయము లోనికిదిగి శృంగార రస పరిప్లుత ములగు గీతములను బాడి యున్నారు. అట్లే పారసీకుల పూర్వా భ్యాసమగు మధుసేవయు కవుల కుత్ప్రేక్ష సామగ్రిగను భక్తులకు పార వశ్య చిహ్నముగను ఉపకరించెను, సూఫీకవులందరి కీగుణములు సామాన్యమగునవియే. అట్లైన ఉమర్‌ను వారలనుండి ప్రత్యేకించు గుణము లెవ్వి? 'ఉమర్' వ్రాసినంత నిష్ఠురముగాను నిర్భయముగను ఇతరులు వ్రాయలేరు. లోకవ్యవహారములను విమర్శించునెడగాని, లేక శంకాతంక మనస్కుడగుజిజ్ఞాసువుయొక్క ఆత్మీయాందోళనమును వెలిబుచ్చు నెడగాని, తాము నిజమని పరిగ్రహించు తత్వముల నుపదే శించు నెడగాని 'ఉమర్' జూపెట్టు నిశ్చలబుద్ధియు, జంకులేమియు యిత రులయందు గనము. అందువలననే శక్తివంతముగను పరిణా

మకరముగను, ఆకర్షకముగను గన్పడును. అందువలననే ఎపిక్యూరియన్ అను పేరునకు బాత్రుడై యశమునో అపయశమునో పొందుచున్నాడు. కాని తాత్వికముగా మిక్కిలి భేదములేదు. 'ఉమరు' యొక్క తత్వసూత్రములను సోదాహరణముగా వివరించినగావి స్పష్టముగా తెలియదు. ఈవిషయము గూర్చి యింకొకవ్యాసమున జర్చించెదను.

(సుజాత జూలై 1927)

---

# ఈశ్వర తత్వము - ఉమర్ ఖయ్యాం

'ఉమరు' నాస్తికుడా, ఆస్తికుడా ? అజ్ఞేయ వాదమునందును నాస్తికవాదమునందును చాల భేదముకలదు. ఉమరు కవిత్వము నందీశ్వరుడు లేడని సాధించు గీతములు కనబడవు. ఇందుకు వ్యతిరేకముగా ననేక గీతములందీశ్వరుని సగుణాత్మకమగు స్వరూపమును పురస్కరించుకొని విప్రలంభ రూపముగను, యితర రీతులను దూల నాడుచున్నాడు.

ساقی قدحی کہ کار سازست خدا
در رحمت خود بندہ نوازست خدا
می خور بہ بہار و بار طاعت مفروش
کز طاعت خلق بے نیاز ست خدا

చ॥ సకియరో ! పాత్ర నింపుమొగి సర్వఫల ప్రదుడీశ్వరుండు తా
సకల జనాళినిఁ దనవిశాల కృపారస వృష్టి బ్రోచెడుఁ
బ్రకట వసంత సీధురస పానముజేసి దురంతమైన సే
వకతదొరంగు మాప్రభువు బానిస సేవల గోరడెన్నడుఁ.

ఇంకొకటి జూడుడు.

ఉ॥ పాపము పాప మంచు మరు బాపురె వా విడులేల సం
తాపము బొంది గాసిలిన దక్కదు లాభము లేశమేనియుఁ
పాపముజేయకెవ్విధి కృపారస పాత్రుడు జీవుడౌనొ ? యీ
పాపులకై కృపాప్తి భగవంతుడుకై కొనె చింతలేటికిఁ.

చూచితిరా! ఉమరు యొక్క తర్కము ?! భగవత్కల్యాణ గుణంబులను సార్థకమొనరించుటకయిన బాపముజేయవలయునట! మరి యొక చిత్రము.

ناکرده گناه در جهان کیست بگو - آنکس که گناه نکرد چون زیست بگو
من بد کنم و تو بد مکافات دهی - پس فرق میان من و تو چیست بگو

చ॥ ధరనపరాధ మెన్నడును తప్పియెజేయని వాడెవండు ? యా
నరుడెటు లిజ్జగంబున మనఁ గలిగెఁ దురితంబు జేయకే ?
దురితములే నొనర్చెదను, దుష్టఫలంబుల నిత్తువీవు శ్రీ
హరి! మరిభేదమున్న నిసుమంత వచింపుము నీకునాకునున్.

పాపకర్మలు, వాని ప్రతి ఫలంబని చెప్పబడు శిక్షా విధానము, రెంటి విషయము తీవ్రమైన యాక్షేపణకదా! ఇందు సంబోధింపబడిన యస్తిత్వమెద్ది ? ఈ క్రింది పద్యమును గమనింపుడు. అందు విస్పష్టముగా పిలిచి పాత్రమును బడద్రోసిన నేరము నారోపించు చున్నాడు.

ابریق مرا شکستی ربی - بر من در عیش را ببستی ربی
بر خاک فگندی می گلگون مرا - من مست نیم تو مستی ربی

ఉ॥ ముక్కలుగా బగిల్చితివి మోహనమౌ మధుపూర్ణపాత్రముఁ
మక్కువగూర్చు భోగమణి మందిరద్వారము
మూసినావు మేల్
చిక్కని ద్రాక్షలందొరసి చిందుగులాబిరసంబు మంటిపై
గ్రక్కున జల్లమత్తుడవు గావెహరీ! యెటులేను మత్తుడఁ?

ఇటువంటి వెన్నియో 'రుబాయీలు' గలవు. వీనిని జదివిన నీశ్వరతత్వము లేదను నాస్తికవాదమునకు ఉమరు దిగలేదనియు, ఆతనిని నాస్తికుడనుట గొప్పపొరపాటనియు స్పష్టమగును.

# తత్వజ్ఞానము.

అట్లైన నీశ్వర స్వరూపమెద్ధి ? జీవునికి ఈశ్వరునికి సంబంధ మేమి ? అను ననేకపరిశ్నలు బయలుదేరును. ఈప్రశ్నలన్నిటికి 'ఉమర్' యొక్క ప్రత్యుత్తరమొకటే సత్యస్వరూప మజ్ఞేయము ఈశ్వరతత్వజ్ఞానము దుస్సాధ్యము. ఈతత్వమునే యనేకభంగుల జెప్పి యున్నాడు.

చ॥ అరుగగ దోవలే దిల రహస్య పటాంతర సీమకేరికిఀ,
ఎరుగరు రాకపోకలకు నెయ్యది, యాత్మకు కారణంబొ, యె
వ్వరి నిధరాశయాంతర నివాసముదప్ప మరొండులేదికె
వ్వెరవున చిత్రమిక్కథయు వేగిరమంతము నొందదక్కటా

మ॥ అలనా డీడిచి వైచితీ విచట నాయాసంబుతో నెట్టులో
నిలజీవించి గడించు విస్మయముగా కింకేఫలంబొందమిఀ
కలప్రాణంబులు వీడజాలక మహాకష్టంబుతో నేగితిఀ
దెలియంజాలను రాకపోకలకు నుద్దేశంబు నీ యున్కికిఀ.

చూడుడు !

చ॥ నిగమ విచారబుద్ధులయి నిష్ఫలశాస్త్ర వివాదపంక మం
దొగిదిగి 'యస్తి' 'నాస్తి'యను నూహలమై గరగంగ
శూన్యులై
బొగిలెడు వారలీ ఘనతమో వృత ర్రాత్రము నీదిదోవ దీ
య గనక నెప్పికొన్ని కథ లంతటితో విరమింత్రు నెచ్చెలీ !

మ రి యు

చ॥ కరమనురక్తి భావనలగాంచి పరార్థపుమేలి ముత్తెపుఀ
సరులనుగూర్చి, తత్వముల సారమిదంచు వచించుపెద్దలుఀ
పరమరహస్య సూత్రముల భావమెుకించు కెరుంగలేదు, తీ
వరముగ నెవ్వియోబలికి వార్తలు, నిద్రలు జెంది రక్కటా !

ఇటులే శాస్త్రములన్నియు గురువుల వలన నభ్యసించితిననియు తెలిసిన వారిని సేవించి విచారించితిననియు, సత్య స్వరూపమును నిర్ణయింప జాలరనియు వాపోవుచున్నాడు. ఒకప్పుడు విజ్ఞానము కలిగి, నటుల భ్రమపడియోలేక నిజముగా జ్ఞానతేజము కనుల కగుపడియో.

చ॥ ఒకతృటి జాలునాస్తిక మహోదధిదాటి పరాత్పరుఀ దయా
ప్రకటితుగాంచి శంకలను బాసి సునిశ్చితబోధ మందగఀ
సకియరొ ! యిట్టిమేలి, నిముసంబది దుర్లభమందు ప్రీతితో
సుకపడ నబ్బు కాలమును జూడగ నీ నిముసంబిదొక్కటే.

అని ఆత్మశాంతిని ధ్వనింప జేయుచున్నాడు. మరి యొకసారితన తత్వము నీ క్రింది విధముగా ప్రకటించు చున్నాడు.

చ॥ అదివెల లేని మానికము; అబ్బెడు వేరొక కోనయందు, పొ
మ్మదిసరిలేని మౌక్తికము; అందునవేరొక చిప్పనుండెడిఀ
'అది' 'ఇది' యంచు నూరకయె యాతురపెట్టుదు
మీవునేనునఀ
వదలక, ప్రేమగాథలకు వాఙ్మయ మింకొకటుండగావలెఀ.

# జీవన్మి ధ్యత్వము

ప్రపంచములోని ప్రతివస్తువు భౌతికమనియు, మానవుడు మరణానంతరము మన్నైపోవుననియు, క్షణభంగురమగు నీజీవితము దాటిన పిదప మరియే యాశలేదనియు, స్వర్గ నరకఫలములు కేవలము కథలనియు ముమ్మారు నొక్కి చెప్పుచున్నాడు.

చ॥ సరసుడు మిత్రుడిష్టుడును సన్నిహితుం డొకరుండులేక, యొం
టరిగను భూమిగర్భమున డాగిపరుండెదనెన్నియేండ్లొ, నీ
ధురసము ద్రావుమింపుగ వధూమణి ! తెల్పకు మీరహస్యమె
వ్వరికిని, విచ్చబోదికను వాడిన పుష్పమ దెన్నినాళ్ళకుఀ,

మ ఱి యు

ఉ॥ మాసిన జీవితాంశుకము మారదుక్రొత్తదిగా గనెన్నియుఀ
జేసినకార్యముఀ మనకు జేకుర దిష్టఫలానుసారియై
ఓసఖి! ద్రావుమమ్మ మధువు న్నది గిన్నెల నిండ చింతలే
కాసవపాత్రముల్ బగిలియన్నియు మన్నయిపోకముందుగఀ

ఈ భౌతిక జీవితము ముగిసినపిదప మరియే యాస లేదనియు తరువాత సంగతులన్నియూహలనియు, భౌతిక జీవితముగూడ క్షణభంగుర మనియు, ఈ ముదిసినభూమిపై ప్రతియడుగు మిగుల జాగ్రతగా నిడవలె ననియు, ఎందరో చక్రవర్తులు, ఎందరోసుందరులు స్వల్పములగుతమ జీవిత యాత్రల జాలించి మంటియందు గలసిరనియు మిగుల విషాదముతో జెప్పుచున్నాడు.

చ॥ అలసెలయేటితీరమున నందపు పచ్చికమొల్చె వేలుపు
న్జెలువల మోవిపైనిది....నటించు దలంచి, దానిపై
బలముగ పాదమూనకుడు వంచక భావమునుంచకివ్వి ,యే
జలజముఖీక పోలముల సానల దీరిన మేలిమొక్కలో.

మ ఱి యు

చ॥ హరిణము బిడ్డలన్ బెనిచెనక్కట! సింహము విశ్రమించెడిన్
ధరణివిభుండు 'బ్రహ్మము' సదామధువానిన సౌధమందు, నా
నరపతివేటలాడెను వనంబులలో మనుబిళ్ళనవ్వియే
యరమరలేక యిత్తరిని నాతనుజేరు సమాధిత్రవ్వెచున్,

వే ఱొ క చో

చ॥ మనమిటు రాకమున్నగనె మానిని, రేలుబవళ్ళనుండే నే
ఘనమగు కార్యమొసలుపగా గగనంబిటులే భ్రమించు చుం
డెను; పదిలంబుగా పదము నీవిటబెట్టు ధరిత్రి నిద్దియే
కనకసుగాత్రిమోహనపు కన్గవరెప్పల మట్టియో చెలీ!
అని హెచ్చరించు చున్నాడు. మరియొకచో,

మ॥ మున్నీపాత్రిక రూపుడౌ నరుడు దామోహించి దుఃఖించెనో
యన్నా! నావలె కామినీ శిరమునందల్లాడు ముంగుర్లపై
నున్నాడాసతో; చూడు మిక్కలమునందున్నట్టి హస్తాగ్రమున్
ఎన్నాళ్ళాయెనో, ప్రేయసీగళము నన్వేయంగ నీహస్తమే

యని విషాదగీతము బాడుచున్నాడు.

చ॥ ముదిసిన తూర్పుకొండలివి 'మోసెసులుఁ' పదివేలువచ్చిచూ
చిదివము జేరి; రీగుడిని 'జీసను' లెందరొ పూజసల్పినా;
రిది పదివేల 'కైజరులు' నెక్కిన సౌధవతంసమందు; రి
య్యది 'కిసురాలు' లక్షలు విహరము జేసినగూడ నెచ్చెలీ!

అని జగముయొక్క పురాతనత్వమునో లేక జీవితముయొక్క క్షణభంగురత్వమునో చాటుచున్నాడు. అటులే యీజగమందు తమ కర్మ బద్ధములగు ఫలముల ననుభవించి జీవులు వచ్చి పోవుచుందురని చెప్పచున్నాడు.

ఉ॥ ఈ జగమందు పాతగిల రెవ్వరు, క్రొత్తగనుండ రెవ్వరా
యాజనులందరుఁ దుదకు నన్నియభీష్టములొక్క టొక్కటే
రాజిల గాంతురో సకియ! రంకుజగంబిది యేరివెంబడిఁ
బోజన, దెల్లకాలమును పోయిరి వచ్చిరి పోదురెందరో!

మ ఖి యు

చ॥ తిరిగితి నెంతయోసఖుని దివ్యకవాటము చుట్టుముట్టునే
నరిగినపట్ల నల్గడల నారసియారసి వేసరిల్లితిఁ
ఎరుగుము మూలసూత్రమిది యిప్పథమందు జరించివచ్చి యొ
క్కరుడునువచ్చు ద్రోవబడి క్రమ్మరబోక మనంగ లేదిలఁ.

స్పష్టముగా కర్మ తత్వమునుగాని లేకపునర్జన్మ తత్వమునుగాని ఆతడంగీకరింపలేదు. కాని కొన్నిగీతములం దీతత్వములు కవి మనసు నాందోళన మొనర్చిన చిహ్నములు గలవు. మానవుని ఆత్మశాంతిని సర్వదాభంగ మొనరించు విశేషమేదేని గలదేని అది జీవితము యొక్క

విషాదకరమగు క్షణభంగురత్వము. తత్వజిజ్ఞాసకు మనుజుని బుద్ధిని బలవంతముగా నీడ్చుకొని పోవుశక్తియే. యిది జీవితనాటకము యొక్క యీ విషాదాంత కథ జిజ్ఞాసకు ప్రోత్సాహకరమైనను, జిజ్ఞాసువు పరమ భక్తుడు కావచ్చును. విరాగి కావచ్చును. లేకకేవల నాస్తికుడో లోకాయతుడో చార్వాకుడో కావచ్చును, లేక మార్గమధ్యమున దృక్పథ మనేక విధములుగ మారి వివిధములైన తెగలుగాను తరగతులుగాను ఏర్పడ వచ్చును. జిజ్ఞాసువులయొక్క మార్గమున 'ఇంత వరకే' ఇక ముందువలదు (Thus far and no further) అను నవధి వాని సామర్థ్యమునుబట్టి కలుగును. ఉమరున కీమార్గమధ్యమున గలుగు శంకలను, ఆటంకములను మనోహరముగ వర్ణించి యున్నాడు.

చ॥ తెలతెలవారె పానగృహ తీవ్రవని నాదము వీనులంబడెఁ
తెలియుము మత్త! మేల్కొనుము తియ్యని ద్రాక్షరసంబు
గ్రోలు మీ
వల నిదురింపజెల్లునె? నివాసము తథ్యమె ? జీవితంపు ని
ర్మల మధు పాత్రనింపుకొని ప్రగ్గకపూర్వమె పాత్రనింపుమా!

అని మత్తజనాళినాకర్షించి వారిని కర్తవ్యపరాయణుల జేయ ప్రయత్నించుచు నెలుగెత్తి పిలుచు చున్నాడు.

ఉ॥ మత్తజనాళి గేరుటయె మానుము, మద్యము గ్రోలకున్న నీ
చిత్తము, కోపగించునెడ చేరివిరించిని వేడుకొందు, 'నే
బొత్తిగ ద్రాగ' నంచిటుల బూటకముల్ పలుకంగనేల? పే
రెత్తిన ఘోరకృత్యముల నెన్ని యొనర్పగలేదు. మిత్రమా!

అని మిత్రుల జడిపించు చున్నాడు. ఒకవంక దెబ్బది రెండు విధముల వివాదములనిరసించుచున్నాడు. వేరొకచో,

చ॥ గురువర! మాయభీష్టమొనగూడగ నిమ్మొక సారియైన నీ
వరచుటమాని దైవపథమందు జరింపగ నిమ్ము మమ్ము నీ
తెరవులు మంచివేయగుచు తిన్నగ జూడగలేవుగాని, వం
కరగనిపించు, పొమ్మికను కన్నుల కంజన సేవసేయగన్.

అని గురువునకు తిరు మంత్రముపదేశించు చున్నాడు.

ఉ॥ భూజల మిశ్రమంబుననె బుద్ధి యుతున్ ననుగన్ననాడె, నా
డీజగమెల్ల దుఃఖముల నిచ్చిననున్ బరితుష్టజేసె, మి
త్రా! జడింప నేలనను 'త్రాగకు త్రాగకు' మంచు పల్మరున్
వేజని త్రాగకుండుటకు వెచ్చము రొక్కము లేమి చాలదే?

అని దైన్యముట్టి పడబలుకు చున్నాడు.

మ॥ నెలయేటన్ బ్రివహించునీరును........సమీరంబులన్
బలె. నీనావయసందు నీదివసమున్ వ్యర్థంబుగా బోయె, నే
నిల జీవించిన యిన్నినాళ్ళు వ్యసనంబింతేని నీరెండు, రో
జులకై దాల్పననాగతాగత దినస్తోమంబు గాంక్షించుచున్.

అని అనాగత కాల చింతల బారదోలు చున్నాడు. 'రేపు రేపు' అను మాట మరచి పొమ్మనియు, ఎన్ని 'రేపులు' యెన్ని 'నిన్న' లందు గలసిపోలేదనియు హెచ్చరించు చున్నాడు. వేరొకచో,

ఉ॥ 'మాపని' 'రేప'టంచు మధుమానిని సేవ యొనర్పవాయిదాల్
బాపురె! చెల్లునే? మధురభాషలచే నెర దప్పి యారునే?
పాపనెలన్ శశాంకముఖి పానము సేయుము దివ్యసీధువే
లోపములేక, వెన్నెలలు లోకులు కోరిన యప్డుగాయునే?

ఇటులే జీవితాదర్శ మీక్రింది విధముగ బ్రకటించు చున్నాడు.

ఉ॥ ఆసవపాత్రముᳲ, మధువు నందపునెచ్చెలి తోట సీమలుᳲ
ఆసవహింపగా మనకు నంతకు మిక్కిలి స్వర్గమేది లే
దోసఖి! స్వర్గమున్నరకమున్న తెరంగు నెరుంగ బోకుమా
వాసముజేసె నెవ్వడట? వచ్చెనెవండటనుండి క్రమ్మరᳲ.

మఱియు

ఉ॥ పాంథుడు మత్తుడై సతము పాయని మైమర పొందుగాత,కా
మాంధతవిహ్వలుండగుచు మానము గోల్పడుగాత, నిట్టి యే
యంధతలేక మేల్కొనిన నిన్నిటి చింతదహించు; త్రాగి ని
ర్భంధముగాగ మత్తిలుము పాడై తేమి జగంబదెట్టులᳲ.

అని పాంథుని నాశీర్వదించు చున్నాడు.

ఉ॥ భాసుర చంద్రకాంతులను, భావమనోజ్ఞవిలాస సంపదᳲ
భాసిలు సుందరిᳲ, వికచపద్మ సుగంధిత మూరిజేసి, 'నీ
వాసలుగొప్ప చూడ్కులతొ నచ్చెలి జూడకు' మంచుజెప్పుదీ
వాసవ పూర్ణపాత్రమును నడ్డముబట్టిన నేలజారదే?

درمیان قعر دریا تخته بندم کردی - باز میگوئی که دامن تر مکن هشیار باش

అని ఈశ్వరుని ప్రశ్నించు చున్నాడు ఇంకొక ఫారసీ కవి.

గీ॥ గాఢతమ మైనయిట్టి యగాధ జలధి - మధ్యపర్యంకమును గట్టి "మలిన మగును, తడిసిపోవును కట్టిన యుడుపులెల్ల భద్ర" మని హెచ్చరించుట పాడియగునె?

అని యీశ్వరునితో వాదించినాడు. ఇట్టిగీతములు కొన్నిభక్తి పారవశ్యమున బాడిన పరమవైష్ణవ శిఖామణియగు నాళవందారును జ్ఞప్తికిదెచ్చును. బాలురు తమ తల్లిదండ్రుల పట్లజూపు నిష్ఠుర లాలనములుగా గన్పడును.

అనేక గీతములు సత్యవర్తనమును, పరోపకారమును శ్లాఘించుచున్నవి. బాహ్యచిహ్నములకు ప్రాముఖ్యము నొసంగి, సదాచారులమని నిక్కు 'జాహిదు'లను సత్యమును త్యాగమును అవలంబింపవలయునని హెచ్చరించుచున్నాడు. ధనమును, పదవిని, గౌరవమును గర్హ్యముగా జూచుచున్నాడు.

ఉ॥ న్యాయముగా విరించి మన కన్నము బంచి విధించెనెంతయో
సూ, యణుమాత్ర మందు బొడసూపవు హెచ్చులుతగ్గు
లేమియుఁ
బాయనిరక్తి గల్గినవి పంచుక తృప్తిని బొందగావలెఁ
స్వీయమనోగతిఁ నడువ జీవిత సర్వవిముక్తిగావలెఁ.

ధన గౌరవముల గురించిన వైరాగ్య మొకప్పుడు 'ఋణంకృత్వా ఘృతంపిబేత్' అను సందేశమువలె నుండును. అటులే,

ఉ॥ ఏనుగతించినఁ శవము నేమరకఁ మదిరాఘటిన్మృత
స్నానము సల్పుడీ నవరసాన్నము పిండములేల ? మద్యమే
పానమొసంగుడీ; ప్రళయపాతమువేళను నిష్టమేనిన
గ్గానగ...........కమ్మనితేనియ జిమ్ముచుండుమా
పానగృహాంగణస్థలిని బాలసమీరసువాసనావళుల్.

అని చాటునపుడు,

శ్లో॥ 'పీత్వాపీత్వా పునఃపీత్వా యావత్పతతి భూతలే'

అను శ్లోకము స్మరణకు రావచ్చును. కాని సక్రమముగా జదివి సూఫీకవుల వాఙ్మయముయొక్కరుచి నెఱిగి, ఉమరు కాలము వరకింకమీ సూఫీలతత్వములు పరిపూర్ణరూపముల దాల్చియుండలేదని గమనించినచో, కవి యుపదేశములపైనను, నిరసనభావముపట్లను శుద్ధ మగు నేకేశ్వర వాదముతో సాంఖ్యసిద్ధాంతములను, యోగసూత్రములను బౌద్ధతత్వములను సమన్వయించు ప్రయత్నమున మార్గమధ్య మందుం డిరని తోచును. అట్టి జిజ్ఞాసను మనోహరముగను, శాశ్వతముగను, చిత్రించిన ఉమరు సమాధిపై 'హీరాత్' పట్టణమునం దుద్యానలతాదులు తమ సుమముల వర్షించుచుండుట యోగ్యమని చెప్పవచ్చును. ఉమరు యొక్క శిష్యుడగు 'నిజాము సమర్ఖందీ' నిధనమునకు పూర్వము 'బలఖ్' పట్టణమున గురువును దర్శించిన సమయమున నేదోప్రశస్తి యందు "నాసమాధిపై నెల్లప్పుడు పువ్వులవాన కురియుచుండు"నని పలికెనట. కొన్నిసంవత్సరముల పిదప నిజామి గురుసమాధి దర్శ నముజేయ "హీరాత్" పట్టణమునకు బోయి నిజముగా పుష్పవర్షముల గురిపించు లతాదుల నీడలందు సమాధిని గాంచి భక్తిపూర్వకముగా నశ్రువులచే తడిపితి నని వ్రాసియున్నాడు. ఇట్టి మహనీయుని యశ స్సును రోజా పుష్పములు తమ నిరంతరదృష్టిచే చిరస్మరణీయముగా నుంచుగాత.

(సుజాత సెప్టెంబర్ 1927.)

# కాకునూరి అప్పకవి జన్మస్థానము

ఆంధ్ర లక్షణ గ్రంథములలో నగ్రిగణ్యమైన "అప్పకవీయ" మునకు కర్త "కాకునూరి అప్పకవి". తమ కాలమును, నివాసస్థానమును స్పష్టముగా వ్రాసికొనిన తెలుగు కవులు చాల తక్కువ. అట్లు స్పష్టముగా వ్రాసిన వారిలో అప్పకవి యొకడు. ఇతడు ఆధునికుడు, శా. శ. ౧౫౭౮ మన్మథ నామ సం॥ శ్రావణ బ॥ ౮ (క్రీ. శ. ౧౬౫౬ ఆగస్టు ౩) దినమున దేవుడు కలలోనికి వచ్చి గ్రంథము వ్రాయుమని చెప్పెనని వ్రాసికొని యున్నాడు. (పీ. ప. ౩౩) దశమి గురువారము (ఆగస్టు ౪ నాడు) కవి గ్రంథము వ్రాయ నారంభించెను. (పీ. ప. ౯౭) ఇటు అప్పకవీయము వ్రాయబడి (౨౭౬) సవంత్సరములైనది.

ఈ కవి తన గ్రంథమును కామేపల్లి గోపాలస్వామి వారి కంకితము చేసినాడు. గ్రంథము వ్రాయునపుడు కవియు నా గ్రామమందే నివసించుచున్నటు లగు పడుచున్నది. ఈ కామేపల్లి గుంటూరు జిల్లా యందలి పల్నాడు తాలూకాలో నున్నదనియు, అపుడీ గ్రామము తంగెడు సీమలోనిదనియు, అగ్రహార మనియు కీ. శే. శ్రీ లక్ష్మణరావు గారు తమ విజ్ఞానసర్వస్వమున వ్రాసియున్నారు. కవి తన స్వప్న పత్రికారమును వివరించుచు,

"దండకాటవి నాంధ్రాభిధానపుణ్య
దేశమున శ్రీగిరీశాన్యదిశను, గొండ
వీటి పడమట దంగెడ విషయమునను
గామెపల్లిని గోపాల ధామమునను" (ప. ౩౪)

అనిచెప్పినందున స్వప్నము కామెపల్లిలో కలిగినందునను, కృతిని దనకిష్ట దైవంబైన "గామెపల్లి నున్న చక్రపాణి" కంకితము చేసినందు వల్లను ఈ గ్రంధమును వ్రాయునపుడు కామెపల్లిలో నివాసము జేయు చుండినట్లు తెలియుచున్నది. కానిమున్ముందు, మాతృసంబంధులగు (మదీయ) బంధువులు గూడ నందుండి రనియు వారు 'గృత ప్రబంధు లును నీతి యుగంధరులు' గావున దన్ను ప్రోత్సహించిరనియు చెప్పుకొని నందున (పీ. ౬౬) ఈ కామేపల్లి అప్పకవి యొక్క మాతుల గృహ మేమోయని లక్ష్మణరావుగారు గావించినది మిగుల సమంజసమైన యూహ. మేనమామ యొద్ద నుండి గొప్ప పండితుడై పేరువడసెనని ఈ కవి విషయమునగల లోకోక్తి సత్యముగా గన్పట్టు చున్నది.

ఈ కామేపల్లి కొండ పీటికి పడమటను, శ్రీశైలమునకు ఈశాన్య మందునుగల తంగెడు సీమలో నుండెను. "ఏలేశ్వరమునకు తూర్పుననేడుయోజనములు దూరముగాను, కేతవరమునకు నైఋతి దిక్కున మూడుయోజనములు దూరముగాను, "సహ్యజా దక్షిణైక యోజననివేశ" యనుటచేత కృష్ణకు దక్షిణమున నొక యోజనము దూర ముగా నున్నట్లు తెలియుచున్నది. అని శ్రీ॥ గిడుగు సీతాపతి పంతులు గారు వ్రాసినారు. అట్లు వ్రాసియు క్రిందనే "అప్పకవికి నివాసస్థానమైన కామేపల్లి ఇపుడు లేదని శ్రీ అక్కిరాజు ఉమాకాంతంగారు చెప్పినారు" అని వ్రాసిరి. కృష్ణానదికి దక్షిణమున యోజనదూరమున ఉన్న ఈ కామేపల్లి ఏదో ఇప్పటికిని నిశ్చయింపలేకున్నాము. ఈ విషయము జిజ్ఞాసువులకు పరిశోధనీయము.

గ్రంధకర్త "కాకునూరి" అప్పకవినని వ్రాసికొని నందునను, తన వంశాభి వర్ణమునందు "కాకునూరి సోమన, కాకునూరి తిమ్మన యని దన వారిని బేర్కొనినందునను,

" వేదశాస్త్ర పురాణాది వాదములను
గాకునూరింటి జేసిన కారణమున
గాకునూరింటి వాడన ఘనతకాంచె "

అని తన తాతకు తాతయైన సోమన విషయము వ్రాసినందున 'కాకునూరి' యనునది గ్రామము నుండి గలిగిన యింటిపేరని స్పష్ట మగుచున్నది. కాని శ్రీ॥ సీతాపతిపంతులుగారు పై పద్యము వల్ల నీ యింటిపేరు గ్రామనామమా లేక గౌరవనామమా అన్న సందేహము పుట్టుచున్నది" అని వ్రాసియున్నారు. నిజముగా పద్య మంత స్పష్టముగాలేదు.

" అతడు మధురను బుధ సమూహముల దొడరి
వేదశాస్త్ర పురాణాది వాదములను,
గాకునూరింటి జేసిన కారణమున
గాకునూరింటి వాడన ఘనతగాంచె "

"గాకునూరింటి జేసినకారణమున" నను పాదమునకర్థమేమి ? కాకునూరింటివాడు గావున కాకునూరింటివాడని ప్రసిద్ధిగాంచెనని చెప్పుటలో నర్థమేలేదు. 'కాకునూరు గ్రామమువాడుగావున లేక కాకునూరులో యిల్లుగల కారణమున 'కాకునూరి'వాడని ప్రసిద్ధిగాంచెననియు కాకునూరివారని గృహనామము ఆగ్రామ నివాసమువలన గలిగెననియు చెప్పుటయే సమంజసము. ఇట్లుకానిచో గృహనామమునకు నిరర్థకమైన నామమును జెప్పినవాడగును. తరువాతి పద్యమున కాకునూరన సర్వాగ్రహారముగ సంతరించెనని చెప్పినందున కాకునూరు గ్రామము వారనియు ఆగ్రామము వారికి సర్వాగ్రహారముగా నుండెననియు దన తాతకు తాతయగు సోమన మధురాపురమున బుధ సమూహములతో

వాదములొానర్చెననియు ఘనతజెందెననియు అందువలననే గ్రామ నామము గృహ నామముగా నంగీకరింపబడెననియు స్పష్టమగుచున్నది. పై పద్యములో 'దొాడరి' యను శబ్దము దొాడరె యైయుండ నోపునని నాయభిప్రాయము. ఈ పాఠము నిజమైనచో నే సందేహమును గలుగ నేరదు. కాకునూరి యను గృహ నామము కాకునూరను గ్రామము వల్లనే కలిగినదని మరింత స్పష్టముగా కనబడుచున్నది చూడుడు (పీ. ౭౩)

సీ॥ బాలుడై కాశికా పట్టణంబునకేగి
బ్రహ్మేంద్రునొద్ద శాస్త్రములు చదివె
బ్రహ్మరాక్షసుతోడు గ్రమము చెప్పంబడి
కట్టిన గండభాగంబు నొందె
చరికొాండసీమలో సంతరించెను గాకు
నూరన సర్వాగ్రి హారమొకటి
నిడుదవెల్లిని బొద్దినేపల్లిని వరద
పురిని మాన్యక్షేత్రముల గడించె.

తే॥ నవని సర్వజ్ఞుడగుట గంగాంబికాభి
రాముడగుటను నిక్కంబు సోముడనగ
మనియె నిల గాకునూరి తిమ్మయసుతుండు
సోము డభినవచూతసద్గ్రామమునను

"కాకునూరు"అను సర్వాగ్రగహారమును సంపాదించెనుగదా! ఈ కాకునూరను గ్రామమెచ్చటనుండిన దెవ్వరికిని దెలియనట్లున్నది. కాని పైపద్యమును చదివినచో నైజాంరాష్ట్రివాసులమగు మనకు ఈకాకు నూరు గ్రామమును నిశ్చితముగా నిర్దేశించుటకు వీలుగలదు. చరికొాండ

సీమలో అని వ్రాసియున్నాడు. మహబూబునగరు జిల్లాలో నాగర్ కర్నూలు కల్వకుర్తి అమరాబాద తాలుకాలలో చేరియున్న గ్రామాదు లన్నియు దాదాపు ఆనాడు చరికొండసీమలో చేరియున్నవి. ఈప్రాంతము చరికొండసీమ యనిపించుకొను చుండినదనుట నిర్వివాదాంశము. చరికొండ గ్రామము కల్వకుర్తి తాలూకాలోనున్నది. ఇది పర్గనా యనియు సనదులలోను దానపత్రములలోను వ్రాసియున్నసంగతి సుప్రసిద్ధము. ఈసీమలోచేరిన కాకునూరు గ్రామము నాజన్మస్థానమగు బూర్గులకు ౬ క్రోశముల దూరముననున్నది. బాలానగర్ స్టేషనుకు ౮ క్రోశముల దూరమున తూర్పుదిశను కాకునూరుండును. ఇపుడుగూడ గుమాన్‌గర్ అను గోస్వాములకిది సర్వాగ్రహారముగా నున్నది. అపుడీగ్రామము చరికొండసీమలోనిదే! ఈ యభిప్రాయమును బలపరచుకారణము లనేకములు గలవు. 'నిడుదవెల్లి' 'బొద్దినేపల్లి' మొదలగు గ్రామాదు లందు మాన్యక్షేత్రముల గడించెనని వ్రాసికొని యున్నాడుగదా! పైజెప్పిన 'కాకునూరు'కు మిగుల సమీపముననే నొకయామడలోపల కవి పద్యములలో బేర్కొన్న గ్రామాదులన్నియు ఇప్పటికిని తమతమ స్థలములందు గలవు. 'కాకునూరు'కు రెండుక్రోశములలోపలనే త్రోవలో 'నిడుదవెల్లి' యను గ్రామముగలదు, ఇపుడాగ్రామము నవ్వాబు వలీదాద్‌ఖాన్ మందోజయగారి జాగీరు. 'బొద్దినేపల్లి' లేక బొద్దినెంపల్లి యుగూడ కాకునూరుకు రెండుక్రోశముల లోపలనేగలదు. కల్వకుర్తి తాలూకాలోచేరిన ఖాల్సాగ్రామము 'నివరళపురి'యను పాఠము సరికాదని నాయభిప్రాయము, అది "నవదళపురి"యని నాప్రబలమైన యనుమానము. కాకునూరుకు రెండుక్రోశములలోపల 'తొమ్మిదిరేకుల' యను గ్రామము గలదు. మురళీధర్‌బాగ్‌లో నుండు కన్నయ్యప్రసాదుగారి జాగీరుగ్రామము. కల్వకుర్తి తాలూకాలో చేరిన తొమ్మిదిరేకుల యే నవదళపురియై యుండునని, 'నివరళపురి'యను పాఠము సరికాదని

నాయభిప్రాయము. ప్రాతప్రతులగు మూలములు మరల బరిశీలింప దగినవి. ఈనాలుగుగ్రామములు చరికొండసీమలోని వగుటచేతను, ఒక యామడలోపల పరస్పర మతిసమీపముగ తిరముగా నుండుటచేతను అప్పకవియొక్క కాకునూరు ఈకాకునూరేయని నాదృఢాభిప్రాయము. ఇంతియగాక పైపద్యములోనే కొనకు తన తాతకుతాతయగు సోమన అభినవచూత సద్గ్రామమున నుండెనని వ్రాసినాడు. ఈగ్రామము విషయమున లక్ష్మణరావుగారును సీతాపతిగారును పొరబడినారు. ఈ గ్రామముపేరు క్రొత్తమామిడిపల్లెయై యుండుననియు మామిళ్ళపల్లి యను గ్రామము బాపట్లతాలూకాలో నొకటియు, నూజువీడుతాలూకాలో నొకటియు గలదని వ్రాసిరి. కాని నిర్దేశింపజాలరైరి. మామిళ్ళపల్లి యను గ్రామములనేకము లిక్కడగలవు, అమరాబాద తాలూకాలోనొక గ్రామముగలదు, కాని అవి అభినవచూత సద్గ్రామములుగావు, నేను బేర్కొన్న కాకునూరుకు క్రోశెడు దూరముననే 'లేమామిడి' లేక 'లేతమామిడి' యను గ్రామము పురాతన ప్రసిద్ధముగా నున్నది. అప్పకవియొక్క తాతకు తాతయగు సోమన ఈగ్రామమునందే కాపుర ముండెనని నాయభిప్రాయము. ఇతని తరువాత నీవంశము వారందరు గాని కొందరుగాని పల్నాటిసీమకు తంగెడుసీమకును బోయిన బోయి యుండవచ్చును. లేనిచో తమ పాండిత్య ప్రకర్షకై వచ్చుచు పోవు చుండి యుండవచ్చును. పైబేర్కొనబడిన సోమన మనుమడును, అప్పకవియొక్క తాతయునగు సోమన (రెండవ) 'రొంపిచెర్ల'లో నొక పెద్దనూయి గొట్టించెననియు, 'శంకరలింగమునకు' ఘనశిలా సాలంబును గట్టించెననియు, గుడిపాటికడ వినకొండ త్రోవ నొక బెద్దతోట బెట్టించెననియు, అప్పురి యామ్యదిశను పశుజలమునకై గుంట త్రవ్వించెననియు వ్రాసి యున్నాడు. (పి. ౭౫) "రొంపిచెర్ల, నరసారావు పేటదగ్గరనున్నది. సత్తెన పల్లి తాలూకాలో గుడిపూడియను

పల్లెయున్నది. అదియేయిది కాబోలు" అని లక్ష్మణరావుగా రూహించి నారు. కాని ఈ రొంపిచర్లకును ఈ గుడిపూడికిని ఏ సంబంధముగాని సామీప్యముగాని కానరాదు, వినకొండ తోవలో నున్న గుడిపూడియు, రొంపిచర్లయును సమీపమున నుండవలయును. ఈ పేరుగల గ్రామములు అమరాబాద తాలూకాలో నున్నవని వినియున్నాను కాని పరిశోధించి నిక్కము దెలిసికొనుట కవకాశము చిక్కలేదు. అప్పకవి తన తండ్రి విషయము:

తే॥ పల్లెనాటను నూట తొంబదియునాల్గు
గ్రామములనీడు గానక కాకునూరి
వెంగనార్యుడు వేద వేదాంగములను
ప్రస్తుతికి నెక్కె మాఊట బ్రహ్మయనగ ॥

యని వ్రాసినంతనే ఇతని తండ్రి కాలమున పల్నాడులో నివసించియుండిరని చెప్పుట సమంజసముకాదు. పల్నాడు పండితులకై ప్రసిద్ధిగాంచిన సీమ. అక్కడ తన తండ్రి కీడయిన పండితుడు లేడనియు మాఊట బ్రహ్మయని ప్రసిద్ధిగాంచెననియు భావము. తన తాత పట్టెము పోతనార్యుని కూతురిని వివాహమాడెనని (ప. ౦౦) వ్రాసినాడు. ఈ వట్టెము నాగర్ కర్నూలు తాలూకాలో చేరియున్న గ్రామము. వట్టెము వారని కామేపల్లి యందును లక్ష్మణరావుగారు వ్రాసినట్లు ఎవరైన నుండ వచ్చును. నేను బేర్కొన్న వట్టెములో నిప్పటికిని విద్వాంసులగు బ్రాహ్మణులు గలరు, వారి వంశముతో సంబంధమున్న నుండ వచ్చును. కవితాను స్వయముగ "శ్రీగిరిని" నిలచి భోగవిభూషణుని పట్టపు కవీంద్రుడై యుండెనని తెలిపియున్నాడు. (పీ. ౦ళ)పై పద్యమును జూడ శ్రీశైలమున నుండినట్లు

తెలియుచున్నది. అట్లైనచో కామేపల్లియు నచటికి సమీపమందే యుండనోపును. మొత్తముపై 'రొంపిచెర్ల' 'గుడిపాడు' కామేపల్లి' యను మూడు గ్రామముల విషయము కొంత పరిశోధన కావలసి యున్నది. కాని 'కాకునూరు' మొదలగు గ్రామాదులు నేను నిర్దేశించినవే యనియు శ్రీశైలమున కొంత కాలముండి పిదప వచ్చి కామేపల్లి గోపాలుని కంకితముగా రచించిన అప్పకవి మన రాష్ట్ర ప్రాంతము వాడనియు చెప్పుటకు సందేహములేదు. ప్రాజ్ఞులింకను పరిశోధింతురుగాక.

(గోలకొండ పత్రిక ౨ మే ౧౯౩౨)

# ఉర్దూభాషా సారస్వతములు

ఉర్దూభాష మన రాష్ట్రిముయొక్క ప్రభుత్వభాష యైనందున, మహమ్మదీయ సోదరులకేకాక ఉత్తర హిందూస్థానమందలి సంయుక్త పంజాబు ప్రాంతవాసులగు హిందువు లనేకులకును మాతృభాషగా మారి నందునను మరియు సకల భారతదేశమందును సామాన్యభాష (Linguafranca) గా పరిగణింప బడవచ్చునని యాభాషాభిమానులు చేయుచున్న మహత్తరమగు కృషివలనను మిగుల ప్రాముఖ్యత వహించినది. ఈభాషా సారస్వతముల చరిత్రముపై నొక విహంగమ దృష్టిని ప్రసరించి ఉర్దూభాషాపరిచయము లేనివారికి పరిచయమును గలిగించుటకై క్లుప్తముగా నీవ్యాసమును వ్రాయుచున్నాను.

ఉర్దూభాష భారతదేశమునందు జనించి యభివృద్ధినొందిన ముఖ్యమగు సంకీర్ణభాషలలో నొక్కటి. 'ఉర్దూ' 'హిందీ' భాషలు పరస్పరస్పర్ధతో నహమహమికతో నభివృద్ధినొందుచు భారతదేశము యొక్క జనసామాన్యభాషగా మారి యుచ్చస్థానము నందుకొని రాష్ట్రి భాషాపదవిని బొందుటకై ప్రయత్నించుచున్నవి. ఈస్పర్ధ ద్వేషముగా మారి రానురాను దురదృష్టవశమున మనదేశము నావరించిన యనేక వైషమ్యకారణములలో నొక ప్రబలకారణముగా పరిణమించుచున్నది. ఐనను ఈరెండుభాషలు నొకేతల్లి కడుపున బుట్టిన యప్పచెల్లెండ్రని మరచిపోగూడదు. పరదేశీయులగు మహమ్మదీయరాజు లీదేశముపై దండెత్తివచ్చి మొట్టమొదట దోపిళ్ళతో సంతృప్తినిజెందిరి. కాని కుతుబుద్దీన్ ఐబక్ భారతదేశమును స్థిరనివాసముగా నేర్పరచుకొని

రాజ్యస్థాపన మొనరించిన నాటినుండి భారతీయులతో కలసిమెలసి వారి సహాయము నపేక్షించవలసిన యవసరము కలిగెను. ఈయవసరమే యొక క్రొత్తభాష జనించుట కవకాశము గలిగించెను. ఉత్తర హిందూస్థాన ముఖ్యప్రాంతములందు ప్రాకృత జన్యములగు హిందీభాషలు వాడుకలో నుండెను. వీనిలో శౌరసేనీ ప్రాకృతము నుండి జనించిన పశ్చిమ హిందీభాష (౧) బంగారా (౨) వ్రజభాష (౩) కన్నోజియను మూడురూపములను దాల్చెను. ఈభాషలకు మూలమగు పశ్చిమ హిందీభాషకు "ఖడీబోలీ" యనిపేరు. ఈభాషయే యిప్పటికిని ఉత్తర హిందూస్థానమందలి గ్రామీణులగు వారిభాష. నాగరికులగు హిందూ మహమ్మదీయు లుర్దూభాష మాటలాడినను గ్రామీణులు మాత్రము "ఖడీబోలీ"నే వాడుచుందురు. ఈ "ఖడీబోలీ"యే హిందీ ఉర్దూభాషలు రెండింటికిని తల్లి. ఢిల్లీ, మీరటు ప్రాంతములలోని భాషకును, మధురా ప్రాంతములందు వాడబడు వ్రజభాషకును కొంత భేదమున్నను రెంటికిని 'ఖడీబోలీ' యనియే పేరు.

బాబరుచక్రవర్తి కాలముపరకే హిందీభాష సారస్వతభాషగా మారిపోయినది. బాబర్ దర్బారులో రాజపుత్రరాజుల దర్బారులో నట్టి హిందీ కవులుండిరి. హుమాయూన్, షేరుషాహ్ కాలములలో హిందీ భాషకును కవులకును మంచి యాదరణ కలిగెను. ఈకాలమునందే "మలిక్ మహమ్మద్ జాయెసీ" యను మహమ్మదీయ కవివర్యుడు 'పద్మావత్' అను సుప్రసిద్ధమగు హిందీకావ్యమును రచించెను. బాబరు నుండి మొదల్కొని బహాదురుషాహ్ జఫరువరకు మొగల్‌చక్రవర్తులు రాజకుమారులందరును హిందీభాషను ప్రేమించి యాదరించి యాభాషలో స్వయముగా కవిత నల్లిరి. వారు రచించిన హిందీ గీతములన్నియు "సంగీతరాగ కల్పద్రుమ" మను గ్రంథమున సేకరింపబడి నాగరీ

ప్రచారిణీ గ్రంధమాలవారిచే ప్రకటింపబడినవి. అక్బరు చక్రవర్తి 'నరహరి'యను హిందీకవియొక్క పల్లకిని స్వయముగా మోసెను. కృష్ణదేవరాయలు పెద్దనార్యుని సత్కరించినటులే, అక్బరుదర్బారులోని నవరత్నములలో ముఖ్యులగు ఫైజీ, అబుల్ ఫజల్ పండితులు ఫారసీ, అరబ్బీభాషలందువలె హిందీభాషయందును కావ్యముల రచించిరి. సంగీత శిరోమణి బాబాహరిదాసుగారు చక్రవర్తి యాహ్వానము నిరాకరించినపుడు సరసచక్రవర్తియగు అక్బరు హరిదాసుని కుటీరమునకు స్వయమేగి సంగీతమును విని యానందించెను. సుప్రసిద్ధుడగు తాన్‌సేని తన దర్బారు గాయకుడే, నరహరికవి రచించిన ఖలుకషట్పద గీతమును విని గోవధను మాన్పించిన దయాశాలి అక్బరు. అబ్దుర్రహీంఖాన్ ఖానా యనువాడు గొప్పపండితుడు కవి, విశాలహృదయుడు, బహు భాషాభిజ్ఞుడు, మహాదాత. అక్బరు దర్బారునందొక యమీరు. అతడు సంస్కృత హిందీభాషలలో ప్రవీణుడు. అతడు రచించిన 'రహమాన్ విలాస్'అను గ్రంధమిటీవలనే ప్రకటింపబడినది.

అచ్యుత చరణ తరంగణి
శశిశేఖర మౌళి మాలతీమాకే
మమ తను వితరణ సమయే
హరతా దేయా నమే హరితా.

అని గంగాస్తోత్రము గావించెను.

ఆనీతా నటవన్మయా తవపుర
శ్రీకృష్ణ యా భూమికా
వ్యోమాకాశ ఖశాబకాబ్ధి వసువ
త్వత్ప్రీత యేద్యాపధి

ప్రీతస్త్వం యదిచేన్నిరీక్ష భగవన్
స్వప్రార్థితమ్ దేహిమే
నోచేద్ బ్రూహి కదాపి మానయ పు
నస్త్వేతాదృశీం భూమికాం ''

అని శ్రీకృష్ణుని స్తవ మొనరించినాడు. గాజీ అబ్దుర్రహీంఖాన్ ఖానాన్, షాఃజహాన్ కాలములో ఈ ఖడీబోలీ హిందీ కొక చెల్లెలు జనించినదనియు దానికే 'ఉర్దూ'అను పేరు గలిగినదనియు ప్రతీతి. కాని షాఃజహాన్‌కు పూర్వమే 'ఖడీబోలీ'లో తుర్కీ ఫారసీ అరబ్బీ శబ్దము లను కలిపి 'రేఖ్తా' అను కావ్య భాష నొక దానిని మహమ్మదీయ పండితులు,కవులు కల్పించి యుండిరి. అబ్దుర్రహీంఖాఁ ఖానాఁ ఈ 'రేఖ్తా' భాషలో గూడ రచించి యుండెను. ''ఉర్దూ'' అను పేరీ భాషకు తర్వాత వచ్చినది. 'ఉర్దూ' అను పదమునకు తుర్కీ భాషలో నర్థము సైన్యము' 'ఫౌజు' మిలటరీవారు మాటాడు సంకర భాషయను ధ్వని గలదని ఈ పదమును పూర్వకవులు వాడలేదు. ప్రప్రథమమున ఖాఁ ఆరుజూయను ఢిల్లీ కవి ౧౮వ శతాబ్దమున నీ పదము నుపయో గించెను. 'షాఃజహాఁ' కాలమున ఢిల్లీ పట్టణములోని 'లాలుఖిల్లా' (ఎఱ్ఱదుర్గము) యను భాగమందు తుర్కీ ఫారసీక సేనానులు సర్దార్లు, అమీరులు పండితులు నివసించువారు. వారందరు జనసామాన్యముచే నుపయోగింపబడు ఖడీబోలీ హిందీ భాష నుండి సంస్కృత ప్రాకృత భవములగు పదజాలమును తొలగించి ఫారసి అరబ్బీ పదములను విరివిగా నుపయోగించి గ్రంథములను కావ్యములను రచింప దొడంగిరి. ఇట్లు ఆరంభదశలో 'రేఖ్తా' యను పేరు గలిగిన ఆమిశ్ర భాష 'ఉర్దూ' గా మారిపోయెను. ఫారసీ, అరబ్బీ. భాషా పాండిత్యముగల ముస్లిం పండితులు కవులు ఆభాషా సంప్రదాయములను, పదజాలమును, ఛంద

స్సులను, వ్యాకరణమును జూపించిరి. అక్బరు కాలములో రాజా తోడర్‌మల్ ఫారసీ భాషను ప్రభుత్వ భాషగా నొనరించెను. అప్పటి నుండి 'రేఖ్తా' త్వరగా 'ఉర్దూ'గా మారిపోవు చుండెను. ఒకవైపీ సంస్కారము జరుగు చుండ మరియొకవైపు హిందీ 'ఉర్దూ' భాషలు విడి పోవుచుండెను. ఒకటి సంస్కృతమును దేవనాగరీ లిపి నాధార ముగా గొనిపోయెను. రెండవది అరబ్బీ ఫారసీ భాషలను లిపిని పునాదిగా స్వీకరించెను. ఇట్లొకే క్షేత్రమున మొలచిన ఈ రెండు భాషాలతలు భిన్న భిన్నములగు నాధారముల నవలంబించి రెండు స్వతంత్ర శాఖలుగా మారిపోయెను. ఈ పరిణామము ఒక వంక జరుగు చున్నను మొగల్ ప్రభువులీ రెండు భాషలకును ఇతర దేశ భాషలకును ప్రోత్సాహము నొసగుచుండిరి. జగన్నాథ పండితునకు 'పండితరాయ' లనియు 'సుందర' కవికి 'కవిరాజు' అనియు బిరుదముల నొసంగి షాఃజహాఁ తన రసజ్ఞతను నిష్పక్ష పాతమును వెల్లడించెను. 'ఢిల్లీశ్వరోవా' జగదీశ్వరోవా, యని యూరక పొగడలేదు పండిత రాయలు. మొగలు చక్రవర్తు లందరు తన రాజకుమారులకు నిర్బంధ ముగా హిందీ భాషను నేర్పించు చుండిరి. ఔరంగజేబు చక్రవర్తి యును హిందీని ప్రేమించు చుండెను. అతని దర్బారు నందు 'కృష్ణా' 'సామంత్'మున్నగు హిందీ కవులుండిరనియు,తానుస్వయముగా హిందీ కవితనుగూడ నల్లుచుండెననియు విన్నచోనాశ్చర్యముకలుగక మానదు. అతడు భార్యయగు ఉదయపురి రాణిని గురించి ప్రేమ గీతములు హిందీ భాషయందు రచించెను. "జబ్ జబ్ గావత్ తబ్ తబ్ రస సముద్ర లహరీ ఉపజావత్"అని యామె సంగీతకళా ప్రావీణ్యమును వర్ణించెను. ఇట్లే బహదర్ షాః కాలము వరకును హిందీ ఉర్దూ భాషలు సమా నాదరణమును బొందుచు పరిణతిని జెందుచుండెను. బహదర్‌షాః స్వయముగా గొప్ప ఉర్దూకవి. అతడు వ్రాసిన 'బహదర్‌షాః

కపహేలీ' అను కావ్యము హిందీ ఉర్దూ యొక్క రస వంతమగు సమ్మే ళనమును సూచించు చున్నది.

ఇట్లు 'హిందీ,' 'రేఖ్తా', 'ఉర్దూ', అను మూడుతరగతులందు 'హిందీ' భాష 'ఉర్దూ' గా మారిపోయినది. ఫారసీ అరబ్బీ పదజాల ములచే నిండి అధిక సంఖ్యాకులగు జనసామాన్యము యొక్క ఖడీ బోలీకిని సంస్కృత ప్రాకృత భవమగు హిందీకిని అతిదూరమైన ఈ ఉర్దూభాషకు జనకులు ముగ్గురు. ఒకరు మీర్జాఅమీన్‌ఖాన్ ప్రధాని, రెండవవాడు సాదుల్లాఖాన్, 'గుల్షన్' ఢిల్లీ వాస్తవుడు కవి, అమీరు మూడవవాడు 'వలీ' ఔరంగాబాద్ వాస్తవ్యుడు కవి. ఈముగ్గురు 'రేఖ్తా' నీవిధముగా సంస్కరించి ఉర్దూభాషకు ప్రస్తుత స్వరూపము నొసంగిరి. సంస్కృత మొకవైపునను ఫారసీ మరొకవైపునను లాగు చుండిన నీసంఘర్షణ కాలములో నీరెండుభాషలు పరస్పర సంపర్క సంఘర్షణల వలన పరిణతినిజెందెను. హిందీ మహారాష్ట్రి గుజరాతీ భాషలందుగల ఫారసీ తుర్కీ అరబ్బీ భాషల శబ్దజాలమును పరిశీ లించినచో నీపరస్పర సంకీర్ణతయొక్క చరిత్రము వెల్లడియగును. ప్రభుత్వభాషయగు ఫారసీని ఇతరభాషలు గౌరవింపవలసి వచ్చినది. పాలితులు పాలకుల భాషలను గౌరవించుట ప్రకృతి సహజమైన పరిణామము. మనరాష్ట్రములోని తెనుగుభాషయందు ఉర్దూయొక్క ప్రభావమువల్ల గలిగిన మార్పు మనము చూచుచునే యున్నాము. కాని ఇందు రాజకీయ, ఆర్థిక, స్పర్థల వలన హిందీ వారు వాడుకలో నుండు సంకీర్ణ భాషా పదములను విడచి, సంస్కృతీకరించి, హిందువులకును కష్టముగా నర్థమగు కఠినమైన హిందీ భాషను పోషించుచు, దానినే రాష్ట్రి భాషయని సమర్థించు చున్నారు. అట్లే యెవరికి నర్థముగాని ఫారసీ అరబ్బీ శబ్ద జాలము

చేమయమైన ప్రస్తుత ఉర్దూను రాష్ట్ర భాషగా ప్రతిష్ఠించుటకు ఉర్దూ వాదులు ప్రయత్నములు సల్పుచున్నారు.

ఈ భాషా చరిత్రమును ముగించుటకు పూర్వమాంగ్లేయ పండితులకొక కృతజ్ఞతా పూర్వకమగు నమస్కార మర్పింప వలయును. మన తెనుగు భాషకు బ్రౌన్‌దొరగారు గావించిన సేవకంటె అధికముగా సేవ ఉర్దూ భాష కాంగ్లేయ పండితులు గావించిరి. డాక్టర్ గిల్‌క్రిస్టు (Dr. Gilchrist) అను ఫోర్టు విలియం కలకత్తా పండితుడు ఉర్దూ నిఘంటువు వ్రాసెను. విల్సన్ పండితు డొకటి వ్రాసెను. ఆంగ్లేయులు రాజకార్య సౌకర్యములకై ఫారసీ మున్‌షీలచే నుపయోగింపబడు వాడుక ఉర్దూభాషను ప్రోత్సహించి మెల్లగా ఫారసీకి బదులు 'ఉర్దూ'ను ప్రభుత్వశాఖలలో ప్రతిష్ఠించిరి. మొదటి వ్యాకరణమును వారేవ్రాసిరి. "జనసామాన్యము మాటలాడు గౌణమగు హిందీకిని ఫారసీ అరబ్బీ పండితులు, కవులుపయోగించు కఠినమైన గ్రాంధిక భాషకును మధ్య తరగతికిజెందిన ఉత్తర హిందుస్థానమందలి నాగరికులందరు మాటలాడు సాధారణమగు హిందూస్థానీభాషను నేను ప్రోత్సహించుచున్నా"నని వ్రాయుచు డాక్టరు గిల్‌క్రిస్టు 'ఉర్దూ' భాషకు మిగుల సేవగావించెను. ఈభాషలో నెక్కువ పాండిత్యముగలవారు కొందరు హిందీకిని ప్రాకృతమునకును ఉర్దూకుగల సంబంధమును సరిగా గమనించి అరబ్బీ ఫారసీల నుండి క్రొత్తశబ్దములగ తయారుచేసి వాడుకలోనుండు హిందీశబ్దములను త్యజించు పద్ధతిని నిరసించుచున్నారు. ఉర్దూభాషకు హిందువులు గావించినసేవ యపారము. కాశ్మీరపండితులు, కాయస్థులు, ప్రభుత్వశాఖలలో నుద్యోగులుగా నుండిరి, వారు ఫారసీభాషలో ప్రావీణ్యతను సంపాదించి గద్యపద్య నిర్మాతలై ముస్లింరాజులచే మెప్పు వడసిరి. ఆపరంపర ననుసరించి ఉర్దూభాషా కవులలోను గ్రంధ

నిర్మాతలలోను హిందువులసంఖ్య బహుళము. ఈవిషయమున ప్రత్యేక మొక గ్రంథము రచింపబడినది. సంస్కృత పుస్తకముల ముద్రణము నకై నిర్ణయసాగర్ ప్రెస్‌వలె ఆంధ్ర గ్రంథముద్రణమునకై వావిళ్ళ వారి ప్రెస్సువలె ఉర్దూపుస్తకముల నచ్చువేయుటకు లాహోరునందలి మన్‌షీనవల కిశోర్ ప్రెస్ పూనెను. ఇతడు కాశ్మీర పండితుడు, మౌలానాషిబ్లీ హిందువు ఉర్దూభాషకు గావించిన సేవనుగురించి ప్రత్యేక వ్యాసములను వ్రాసియు తన సుప్రసిద్ధగ్రంథమగు, ఆబెహయాత్ నందును మిగుల ప్రశంసించి నాడు. అట్లు ఉర్దూభాష హిందూ మహమ్మదీయ సమ్మేళనముయొక్క పరిణామమనియు రానురాను హిందిఉర్దూ భాషలు స్వతంత్రభాషలుగా మారి స్వతంత్ర పరిణతిని జెందుచున్నవని విశదమగుచున్నది,

## ఉర్దూకవితా ప్రథమ యుగము

ఉర్దూకవితా సారస్వతముయొక్క ఆరంభము నిర్ణయించుటకు నిశ్చితాధారములు లేవు. కాని ఉర్దూభాషలో నాదికవిగా పేర్కొన దగిన గౌరవము 'అమీర్ ఖుస్రూ'కు లభింపవచ్చును. ఈసుప్రసిద్ధ ఫారసీకవి, ఫారసీ, హింది, రేఖ్తా, (ఉర్దూ పూర్వరూపము) మూడు భాషలలోను కావ్యముల రచించెను. ఈమహాకవి రచించిన పద్యములు, సమస్యలు గీతములు ఖండకావ్యము లిప్పటికిని జనరంజకతను గోల్పోలేదు. క్రీ. శ. ౧౩వ శతాబ్దమున ఎటవాజిల్లాలో జన్మించిన నీకవి 'బిల్బన్' 'కైకుబాద్' రాజుల సమకాలికుడు. క్రీ. శ, ౧౩౨౫లో మరణించెను. ఫారసీ ఛందస్సు నుర్దూకవితయందు మొట్టమొదలుపయో గించిన గౌరవమితనికే చెందుచున్నది. ఇతడు రచించినదే సుప్రసిద్ధ మైన 'ఖాలక్‌బారీ' యను ఫారసీ ఉర్దూ నామలింగానుశాసనము.

ఇతని యనంతరము మూడు శతాబ్దములవరకు భాషా స్వరూపమేర్పడు చుండెను. మధ్యన కబీరుదాసు (కీ. శ. 144-1518) వరకు హిందీలో 'దోహా'లకు తన కావ్యమును రచించెను. 'మలిక్ మహమ్మద్ జాయేసీ' (కీ. శ. 1540) 'పద్మావత్' అను హిందీకావ్యమును ఫారసీ లిపిలో వ్రాసెను. తులసీదాసు (క్రీ. శ. 1550-1624) తన రామచరిత మానసమును మరి ఇతరఖండకావ్యములను రచించెను. పైజీ, అబ్దుర్ర హీంఖాన్, మున్నగువారును రచించిరి. కాని వీరందరును హిందీభాషా కవులుగా లెక్కింప బడరు. నిజమైన ఉర్దూ కవిత దక్కన్‌లోని గోలకొండ బిజాపూరు రాజధానులందు బైలుదేరినది. గోలకొండ కుతుబ్‌షాహీ రాజులు-మహమ్మద్ కులీ కుతుబ్‌షాః (క్రీ. శ. 1581-1611) మహమ్మద్ కుతుబ్‌షాః (క్రీ. శ. 1611-1625), అబ్దుల్లా కుతుబ్‌షాః (క్రీ. శ. 1625-1672) అబుల్ హసన్ తానాషాః (క్రీ. శ. 1672-1704) మున్నగు వారు స్వయముగా కవులు, రచయితలు. ఇందులో క్రీ. శ. 1581 లో రాజ్య పీఠము నధిష్ఠించిన మహమ్మద్ కులీ కుతుబ్‌షాః అక్బరు చక్రవర్తి యొక్కయు ఈరాన్‌దేశపు రాజగు 'షాః అబ్బాస్' యొక్కయు సమకాలికుడు. మన భాగ్యనగరమును నెలకొల్పిన రాజితడే. ఇతడు ఫారసీలోను, దక్కనీ ఉర్దూలోను, తెనుగు భాషలోను కావ్యముల రచించెనట. తెనుగు కవిత లభ్యము కాలేదు కాని ఉర్దూ భాషా చరిత్రకారు లితడు తెనుగు కవియనియు వ్రాసినారు. ఇతని ఫారసీ, ఉర్దూ దీవాన్‌లు (కావ్య సంపుటములు) ౧౮౦౦ పేజీలు గలిగి ఏబది వేల పంక్తులు గలిగి యున్నవి. భక్తి శృంగారములను, సాంఘిక ప్రకృతి చిత్రములను తన కవితా పటమున ననేక రంగులతో చిత్రించెను. హిందూ ముస్లిం పండుగలను, పక్షు లను, వృక్షములను, కూరగాయలను, జనుల సాంఘికా చారములను చిత్రముగాను రసవంతముగాను వర్ణించెను. ఇతని తమ్ముని కుమారు

డగు రెండవ రాజు మహమ్మద్ కుతుబ్‌షాః కూడా 'దీవాన్' గల కవియే. మూడవ వాడగు అబ్దుల్లా కుతుబ్‌షాః గొప్ప విజ్ఞాన ప్రియుడు. పండితులకు కవులకు నాశ్రయ మొసంగెను. ఇతని దర్బారు కవులు కొన్ని సంస్కృత, ఫారసీ శృంగార కథలను ఉర్దూలో ననువదించిరి. శుకసప్తతి యొక్క ఫారసీ తర్జుమా 'యాతీనామా'కు ఉర్దూ అనువాదము 'సబ్‌రస్' 'కామరూప కళాకథలు' వెలువడినవి. అబుల్ హసన్ తానాషాః కాలములో 'బహ్రాంగుల్‌బదన్' కథలు 'తబయా'యను కవి యనువదించెను. బీజాపూర్ రాజధానిలో అదిల్ షాహీరాజులును విజ్ఞాన ప్రియులు. ఇబ్రాహీం ఆదిల్‌షాః (రెండవ వాడు క్రీ. శ. 1580-1626) కాలములో సుప్రసిద్ధ ఫారసీ కవియగు 'జుహూరీ' బీజాపురమునకు వచ్చి అక్కడనే క్రీ. శ. 1616లో చని పోయెను, ఇబ్రాహీం ఆదిల్‌షాః స్వయముగా హిందీలో గానకళపై 'నవరస' మను గ్రంథమును రచించెను. రెండవ ఆదిల్‌షాః (క్రీ. శ. 1656-1672) కాలములో 'నుస్రితీ'యను సుప్రసిద్ధకవి అలీనామా, గుల్‌షనె-ఇష్క్' మున్నగు గ్రంథములను రచించెను. 'పైరిజు', 'దౌలత్', 'అహమద్‌కుజురాతీ', 'సాది దక్కనీ', 'ఫజులు', 'ఆషక్', 'అమీర్', 'ఆజాద్'. మున్నగు కవులు దక్కన్‌లో బైలు దేరిరి. కాని వీరందరి కంటె మిన్నయై ఉర్దూ భాషకు 'ఛాసర్' (Chaucer) వంటివాడు 'వలీ' యను ఔరంగబాద వాస్తవ్యుడు. ఈ వలీకవికి పూర్వము వ్రాసిన కవులు దక్కనీ ఉర్దూ భాషలో రచించిరి. దక్కనీ భాషయనగా ఉర్దూభాష ఫారసీ దుస్తులను ధరించి ముస్తాబై పరిణతి నొందక పూర్వము ముస్లిం సేనలు దక్షిణమునకు తీసికొని వచ్చిన భాష. ఈ భాషలో తరువాత బహిష్కరింపబడిన యనేక హిందీ పదములు, మరాఠీ, తెనుగు, తమిళము మున్నగు దేశ భాషా పదములు విరివిగా కలిసియుండెను. ఈ భాషను గోలకొండ,

బీజాపూరు రాజులు ప్రోత్సహించిరి, కాని 'వలీ' ఈ భాష నుత్తర హిందూ స్థానమున వృద్ధిబొందు చున్న ఫారసీ మయమగు ఉర్దూకు బలియొసంగి ఢిల్లీ లాల్‌ఖిలా భాష కగ్రస్థాన మొసంగెను, అప్పటి నుండి 'వలీ' ననుకరించుచు కవులనేకులు ఢిల్లీలో లక్నోలో రచనల సాగించిరి. ఈకవి క్రీ. శ. 1744 మధ్యకాలపువాడు. ఇతడు రెండవ సారి ఢిల్లీకి క్రీ. శ. 1722వ సంవత్సరమున వెళ్ళినపు డితని గీతము లకస్మాత్తుగా ప్రశస్తిని గాంచెను. ఢిల్లీ కవులంద రితని ననుకరింప దొడంగిరి. అప్పడినుండి ఢిల్లీకవుల ప్రత్యేక సంప్రదాయ మొకటేర్పడి గురుశిష్య పరంపరానుగతముగా సాగుచుండెను. ఇతని కనేక హిందూ మహమ్మదీయ శిష్యులు ఔరంగాబాద్, ఢిల్లీ, అహమదాబాద్ లలో నుండిరి. ఈతని శైలి సులభము, సరసము, లలితపదము, మధురము, భావప్రకటనముకలదై యితరుల కనుకరణ యోగ్యమై ఇతని కాచార్య స్థానము నొసంగుచున్నది. ఇతని భాష ఫారసీ మయమగు ఉర్దూభాషయైనను హిందీ వ్రజభాషా పదము లక్కడక్కడ నందులో బహుళముగానే కన్పడుచుండును. కాని శిష్యకోటిలోని వారెల్లరు రానురాను హిందీ పదజాలమును బహిష్కరించి ఉర్దూను సంపూర్ణముగా హిందువుల కొక పరభాషగా స్ఫురించునటుల మార్చివేసిరి.

'వలీ' తర్వాత ఉర్దూయొక్క కేంద్రము ఢిల్లీకి మారిపోయినది. గోలకొండ, బీజాపురపు బహమనీ రాజ్యములలో నాకాలమందు హిందూ మహమ్మదీయు లత్యంత మైత్రిగలిగి పరస్పర సమ్మేళనమునకై మతాంతర వివాహములును జరుపుకొనుచుండిరి. ఇక్కడ ప్రభుత్వపు లెక్కలు సనదులు మున్నగునవి దేశభాషలలోనే వ్రాయబడుచుండెను. పర్షియా, తుర్కీ దేశస్థుల నెక్కువగా ప్రభుత్వోద్యోగము లందేర్పరచు పద్ధతి ప్రవేశపెట్టబడలేదు. దేశీయులగు హిందువుల కెక్కువ యవ

కాశము లిచ్చుచుండిరి. కావున 'వలీ' గావించిన భాషా సంస్కారమున కిక్కడ తగినంత ప్రోత్సాహము లభింపలేదు. ఈరాన్, ఈరాక్, తుర్కీ మున్నగు దేశీయులచే నిండి పారసీభాష కత్యంత గౌరవముగల కేంద్ర ప్రభుత్వ స్థానమగు ఢిల్లీలో 'వలీ' వేసిన బీజములు ఫలవంతములై తొందరగా ఉర్దూభాషా క్షేత్రమును సస్యశ్యామల మొనర్చెను. 'మిర్జాసిరాజుద్దీన్ ఖానెఆర్జూ' (క్రీ. శ. 1689-1755) యను గొప్పకవి 'వలీకి' దాదాపు సమకాలికుడైనవాడు, ఢిల్లీ వాస్తవ్యుడు. ఉర్దూకవితకు మరింత వన్నెదెచ్చెను. ఇతడే 'ఉర్దూ' అను పదము నీభాషకై వాడి నామకరణము గావించెను. హాతింనజీ, మజ్నూన్, మజహర్, ఫిగాన్, మున్నగు కవులనేకులు 'వలీ'ని 'ఉర్దూ' ననుకరించిరి. వీరిలో ననేకులు పారసీక దేశస్థులు ఇకవారి వంశీయులైనవారు కావున పారసీక ఫక్కిని ప్రావీణ్యముతో కావ్యముల రచించి ఉర్దూకవిత నభివృద్ధికి తీసికొని వచ్చిరి.

## రెండవ యుగము

రెండవయుగము క్రీ. శ. ౧౮ వ శతాబ్దారంభమునుండియే మొదలగును. ఈయుగము, ఉర్దూకవితా చరిత్రమందు మిక్కిలి సంపన్నమైనది. మీర్జారఫీసౌదా, మీర్ తకీమీర్, ఖ్వాజామీర్ దర్దు, అను ముగ్గురు మహాకవులు మన కవిత్రయమువంటి వారీకాలపువారు.

మువ్వురును ప్రతిభాశాలురు. స్వతంత్ర రచనా ప్రవీణులు, మీర్జారఫీసౌదా (క్రీ. శ. 1713-1781) మీర్ తకీమీర్ (క్రీ. శ. 1793-1810) రాబోవువారి కాదర్శ ప్రాయులైరి. 'సౌదా' కసీదాలు వ్రాయుట యందును 'మీర్' గజళ్ళు వ్రాయుట యందును అరితేరిన ప్రజ్ఞగలవారు. ఇవ్విధముగా 'వలీ' మహాకవి ఉర్దూభాష యొక్క యాదికవి యైనందు

నను ప్రస్తుత భాషకు స్వరూపమొసంగి నందునను నన్నయార్యునితో బోల్ప దగినవాడు. అట్లే మీర్జారఫీసొదాను తిక్కన సోమయాజి తోడను, మీర్ తకీమీర్‌ను ఎర్రా ప్రగడతోడను బోల్పనగును. ఖ్వాజా మీర్‌దర్దు అను మహాకవి వీరందరికంటెను ప్రత్యేక విశిష్టతగలవాడు. అతడొక గొప్ప మత గురువుల వంశమున జనించినవాడు. చిష్తి వంశీయుడు. గొప్ప మేధావియైన పండితుడు. ఆధ్యాత్మిక విద్యలం దారితేరిన వేదాంతి. సూఫీ భక్తుడు. గాన కళా విశారదుడు. రాజులను గూడ సరకుగొనని నిర్భయుడు. అతని గృహమున నెలకు రెండుసారులు భక్తుల సంగీత సభలు జరుగుచుండెను. షాహ్ ఆలము చక్రవర్తి యొకనాడు సభకు విచ్చేసి కూర్చుండి కొంత కాలమునకు కాళ్ళుజాచుకొని యెనట, ఈ మహాకవి సభలో నట్లమర్యాదగా ప్రవర్తింపరాదని మందలించెనట. క్రీ. శ. 1759 లో అహమద్‌షాహ్ అబరాలీ ఢిల్లీపై దండెత్తి వచ్చినపుడు ఢిల్లీ వాసులగు పండితులు కవులనేకులు అవుధు (Oudh) కు పలాయన మొనర్చిరి. కాని ఈ కవి మాత్రము స్వగృహమును వదలిపోలేదు. ఇతడు, కవితా ధోరణిని, జీవితా దర్శములను, ఆధ్యాత్మిక వాసనలనుబట్టి చూడ మన పోతనామాత్యునితో బోల్పదగినవాడు.

ఈ కాలములోనెన్న దగిన కవులు, మజహర్, దర్దు, సోజు, ఖాయం, యకీన్, బయాన్, హిదాయత్, ఖుద్రత్,జియా మున్నగువారు. వీరందరును మంచి ఫారసీ పండితులు. ఆ భాషా సంప్రదాయములను కవుల భావ సంపదలను, కవితా సామగ్రిని, సంపూర్ణముగా స్వీకరించి, పురాతనమైన హిందీ వాక్యసరణిని వదలి ఫారసీ వాక్య సరణి నవలంబించిరి. బుల్ బుల్, కంరీ, గుల్, షంపాద్, నర్గిసు, సరో మున్నగు ఫారసీక కవితా సామగ్రిని స్వీకరించిరి. హిందీ కవితలోని యలంకా

రములను ముఖ్యముగా శ్లేషను పరిత్యజించిరి. ౧౯-వ శతాబ్దారంభమున, యిన్‌షా, ముసీహపీ, యను కవులు ముఖ్యులు. వీరిద్దరు గొప్ప ఫారసీ సంప్రదాయములపై భాష సంస్కరింపబడి బాగుగా నిగ్గుదేరినది. కాని భావ గాంభీర్యముసడలినది. సంస్కృత ప్రాకృత భవములగు దేశీయ పదములు వాని నుడికారముపోయి భాష గంభీరమైనది కాని యాకాలపు కవిత యందు ఢిల్లీనగర వాసుల యొక్క సాంఘిక స్థితులు జీవిత పద్ధతులు ప్రతి ఫలించుచున్నవి. యిన్‌షా, రంగీన్. జాన్‌సాహెబు, మున్నగు వారు 'రేఖ్తా' యొక్క స్త్రీ లింగమగు 'రేఖ్తీ' యను జనానాభాష నుపయోగించి యాభాషా మూలమున పచ్చి శృంగారమును కవిత యందు జొన్పిరి. ఆరకపు కవిత వృద్ధికి వచ్చెను. ఆకాలపు కవులు 'గజల్'లో మిగుల ప్రతిభను గడించిరి. 'ముషాయిరా'లు (కవితా గోష్ఠులు) లెక్కకు మిక్కిలి జరుగు చుండెను. ఉర్దూ సాహిత్యము నందు 'గజళ్ళ' కత్యంత ప్రాముఖ్యత గలదు. ఈ భాగమే చాలా ఎక్కువ. 'గజల్' అను శబ్దమునకు 'స్త్రీతో సంభాషించుట' లేక 'ప్రేమ భాషణము' అని యర్థము. దీని వలననే 'గజల్' శృంగార కవితా సాహిత్యమని చెప్పకయే తెలియనగును. ఉర్దూ సాహిత్యములో శృంగారము, తరువాత ప్రాముఖ్యత గల గుణము సూఫీ తత్వము. ఫారసీ సాహిత్యము యొక్క విశిష్టమైన యీ గుణము సంక్రమించినది. "యమనియమాదులచే పవిత్రతను సంపాదించుచు, పరమేశ్వరునికై సకలమును త్యజించుట, మనుజులకు సహజముగా లక్ష్యమును భౌతిక సుఖ సంపదలను, శక్తులను ఆశలను విసర్జించుట, ఈశ్వర సేవకై ఏ కాంతముగా జీవితమును వ్యయపరచుట ఇవి సూఫీ ముఖ్య తత్వములు. ఉర్దూ కవులలో మత గురువుల వంశీయులు, పండితులు, వేదాంతులనేకులు గలరు. వలీ ఔరంగాబాదీ. షాహ్ ముబారక్ ఆరూ, షేఖ్ షర్‌ఫుద్దీన్, మజ్మూన్, షాహ్‌హాతిం,

జాన్ జహాన్ మజహర్, ఖ్వాజామీర్ దర్ద, మీర్‌సౌదా, ఇష్క మున్నగు వారు సూఫీ తత్వానుయాయులు. వీరి కవిత యందీ వాసనలు మిక్కుటముగా గలవు. భౌతిక ప్రేమ, ఆధ్యాత్మిక ప్రేమ లేక ఈశ్వర భక్తికొక సోపానమని సూఫీల తలంపు. అందు వలన ఫారసీ, ఉర్దూ కవితలో వైరాగ్యము, శృంగారము. ఈ రెంటి యొక్క విచిత్రమైన సమ్మేళనము దృశ్యమగుచున్నది. భక్తులకు వేదాంతులకు ఆధ్యాత్మిక జీవులకు ఈరకపు సాహిత్యమునందు భక్తి జ్ఞాన వైరాగ్యములు కనపడును. ఈ కవితలోని ప్రేమ భాషలకు నృత్త గీతములకు. పానములకు నొక విశిష్టమైన యాధ్యాత్మికమగు నర్థము వారికి గోచరించును. సామాన్యులగు పామరులకు కేవలను ఖలంపటులైన భౌతిక జీవులకు శృంగారముతప్ప వేరేమియు కానరాదు. ఈ రెండు తెగలకు కూడా పనికి వచ్చు సాహిత్యము ఉర్దూ గజళ్ళలో గలదు. ౧౮వ శతాబ్దమందు 'గజల్' కవిత పరిణతి నొందెను. ఈ కాలములోని ముఖ్య కవులు ఇన్‌షా, ముస్‌హఫీ, ఫిరాక్, రంగీన్, బకా, హస్రత్, రాసిఖ్, జురర్రత్, హుస్నీ, అసర్ మున్నగు వారు. 'ఇన్'షాతో నారంభమైన ఈయుగము 'గాలిబ్'తో సమాప్తమయ్యెను.

మీర్జా అసదుల్లాఖాన్ "గాలిబ్", ఉర్దూ సాహిత్యమున శ్రీనాథు నితో పోల్చదగినవాడు, మేధావి, పండితుడు. ఇతని కాలము క్రీ. శ. 1796 నుండి 1869 వరకు ఈ కాలపు కవులలో పేర్కొనదగిన వారు జఫర్, మోమిన్, జౌక్, నసీర్. కొందరు విమర్శకులు 'జౌక్' కవియును 'గాలిబ్' వంటి ప్రతిభాశాలియే యనియు, కొందరు 'గాలిబ్' కంటెను మిన్నయనియు వ్రాసియున్నారు. కాని మొత్తము పైన 'గాలిబ్'కు ఉర్దూ సారస్వత చరిత్రమునందు గలప్రాముఖ్యత, పలుకు బడి, 'జౌక్'కు గాని మరి యితరులకుగాని లభింపలేదు. వీరిరువురును

ఫారసీ అరబ్బీ పండితులు బహు గ్రంథ నిర్మాతలు. వీరిద్దరి కవిత సంస్కృత పద భూయిష్ఠమైన కఠినమగు మార్గ కవిత వలె జటిలమై దీర్ఘ సమాసయుతమై యుండును. 'గాలిబ్' కవిత నారికేళ పాకమ నియే చెప్పవచ్చును. 'జౌక్' దేశీయ పదములు కొంచెం మెక్కువగా వాడినను భావగాంభీర్యము తక్కువగు కారణమున 'గాలిబ్'కు గలిగిన పలుకుబడి కలుగలేదు. 'గాలిబ్' సుఖ జీవిగానుండి బ్రిటిషు ప్రభుత్వము వారు తన యుపకార వేతనమును తగ్గించిన తరువాత, మన శ్రీ నాథుడు తన పోషకులైన ప్రభులనుదలంచి కస్తూరికై యేడ్చినటులే, మధు పానమునకు తగిన యవకాశము లేదని దుఃఖించుచు వా పోయి నాడు. వీరిద్దరి స్వభావములకును, కవితా శైలికిని, జీవితాదర్శములకును చాల సన్నిహితమగు పోలికగలదని చెప్పవచ్చును.

తరువాతియుగము. 'నాసిఖ్' 'అతిష్' లతో ప్రారంభ మగుచున్నది. వీరిలో ఉర్దూ సారస్వత కేంద్రము ఢిల్లీనుండి లక్నోకు మారుచున్నది. సిపాయి మ్యూటినీ అను తిరుగుబాటు సమయమున (క్రీ. శ. 1857) ననేక మహమ్మదీయ కుటుంబములు లక్నో చేరుకొని తలదాచుకొనెను. లక్నో నవాబులు వీరిలోని కవులను పండితులను ప్రోత్సహించిరి. పై 'నాసిఖ్' 'అతిష్' అను కవులిరువురు రెండు కవితా సంప్రదాయముల కాచార్యులు. ప్రత్యేక గురుశిష్య పరంపరలు గలిగిన నీరెండు తెగలవారికి స్పర్ధ. ఇరువురిలో 'నాసిఖ్' ఎక్కువ పండితుడు. భాషా సంస్కార మొనర్చినవాడు ఉపమ, అతిశయోక్తి, ఉత్ప్రేక్ష మున్నగు నలంకారముల నెక్కుడు వాడుకలోనికి దెచ్చెను. కాని మానవ భావములను చిత్రించుటయందుగాని లేక గంభీరమైన భావములను ప్రభావపూరితముగ వెల్లడించుటయందుగాని అతనికంత ప్రజ్ఞలేదు. ఈతెగకు జేందినవారే బహీర్, వజీర్, సహర్, రష్క్. 'అతిష్' కవి

'నాసిఖ్' కంటె తక్కువ పాండిత్యముగలిగియు సులభమై చక్కని విర్దుష్టమగు శైలిలో రసపూరితములగు భావములను వెలబుచ్చిన మధురకవి.

పేర్కొనదగిన ఇతర కవులలో 'సహరుల్ బయాన్' అను బిరుదముగల మీర్‌హసన్ మిగుల ముఖ్యుడు. ఇతని 'మస్నవీ'కి ఉర్దూ సారస్వతమునందు గొప్ప స్థానముగలదు. ఇంతటి 'మస్నవీ' ఇతరులెవ్వరు వ్రాయలేదు. తరువాత అనీస్, దబీర్ అను నిరువురు కవులు మర్సియాలను (స్మృతి కావ్యములను) పరిణితికి దెచ్చిరి. మర్సియా (Elegy) యన మృత సంస్కృతి. శోకరసము నుబికించి ఏడ్పించుటలో వీరిద్దరు ఘనులు. హసన్, హుసేన్ మున్నగు కర్బలా వీరులకథలు కరుణరస భరితములైనవి. మోహరంలో షియాలు సమావేశపరచు మజ్లిసులలో (సభలలో) పాడబడును నల్లనిదుస్తుల ధరించి యనుగుణమగు రాగములలో నీమర్సియాలను పాడునపుడు ముస్లింలుగానివారి హృదయములును పరిప్లుతములై బాష్పపూరితనయను లగుదురని నేను స్వానుభవమున నెరుగుదును. వీరిరువురు 'షియా'లైనందువలనను వీరి ప్రతిభయెల్ల 'మర్సియాల'లో వెలువడినందునను ఉర్దూ సాహిత్యమున వీరికితగిన గౌరవస్థాన మొసంగబడలేదని శంకించుచున్నాను. తరువాత పేర్కొనదగిన ముఖ్యకవి 'నజీర్' అక్బరాబాదీ. ఈకవి యాధునిక యుగారంభకుడని చెప్పవచ్చును. ఇతనికి పూర్వము ఢిల్లీ, లక్నో, రాంపూర్ హైదరాబాద్ పట్టణములందు పోషింపబడినది కేవల శృంగార కవిత. మన యాంధ్ర సాహిత్యమందలి ప్రబంధకవితా లక్షణములు గలిగి యుండును. గతానుగతికముగా వందలకొలది కవులు శృంగార వైరాగ్యభావములను పదభేదముతో నొకరి నొకరనుకరించుచు.

వ్యక్తపరచుచు కావ్యముల రచించిరి. మూడువందల సంవత్సరముల ఉర్దూ సారస్వతమున నీభాగమే యెక్కువ కనబడును.

క్రీ. శ. ౧౮౩౦ నందు మరణించిన 'నజీరు' అక్బరాబాదీ మాత్రము పండుగలు, సంతలు, ప్రకృతి దృశ్యములు మున్నగువానిని చిత్రించి కథలువ్రాసి దేశీయతను జాతీయతను ప్రతిఫలింపజేసెను. ఇతని ననుకరించి యనేక హిందూ మహమ్మదీయ రచయితలు ౧౯వ శతాబ్దముయొక్క రెండవభాగమునను ౨౦వ శతాబ్దమునను నూతన పథములను ద్రొక్కి నవీన వాఙ్మయమునకు దారితీసిరి. ఈనవీన వాఙ్మయ చరిత్రమును పరిశీలించుటకు పూర్వము రాంపూరు, హైదరాబాదు సంస్థానములలో పోషింపబడిన కవుల విషయ మించుక తెలిసికొన దగును. 'అమీర్' అను సుప్రసిద్ధకవి రాంపూరులోను, 'దాగ్' అను సుప్రసిద్ధుడగు కవి హైదరాబాద్ నందును దర్బారు కవులుగా నుండిరి. జలాల్, తస్లీం, అను కవులుగూడ నట్టివారే, 'అమీర్' 'దాగ్' వీరిరువురును వందల శిష్యులుగలిగిన కవులు. వీరికాధునిక గజల్ కవితా సాహిత్యమున మిగుల ప్రశస్తిగలదు. వీరిగజళ్ళు జనాదరణ మును బడసి వేలప్రజల నాలుకల నాశ్రయించినవి. కాని వీరును గతానుగతికముగ గజళ్ళను వ్రాసిరి. ఇతరులు పలికిన మాటలను మరింత మంచిగా పలుక ప్రయత్నించిరేకాని నూతనత్వము జూపింప లేదు. కీ. శ. 1905 లో 'దాగ్' మరణించెను. అతనికి ౧౫౦౦ మంది శిష్యులుండిరి.

'నజీరు' అక్బరాబాదీలో నవీన యుగ చిహ్నములు కొన్నికనుపడినను మౌలానా అల్తాపు హుసేన్ 'హాలీ' మహమ్మద్‌హుసేన్ 'ఆజాద్' పండిత రత్ననాథ్ 'సర్‌షార్' మౌల్వీ అబ్దుల్ హలీం 'షరర్' మౌల్వీనజీరు అహమద్, మున్నగు వారే యాధునిక ఉర్దూ సాహిత్య

మునకు యుగ పురుషులని చెప్పవలయును. ప్రకృతి దృశ్యములు చారిత్రిక విషయములు పండుగలు కథలు సాంఘిక సమస్యలు ఏ నిబంధనములేక నన్ని విషయములును వారికవితా సామగ్రిలో చేరినవి. కవితనేకాక ఉర్దూ వచన ప్రబంధముల నిర్మించి కథలను, నవలలను, వ్యాసములను విరివిగా వ్రాసి ఉర్దూ సారస్వతమును మిగుల సంపన్న ముగా నొనర్చిరి. 'హాలీ' ఆజాద్ 'నజీద్ అహమద్' వీరు సరు సయ్యద్ అహమదుఖానుకు చేదోడు వాదోడుగా నుండి భారతీయ ముస్లింలను వైజ్ఞానికముగా జాగరూకుల నొనర్చి వారిలో నూతన చైతన్యమును గలిగించిన పెద్దలు. నవీన మార్గముల ద్రొక్కుచు ముస్లిం జాతీయతను, భారతీయతను పెంపొందించు ప్రతిభావంతమగు కవితకు, సారస్వతమునకు వీరు మార్గదర్శకులైరి. 'హాలీ' కవి రచించిన 'మసద్దస్ హాలీ' యను షట్పద గీత సంపుటి ప్రతి జాతీయ వాదికి పఠనీయమైన గ్రంధమని చెప్పవచ్చును. ముస్లిం చరిత్రను సంస్మరించుచు పూర్వౌన్నత్యమును స్మరింపజేయుచు పాఠకుల కుత్తేజ మొసంగు చున్నను, కావ్యము భారత జాతీయతకును దోహద మొసంగు చున్నది. మున్షీదుర్గా సహాయ 'సురూద్' గూడ 'హాలీ' వంటి కవియే. మహమ్మద్ హుసేన్ 'ఆజాద్' మంచి కవియేగాక గొప్ప పండితుడు. 'ఆబెహయాత్' అను ఉర్దూ భాషా చరిత్ర గ్రంధకర్త. ఇతడు 'జౌక్' కవి కయ్యొక్క శిష్యుడు. 'కససేహింద్' అను భారత చారిత్రక కథలు "నైరంగె ఖయాల్" అను విచిత్ర గ్రంధము మిగుల ప్రశస్తిని గాంచినవి. బహుగ్రంధ నిర్మాతయు పండితుడునగు 'ఆజాద్' ను మన వీరేశలింగం పంతులు గారితో బోల్పవచ్చును. మౌల్వీ నజీరు అహమద్ కవియైనను వచన రచన యందే మిక్కిలి ప్రతిభాశాలి. అతడనేక గ్రంధముల వ్రాసియు, ఉపన్యాసములనిచ్చియు, సర్ సయ్యద్ యొక్క నవీనోద్యమమునకు గొప్ప చేయూత నొసంగి దేశ సేవ గావించెను.

'అక్బర్' అలహాబాదీయను సుప్రసిద్ధ కవి నవీన కవులకు సమకాలికుడు. న్యాయాధీశుడుగా నుండిన విద్యాధికుడు. ఇటీవలనే స్వర్గస్థుడయ్యెను. ఇతడాంగ్లేయ కవి పోప్ (Pope) వంటివాడు. సాంఘిక రాజకీయవిషయములను, అనేకములగు చిన్నచిన్న దైనందిన జీవిత సమస్యలను, దురాచారములను, పాశ్చాత్యవ్యామోహమునబడిన నవీనుల యతి నవీనతను వేయేల నన్ని విషయములను గట్టిగాను హాస్యరసము నుట్టికించుచును విమర్శించుట ఈ కవి యొక్క ప్రత్యేక ప్రతిభ యని చెప్ప వచ్చును. కందుకూరి వారి యొక్కయు లక్షణములు గలిగి ఆంగ్లేయులలో Pope, Swift మున్నగు విమర్శకాగ్రేసరులతో బోల్చుటకు దగినవాడు.

ఆధునిక ఉర్దూ వాఙ్మయ మతివిస్తారమైనది. కవిత, వచనసాహిత్యము రెండును దినదినాభివృద్ధిని గాంచుచున్నవి. నవలలు, కథలు, కధానికలు, పత్రికలు, నాటకములు మున్నగు వివిధ రచనలను పేర్కొనుటకేనియు నీవ్యాసమున నవకాశములేదు. ఆధునిక కవులలో కీ॥ శే॥ డాక్టరు ఎక్బాల్‌కు ప్రపంచ ప్రఖ్యాతి గలిగినది. ఎక్బాల్‌కు ఉర్దూకంటె ఫారసీపై ఎక్కువ ప్రీతియని రచనలవలన దెలియుచున్నను ఉర్దూలోనే కవిత నారంభించి, సుప్రసిద్ధమగు 'తరానా' (జాతీయ గీతము) షిక్వా, జవాబెషిక్వా మున్నగు కావ్యములను వ్రాసి భారత జాతీయతకు దోహదమొసంగెను. భారతీయ ముస్లిం సోదరులందు రాజకీయ చైతన్యమును తరువాత ముస్లింఐక్యతాభావమును పెంపొందింపజేసిన వాఙ్మయకారులలో నగ్రగణ్యుడు, గొప్ప తత్వవేత్త, ఫారసీ పండితుడు, మధురకవి, మతగ్రంధములను బాగుగా పరిశీలించి ప్రపంచమునందలి యాధునిక రాజకీయ సాంఘిక ఆర్థిక తత్వములను పవిత్రమగు 'ఖురాన్' యొక్క బోధల కనుగుణ్యముగా సమర్థించుట

కును విమర్శించుటకును బ్రియత్నించెను. పాశ్చాత్యుల జాతీయత నిజమైన జాతీయత కాదనియు మతైక్యతపై నాధారపడిన జాతీయత (Nationalism) నిజమైనదనియు, అందువలన ముస్లింలకందరికి తమ మతముయొక్క పునాదులపై నాధారపడిన ముస్లిం జాతీయతయే యాదర్శమనియు నుద్బోధించెను. రానురాను ఈతత్వము పాకిస్తానోద్యమమునకు తాత్వికమైన భూమికగా స్థిరపడినది.

హస్రత్ మోహానీ, సుప్రసిద్ధ జాతీయ ముస్లింనాయకుడు. ఇతడు సుప్రసిద్ధకవి. జోష్‌మలీహాబాదీయను ప్రతిభావంతుడగు నవకవి మన రాయప్రోలువారితో బోల్పదగినవాడు. కొన్ని సంవత్సరముల క్రితము హైదరాబాదలో నివసించియుండెను. ఆధునిక శృంగార కవిత యందును, జాతీయగీత రచనయందును పెట్టినదిపేరు. హిందూ మహమ్మదీయకవులనేకులీయుగమున పేర్కొనదగినవారుగలరు. వారి నామముల నేని పేర్కొనుట కీవ్యాసము చాలదు. షాద్, (కీ. శే. మహారాజాసర్ కృష్ణప్రసాద్) పండిత బ్రిజమోహన్ దత్తాత్రేయ 'కైఫీ' మున్షీ జ్వాలాప్రసాద్ 'బర్క్' పండిత దయానారాయణ 'నిగమ్' బ్రిజనారాయణ 'చక్బస్తు' కీ॥ శే॥ లాలా ప్రేంచంద్, ఇత్యాదులనేకులు ప్రతిభాశాలురైన యాధునిక హిందూకవులు రచయితలు గలరు. వీరందరు కాళిదాసుయొక్క కావ్యములను, సంస్కృత హిందీ భాషలలోని తదితర సాహిత్యరత్నములను ఉర్దూ సారస్వతమున కందిచ్చి మిగుల సేవగావించిరి. ఎందరో యువకకవు లిట్టిసేవ నిరాటంకముగా నిప్పుడును జేయుచున్నారు. మౌలానా షిబ్లీయను సుప్రసిద్ధ పండితుడు ఉర్దూభాషయొక్క యభివృద్ధికై హిందువులు గావించిన కృషిని ప్రశంసించుచు ప్రత్యేక గ్రంథమొకటి రచించి, ఉర్దూభాష హిందూముస్లింల సాంస్కృతిక సమ్మేళనమువలన జనించి పోషింపబడి వృద్ధిపొందినదని నిరూపించి యున్నాడు.

ఇతర దేశీయ భాషలలో వలె ఉర్దూ భాషలోను వచన రచన నవీన యుగముననే వృద్ధిబొందినది. 'గాలిబ్' మున్నగు వారి కాలమున నారంభమైన పండిత రత్ననాధ 'సర్‌షార్' యొక్క 'ఫసానె ఆజాద్' నై రేకోఃసార్, పీకహాఁ, కామినీ మున్నగు నవలా రత్నము లందు పరిణతి జెందెను. ఉర్దూ నవలారచన నారంభించినవాడు 'సర్‌షార్' పండితుడే యనవచ్చును. 'ఔధ్ అక్బార్' అను పత్రికాధిపతి కూడా తరువాత నవలా రచనలో 'అబ్దుల్‌హలీంషరర్' మున్నగు సుప్రసిద్ధ రచయితలు, బహుగ్రంధ నిర్మాతలీ వాఙ్మయమును వృద్ధి పరచిరి. మౌల్వీ నజీరు అహమద్, అబ్దుల్ హలీంషరర్, రత్ననాధ్ సర్‌షార్, మౌలానాషిబ్లీ మున్నగు సాహితీ పరులకు హైదరాబాద ప్రభుత్వము మిగుల సహాయ మొనర్చెను. మౌలానా జఫర్ అలీఖాఁ (సుప్రసిద్ధ లీగునాయకుడు) గొప్ప ప్రతిభాశాలియైనకవి, రచయిత. ఉస్మానియా విశ్వ విద్యాలయము, అంజుమనే తరక్కీ ఉర్దూ, దారుత్తర్జుమా దాయతుల్‌ముఆరిఫ్ మున్నగు సంస్థలు విజ్ఞానమును వెదజల్లుచు ఉర్దూ వాఙ్మయమున కఖండమైన సేవ నొనర్చు చున్నవి. ఉస్మానియా విశ్వ విద్యాలయ స్థాపనము నాటి నుండి ఉర్దూ యొక్క కేంద్రము ఉత్తర హిందూస్థానము నుండి హైదరాబాదకు మారినదని చెప్పిన నేమాత్ర మతిశయోక్తిగాజాలదు.

ఇతర వాఙ్మయమునందువలె ఉర్దూలోను సాహిత్యయుగ మందలి లక్షణము లన్నియు గలవు. ఛందోబద్ధముగాని గీతములు అనగా (Blank verse) వ్రాయుట, టాగూరు మహాకవి ననుసరించి వచన కవితల రచించుట, ఏకాంక, అర్ధాంక నాటికలు వ్రాయుట, ఖండ కావ్యములు, చిన్న గీతములు, ఒక పాదము పొడుగుగను మరి యొకటి చాల చిన్నదిగను రచించుట మున్నగు సర్వ విధములయిన క్రొత్త పోక

డలు ఉర్దూ వాఙ్మయము నందును గలవు. రియాలిజం, సర్రియాలిజం, ఇంప్రెషనిజం మున్నగు నవీన తత్వము లన్నియు నితర దేశభాష లందు వలెనే వృద్ధిజెందు చున్నవి. 'తరక్కీపసంద్ ముసన్నిఫీన్' 'అభ్యుదయ రచయితలు' వందలకొలది గలరు. హైదరాబాదలో ఇటీవలనే వారి మహాసభ జరిగియుండెను. ఈ రాష్ట్రము నందును పురాతన ఫక్కిని నవీన పద్ధతిని రచించు కవు లనేకులు గలరు. కొందరి ప్రతిభ ఉత్తర హిందూస్థానమునకు ప్రాకలే దంతియేగాని వారి శక్తిలోపముగాదు. మహాఘనతవహించిన మన ప్రభువుగారు స్వయ ముగా గొప్పకవులు. జాగీరుదార్లలోను నితర వర్గములలోను కవులు, రచయితలు ననేకులు గలరు. యువకులలో 'సాహెబ్‌జాదామైకష్' మఖుదూం మొహియుద్దీన్, పేర్కొన దగినవారు.

సర్ అల్‌ఫ్రెడు లాయల్ యను సుప్రసిద్ధ చరిత్రకారుడు ఉర్దూ కవితా వాఙ్మయమును గురించి కేవలము 'గజల్' సాహిత్యము నాధార ముగా గొని విమర్శించియున్నాడు. కాని కేవలము ప్రబంధ కావ్య ములను విమర్శించుచు ఆంధ్ర సాహిత్యమునందు గుణము లేదని దుర భిప్రాయపడుట పొరపాటగు నటుల మూడు వందల సంవత్సరముల కాలములో వెలువడిన ఉర్దూకవిత యందు గుల్, బుల్ బుల్‌మై, సాకీ, యార్, తప్ప నితరమేమియు గనపడదని లాయల్ పండితుని వలె విమర్శించుట పొరపాటగును. ఉర్దూ భాష యొక్క వాఙ్మయ మభి వృద్ధి నొందుచున్నది. కవిత, వచనవాఙ్మయము, శాస్త్ర గ్రంథ ములు, నవీన రచనలు, పత్రికలు, ఉపన్యాసములు మున్నగు సర్వవిధ సారస్వతమును పరిశీలించినచో సర్వతో ముఖముగా నభివృద్ధి నొందు చున్నదని తెలియనగును. మంచి ఉర్దూ కవితలో శ్రోతల హృదయ వీణా తంత్రుల కదలించి యుత్తేజింపజేయు నద్భుతమగు శక్తిగలదు.

ఇతర ఉర్దూ సారస్వతములో విలువగల యనేకమణులు లభించు చున్నవి. భారతీయ వాఙ్మయ ప్రపంచమున నితర దేశ భాషలతో సమానమగు గౌరవమును పొందుటయేగాక ఉర్దూ భాష యావద్భారత ప్రాముఖ్యతను సంపాదించుటకు తగిన యుజ్వలమైన ఆశాపూరితమైన భవిష్యత్తును కలిగి యున్నదని విశ్వసించుచున్నాను.

ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు గారి
షష్టి పూర్తి సంచిక 1943

---

# సూఫీ సర్మద్

ఆలంగీరు కాలమునను తరువాతను వ్రాయబడిన ఫారసీకవుల చరిత్రలలో 'సర్మద్' యను శీర్షికక్రింద కొన్ని పంక్తులు మాత్రము కానవచ్చుచుండును. కాని క్లుప్తములగు నాపంక్తులవల్ల నీమహాపురుషుని జననకాల విశేషాదులను గురించి ఏమియు తెలియలేదు. ఆలంగీరు కాలమున సమగ్రమగు చరిత్రను వ్రాయుటకై సమకాలీనుడగు మీర్జా మహమ్మదుకాజం పూనుకొనెను. కొంతకాలపు చరిత్ర వ్రాసినపిదప రాజకీయ కారణములవల్ల నతని యాప్రయత్న మాపివేయబడెను. తరువాత షాహ్ఆలంచక్రవర్తి కాలమున నతనియాజ్ఞచే ముస్తఇదు ఖానుడు మిగత (౪౦) సంవత్సరముల చరిత్రను విపులముగా వ్రాసి మొదటి పదిసంవత్సరముల సంక్షిప్తకథను జతగూర్చి 'మ ఆసరు ఆలంగీరీ' యను పేరుతో ప్రపంచమున కిచ్చెను. అట్టి సమగ్ర చరిత్ర యందును చిల్లరవిషయము లెన్నియో వివరింపబడినను 'సర్మద్' యొక్క పవిత్రగాథ వర్ణితము కాలేదు. మొగలాయి చక్రవర్తుల చరిత్రను విపులముగా వ్రాసి యందులో ఔరంగజేబుకు ముఖ్యస్థానము నిచ్చిన సూఫీఖానుడుకూడ నీమహాపురుషుని పేర్కొననైనలేదు. రాజకీయ కారణములు చారిత్రకుల కలమును, కథకుల నోళ్ళను ఏవిధముగా కట్టివేయునో చూడుడు.

'సూఫీసర్మద్' ఆలంగీరు చక్రవర్తియొక్క యాజ్ఞచే (క్రీ. శ. 1070) సంవత్సరమున మరణదండకు పాత్రుడయ్యెను. ఆ సంవత్సరమే ఆలంగీరు కూచ్‌బిహారు, అస్సాము రాష్ట్రములపై దండెత్తెను. చారి

త్రకులా యుద్ధవర్ణనమునకే ప్రాముఖ్యత నొసంగిరి కాని భక్తాగ్రేసరుడును వేదాంతియు విరాగియునగు 'సర్మద్' యొక్క నామమైన నుచ్చరింపలేదు. అయుద్ధ విజయధ్వానములలో తలవరియొక్క కరవాలముచేత బ్రహ్మైక్యమొందిన 'సర్మద్' ముఖోదితములగు జీవబ్రహ్మైక్యవాక్యములు భవిష్యత్కాలమున నెవ్వరికిని వినరావవి తలంచిరి కాబోలు నీచరిత్రకారులు! కాని సత్యము-అందును నింతక్రూరమైన సత్యము. ప్రపంచముయొక్క కన్నులనుండి యెంతోకాలము డాగియుండుటకు వీలుపడదని వారెరుంగరు. షేరుఖాన్. తన 'మిరాఅయల్ ఖయాల్' యను పుస్తకములోను 'అలీఖులీఖాను' అనునతడు తన 'రియాజుమైఆరా' అను కవుల చరిత్రమునందును 'సర్మద్' చరిత్రను గ్రంథస్థమొనర్చిరి. మరికొందరు గ్రంథకర్తలుకూడ విన్నంత కథను సమకూర్చిరి.

'సర్మద్' పర్షియా దేశములోని కాషాన్ పురవాస్తవ్యుడు. అతని వంశమువారు 'ఆర్మినియన్' జాతికిచెందిన యూదుమతస్థులై యుండిరని చరిత్రకారులు చెప్పుచున్నారు. ఆకాలపు పర్షియా దేశమువారు ఏమతస్థులైనను ఫారసీ భాషయందు సరసమైన కవితాశక్తిని చూపినట్టుల నిదర్శనములు కలవు. మతము తప్పనాదేశస్థులగు ఇతర మతస్థులు మహమ్మదీయులతో జాతీయ సంస్కృతికి సంబంధించిన ఏవిషయముననను తీసిపోనట్టివారు. ఇస్లాం మతముయొక్క విజ్ఞాన కిరణములు ప్రసరించుచు జాతి మత సాంఘిక విభేదముల నన్నిటిని తుత్తునియలు జేయుచు ప్రపంచమంతటను విజృంభించెచు అరేబియా అబీసినియా, ఈరాన్ మున్నగు దేశములందు ఎడారులనక అడవులనక పట్టణములనక పల్లెలనక పెద్దలనక పిల్లలనక అందర నాకర్షించి సార్వజనీనమై వ్యాపించెను. ఆకిరణప్రసారమున నుజ్వలము కాని

జాతియే లేదు, వ్యక్తియేలేదు. ఎంతవరకు కాంతివంతమైనది యాజాతియొక్కయు నావ్యక్తియొక్కయు పూర్వసంస్కారముపై నాధారపడి యుండెను.

...

ఇట్టే 'సర్మద్,' ఈరాన్ యొక్క ఆర్మీనియన్ జాతికి జెందిన యూదు మతస్థుడో లేక క్రైస్తవుడో యైయున్నను ఎల ప్రాయముననే ఇస్లాం మతముచే నాకర్షింపబడి యా మతమును స్వీకరించెను. ఇతని చరిత్ర యెక్కువగా తెలియదు. 'సర్మద్'యను పేరు తప్ప ఇతని తలిదండ్రు లెవరో పూర్వనామమేదియో ఇస్లాం మతమును స్వీకరించిన పిదప కలిగిన నామాంతర మెద్దియో ఎవరికిని తెలియదు. పరమ యోగియగు నితడు అనామధేయుడగుట లేక యజ్ఞాత చరిత్రుడగుట సమంజసమేగదా! 'సయీద్'యను పేరొకటి ఇతని 'సర్మద్'యను కవితా నామమునకు కొందరు గ్రంధకారులు తగిల్చి యున్నందున బహుశః అది యతని నామభాగమేమో యని యనుమానము. ఇంత కన్న నతని బాల్య చరిత్రమును కాని యతని విద్యాభ్యసనాది వివరములు కాని తెలిసికొనుటకు వీలులేదు. ఆ కాలమున అరబ్బీ ఫారసీ భాష లందు విశేష పాండిత్యమును గడించిన వాడని మాత్రము గ్రంధకారు లందరు నైకకంఠ్యముగా వచించు చున్నారు.

వాణిజ్య మతని వృత్తి. ఈరాన్ నుండి సరకులను తీసికొని యమ్ముకొనుటకై హిందూస్థానమునకు వచ్చెను. హిందూస్థాన మపుడు విలువగల సరకులకే యాలవాలము కాదు. రసికులగు మనుజు లకును స్థావరమై విలువగల మనుష్యులను తన విశాల గర్భమున లీన మొనరించుకొను శక్తియు గలిగి యుండెను. పాపము సరకు లమ్ముకొనదలంచి ఈదేశమున ప్రవేశించిన యీ యువకుడు తనపూర్వ సంస్కారముచే నాకర్షితుడై ఈడ్చుకొనబడినవాడే గాని కొనకు తన

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No. 1562

ప్రాణధనము నీ దేశమున కర్పించి విలువలేని కీర్తిని గడించి తన నామమును చిరస్మరణీయముగా జేసికొందునని కలనైనను దలచి యుండడుగదా ! భారత దేశము యొక్క మణి మాణిక్యములను గొను టకై వచ్చి తురకీయువకుడు తన జీవిత ధన భండారమునే దేశమున కర్పించి కీర్తికాయుడయ్యెను

ఆకాలమున సింధుప్రాంతమునుండి ఈరాన్ దేశపు వ్యాపారు లీదేశమునకు వచ్చుచుండిరి. సింధు ప్రాంతములలోని పట్టణములలో 'థతా' యను పట్టణమొకటి ముఖ్యమైనది. ఇపుడది యొక పాడు కొంప. దేశపటమున దానికి ప్రాముఖ్యములేదు. ఆపట్టణముననే తొలుదొల్త భారతదేశీయ సౌందర్య లావణ్యమతని నాకర్షించి యున్న తుని గావించెను. అతడొక హిందూ యువకుని స్నేహమునాశించి యతని ప్రేమానురాగ వల్లికలచె సంపూర్ణముగా బద్ధుడై విడజాల కుండెను. ఆసఖుని లోలాపాంగ వీక్షణముల విభ్రమములకు కట్టుబడి హృదయ సమర్పణము నొనర్చెను. ప్రణయైక జీవియగు వానికి తన ప్రేమాస్పదమగు వ్యక్తియొక్క పుట్టుపూర్వోత్తరములు, మంచి చెడ్డలు, ధర్మాధర్మములు, విచారణీయములు కావు. అసలక్కడ విచారమునకు తావేలేదు. ఆకంటికి లోపములే కనపడవు. ఎట్లైనను హిందూయువకుని ప్రేమానుబంధమే 'సర్మద్' జీవిత సౌధమునకు ప్రథమ సోపానమయ్యెనని తెలియుచున్నది.

ఇష్కెహకీకీ (భగవద్భక్తి) కి ఇష్కె మజాజీ (మానవప్రేమ) పునాదియని సూఫీలును భక్తులును నమ్మచుందురు. ప్రణయజీవన మొక యజ్ఞమనియు నీయజ్ఞమునం దాహుతి యగుటయే ప్రణయ పథానువర్తియగు పాంథునిధర్మమనియు, ఈధర్మము నిర్వర్తించనిదే భగవన్మందిర ద్వారముల ప్రవేశించుట కర్హతకూడ చిక్కదనియు,

ప్రేమ మార్గమునందు గలుగు హృదయోద్వేగ జనిత పరిపాకము భక్తిమార్గానువర్తుల కవసరమగు నా యాత్మసంస్కారము. ఈ సంస్కారము నపేక్షించుచు హృదయవేదన నొసంగుమని ప్రార్థింతురు సూఫీలు. 'అత్తార్' అను సుప్రసిద్ధ సూఫీకవి.

" నాస్తికుని నాస్తికత యేల నాకు వలదు
ఆస్తికుని యాస్తికతకేని యాసపడను
చిత్తసంశుద్ధి గోరెదు మత్తునకును
రాగ సంతప్త వేదనా రజమె చాలు "

నని పాడెను. ముగ్ధస్మేరమగు ప్రేయసీమోహన ముఖారవింద ముపై గప్పిన ముసుంగు దొరంగినచో నేచిత్తము యొక్క శాంతి సౌధముపై పిడుగులు పడవో! జీవరహిత చిత్రము నిరతిశయ లావణ్యా గుణ పరిపూర్ణమగు భగవ ద్విలాసము నేరీతి గనుంగొన జాలును? ఏ శిథిల మనస్కుడు దన మధుర నిశీథములను ప్రణయినీ దృగ్విలాస విభవముల మననము జేయుచు గడపుట నెరుగడో వాని కానంద స్వరూపుడగు ప్రణయ మూర్తిని ధ్యానించుచు రాత్రులు తపించు భాగ్య మెట్లబ్బును? ఏ గర్వోపహతుడు దన ప్రణయ నిధానము నెల్ల ప్రేయసి యొక్క మద గజ గమన గర్విత చరణ ద్వయంబు పైస మర్పణంబు చేయలేదో వానికి నాత్మస్తుత్యహంభావ రూపములగు శిలా విగ్రహముల బగల్చుటకే రీతి శక్తి గలుగును? ఏశుష్క హృదయము మనోహారిణీ మధురాధర సంజనిత గానామృతముచే నున్మత్తమై పరిభ్రమింపదో యది పరమ పురుషుని వేణునాద సుధాలహరిచే నెట్లు తరంగిత మగును? పూర్వము కాలిన వత్తియే తీవ్రముగా నంటుకొని జ్వలించును గాని, క్రొత్త వత్తిని పెట్టిన దీపము వెలిగించుట కాలస్య మగునుగదా?

వేదనాభర చిత్తమందునవేగమే ప్రణయంబుబుట్టును
పొగలువెళ్ళెడు దీపకళికలు పొంగివేగమెవెల్లవే........

ఐననీ ఇష్కే-మజాజీ ప్రథమ సోపానము మాత్రమే! ఆమెట్టును దాటి పైకి వెళ్ళినవానికి నీయుపకరణంబుల నవసరములు, కావున 'సరమద్' కీయుపకరణము నొసంగిన వ్యక్తియగు నాహిందూయువకుడు చిరస్మరణీయుడు! ప్రణయ వీధిలో నమ్మబడిన 'సర్మద్'ను కొన్నవాడా యువకుడని మాత్రము తెలియును కాని యతని చరిత్ర మజ్ఞాతము, అతడు సూరత్ నివాసియని యొక గ్రంధకర్తయు అజీమాబాద్ పట్టణ వాస్తవ్యుడని మరి యొకడును వ్రాసినాడు. కాని యీ గ్రంధము లన్నిటిలో పురాతన మగు 'మెరా ఆయీ= ఖయాల్'యను గ్రంధమున సింధు ప్రాంతములోని 'ఠఠా'నగర వాస్తవ్యుడని చెప్పబడినది. కావున నిది ఎక్కువ విశ్వసనీయమైనదని తలచవచ్చును.

ఈ ప్రణయ జీవనము 'సర్మద్'కు రానురాను జ్ఞాన వైరాగ్య సమన్వితమగు నొక యున్మాదము క్రిందికి పరిణమించినది. ఐహిక సంపత్తులనన్నిటిని త్యజించి 'సర్మద్' విరాగి యయ్యెను. సర్వవిధ వాంఛలను వదలి యోగియయ్యెను. కొంత కాలము సాంసారిక సంబంధములలో వస్త్రధారణ మనుబంధము మాత్రము వదలలేదు. పిదప నదికూడ వదలి దిగంబరు డయ్యెను. ఈ బంధము లన్నియు విజ్ఞుల మనుకొను వారికే కాని యున్మత్తులగు వారికేల? ఇట్లా దిగంబర మూర్తి చిరకాలము సింధు ప్రాంతములోని గ్రీష్మతప్తములగు నెడారులలో దన కాళ్ళను గాల్చికొని పిదప భారత దేశము యొక్క యితర ప్రాంతములనెల్ల గ్రీష్మాతప శరత్సీ తంబులనొక్క విధముగ బుచ్చి పర్యటనము గావించి వచ్చెను. తుదకా కనుల పొరవీడెను. మాయా యవనిక తొలగి సత్య దృశ్యము గోచరించెను.

"ఏలవృథాపథంబుల జరించెదు? విశ్వప్రియానుషంగ హృద్యైల విలోల చిత్తమున వేసరక౯ వెదకంగనేల చాల్చాలు స్థిరంబు నొందు మొక స్థానముజేరి సుఖించిదేవమీ యేలికయేని స్వయమే యరుదెంచును దర్శనార్థమై.

ఈభావము కలిగినపిదప నొక స్థిరనివాసము నేర్పరచుకొనుట కభిలాష కలిగెను. ఆకాలమున నాలంగీరు రాజకీయ రంగమున క్రొత్తనడకను ద్రొక్క నుంకించుచుండెను. షాఁజహాను చక్రవర్తి యొక్క తుదిరోజులవి. "దారాషికో" అతని యువరాజు. మొగలాయి చక్రవర్తుల వంశములో నీ "దారాషికో" యొక విచిత్రమైన విశిష్టమైన వ్యక్తి. సుగుణసంపదలు శక్తిసామర్థ్యములు శత్రులగు చరిత్రకారుల చేతిలో మరుగుపడి పూర్ణముగా దెలియకున్నవి. ఇతడు విజ్ఞాన ప్రియుడు, ధర్మజిజ్ఞాసువు, యోగులు, పండితులు, సూఫీలు, అన్న అతనికి ప్రేమ. సదా వారి సాహచర్యము పండితగోష్ఠి యతని దినచర్య. కాలవాహినిలో కొట్టుకొనిపోవక నిలిచిన యతని వ్రాతల వలననే యతని జ్ఞానసంపద వెల్లడియగుచున్నది. తత్వజిజ్ఞాసలో నతడు మతభేదములను పాటింపలేదు. ముస్లిం ఫకీర్లు, సూఫీలు, యతనికెంత పూజ్యులో హిందూయోగులు సాధులుకూడానంతేపూజ్యులు. ఈమతవిభేద మాతత్వజిజ్ఞాసువు వద్దనుండిన నతడు నిజమగు జిజ్ఞాసు వెట్లగును? శలభము దీపమును వెదకవలసినదేకాని యాదీపము కాశీలోనుండినను కాబూలులోనుండినను శలభమునకు సమానమే! దేశదిమ్మరియైన దిగంబరుడు 'సర్మద్' షాః జహానాబాద్ ఢిల్లీకివచ్చి యక్కడ నిలచిపోయెను. అచట విధి యాతని పాదములకు సంకెళ్ళను వేసెను. 'దారాషికో' కు పిచ్చివారలపై ఎక్కువప్రేమ గనుక నితనిదగ్గరికి దీసెనవి 'మీరాఅమీ౯ఖయాల్' కర్తయు ఆలంగీరు

భక్తుడునైన అలీషేరు వ్రాసియున్నాడు. పాపము ప్రపంచములోని బుద్ధిమత్త్వము నొక పళ్ళెమునను, ఉపిచ్చితనము నొకపళ్ళెమునను పెట్టి తూచుటకు తగిన త్రాసుకూడా ఒకటి కలదని, ఈ అలీషేరు కేమితెలియును ? ఈ ప్రపంచమున నితరుల బుద్ధిమత్త్వముయొక్క నిధికిబదులు 'సర్మద్'కు గలిగిన యున్మాదలేశము లభించిన చాలునను వారుకూడా కలరు. 'ఆలంగీరు' యొక్క బుద్ధి వైశద్యముకంటె దారాషికో యొక్క యున్మాదము మెచ్చదగినది కాదా ! ఆబుద్ధి బలము భక్తుల రక్తముచే సిక్తమైనది. ఈ యున్మాదము స్వరక్త నాశముల బలినొసంగి యాత్మసమర్ధనము గావించినది. ఇట్టి యున్మాదమే దారాషికోకు ప్రియతరముగా నగపడిన చిత్రమేమి ?

దారాషికోకు 'సర్మద్' పైన భక్తివిశ్వాసములు వృద్ధియయ్యెను అప్పుడతడు బయటికి వెడలినను 'సర్మద్' ఢిల్లీని వదలి పోవలేక పోయెను. షాహ్‌జహాను చక్రవర్తి రోగగ్రస్తుడైనందున దారషికో యువరాజు రాజకార్యముల జూచుచుండెను.

ఈర్ష్యాగ్రస్తుడగు ఆలంగీరుయొక్క సంకల్పముల కవకాశము చిక్కెను. కొంతకాలము అలజడులు కలిగించి రక్తపాతము నొనర్చి తుదకు (క్రీ. శ. ౧౬౫౮) లో ఆలంగీరు సింహాసనాధిష్ఠితుడయ్యెను. ఈకాలము దారాషికోయొక్క స్నేహితులకును సహచరులకును అతని కంటె కష్టతరమైనది. దారాషికో వెంబడి పట్టణము విడిచినవారు విడచివెళ్ళిరి. కాని 'సర్మద్' వంటి యున్నత్తున కంతటి యవకాశ మెక్కడ లభించును ? అన్నియు మరచిపోయెడు యున్మత్తసమాధిలో నీగడబిడలు నీపలాయనములు సర్మదునకేమి తెలియును. ? తెలిసినను యతడు వెళ్ళువాడా ! అతనికి తన ప్రణయోన్మాదము నందలి ప్రథమ

సోపానము మాత్రము ముగిసినదనియు ముందుమెట్టు నెక్కుటకై యదను లభించుచున్నదనియు తెలియదా!

'సర్మద్' యొక్క 'షహాదత్' (జీవిత సమర్పణము) విషయము చరిత్రకారులు వివరముల నిచ్చియున్నారు. 'సర్మద్' వ్రాసిన క్రిందిగీతము మతాధికారులగు గురు పీఠాధిపతులకు కఠోరముగా దోచినది. దాని యాధారమున మహమ్మద్ ప్రవక్తసశరీరముగా స్వర్గమునకేగెనను విశ్వాశము చెందింపబడినదనియు 'కాఫర్' అనగా 'నాస్తికత' యని వారు తీర్మానించిరి.

చ॥ తెలిసిన తత్వవేత్తలు మథించి రహస్యములన్ని గాంచియే, పలికిరి బ్రహ్మమీజగము బ్రహ్మల మేమనటంచు ధీరత। గలసెరసూలు మింటనని గాధలసెప్పును మ్రోలవీడునే। బలికెద తత్వమాకసమె ప్రాకెను అహ్మదులోనలీనమై.

ఇందులోని వివాదాంశములతో నీవిరాగికేమి పని? పండితమ్మన్యులు గావించు కుతర్కముల వైపతడు కన్నెత్తిచూడలేదు.

గీ॥ ప్రణయ మార్గపు చిత్రమౌ పథములందు
బుద్ధివాదంబు నకు తావు పొసగదైన
..................................
యోచనలవేల నీభక్త యోగమునకు?

నిజస్థితియేమన ఆలంగీరు దృష్టిలో 'సర్మద్' గావించిన గొప్ప నేరము దారాషికో యొక్క సాహచర్యము. ఏదో నెపమున నతని వధింప చూచుచుండెను. ప్రాచ్యఖండములో నప్పుడు రాజకీయములు మతము యొక్క తెరచాటున చరించినవి. రాజకీయ కారణముల

వలన గావింపబడిన వేన వేలు వధలు మతమను ముసుగుచే కప్పి వేయబడినవి. 'సర్మద్' పై మోపుట కేనేరము దొరక నందున నతని దిగంబరత్వము 'షరా'కు విరుద్ధమని నిషిద్ధమని సిద్ధాంతముజేసి నేర మారోపింపబడెను. రెండవ నేరము పై గీతమునందు పవిత్రుడగు రసూలు ప్రవక్త యొక్క సశరీర స్వర్గగమనముపై యవిశ్వాసమును ప్రకటించుట. ముల్లాఖవీయను నతడా కాలమున ఉన్నత న్యాయాధికారి. ఆలంగీరాతని 'సర్మద్' యొద్దకు పంపి దిగంబరుడుగా నుండుటకు కారణము విచారింపించెను. ముల్లాగారు 'సర్మద్'ను పండితాగ్రే సరులును విద్వజ్జన భూషలగు మీరు దిగంబరులగుటకు కారణమేమని య డు గ "ఏమిజేయుదు షైతాన్ (అసుర ప్రవృత్తి) ప్రబలుడై యున్నాడని చెప్పెనట. క్రింది గీతమును పాడెనట.

> ఉన్నతాగ్రమునుండి క్రిందికి నుగ్రుడై పడద్రోసెగా !
> దుష్ట నేత్రము చేతిగిన్నెల దూసుకొని పోయెన్
> వీడుచంకలో నుండగానే వెదకుచుంటిని నెల్లెడన్
> దొంగ చిత్రము జూడు వస్త్రము దోచుకొని పోయెన్ ॥

ముల్లాగారికి కోపము వచ్చెను. కోపించుటకు 'సర్మద్' కారణము నొసంగెను. ఇస్లాం మతమును తృణీకరించలేదు కాని ఇస్లాం యొక్క యాస్తికత్వమునే తృణీకరించెను. ఇబ్లీని అనగా దుష్ప్రవృత్తి యొక్క ప్రాబల్యమును సిద్ధాంతీకరించెను. ముల్లాగారు తిరిగి వచ్చి నాస్తికుడని శిక్షించుటకు తగిన యాధారము లభించెనని చక్రవర్తికి మనవి చేసికొనియెను. ఆజ్ఞా పత్రిమును వ్రాయుట కుద్యుక్తుడై కలమును పట్టెను. కాని యాలంగీరు వంటి దూరాలోచన పరుడు కేవలముదిగంబరత్వమె శిక్షకు పాత్రుని జేయదనియు 'సర్మద్' వంటి మంచి తత్వవేత్తను పౌరుల భక్తివిశ్వాసముల నాకర్షించుచున్న జ్ఞానిని

ఇంత కంటె ప్రబలమైన కారణము లేనిదే వధించుటొప్పదని విలంబము గావించెను.

ఇస్లాం యొక్క పదమూడు వందల సంవత్సరముల చరిత్రలో శాస్త్రజ్ఞుల కలము ఒరలేని కత్తియై గనుపడుచున్నది. వేన వేలు తత్వజ్ఞుల రక్తముచే వారి ధర్మ పరిష్కారములు కళంకితములై యున్నవి. ఇస్లాం యొక్క చరిత్రము నెటు నుంచి చదివినను రాజు మరణ దండన విధించుటకుద్యుక్తుడై నపుడు న్యాయాధీశుని యొక్క కలము, సేనాధిపతి యొక్క కరవాలము, రెండును ఒకే తీరుగ పని చేసెననుటకు సూఫీల వందల కొలది యుదాహరణములు దొరుకును. దేశభక్తులు మాత్రమేకాదు మతశాస్త్రజ్ఞులలో కూడా నెవరు తత్వ రహస్యముల సమీపించిరో వారు న్యాయాధికారుల వలన దుఃఖముల పాల్బడిరి. తుదకు తలనిచ్చి ముక్తినొందిరి, 'సర్మద్' కూడా నదే కత్తికి బలియయ్యెను.

తుదకు 'సర్మద్'ను పండితులు విజ్ఞులు మున్నగు వారీ సభకు రప్పించి పండితు లందరి యభిప్రాయ ప్రకారము పరిష్కరించవల యునని తీర్మానింపబడెను. సభ సమావేశమయ్యెను. 'సర్మద్' రప్పింపబడెను. ప్రప్రథమమున చక్రవర్తి స్వయముగా నతని సంబో ధించుచు 'సర్మద్' దారాషికోకు రాజ్యప్రాప్తి యొక్క యాశీర్వచనము నొసంగెనట నిజమేనా ?" యని యడిగెను. అందుకు 'సర్మద్' అగును ఆయాశీర్వచనము నిజమై పరిణమించెను. "అతడు చిర స్థాయియగు రాజ్యమునకు పట్టాభిషిక్తుడయ్యెను" అని చెప్పెను. పండిత ప్రవరు లందరు దిగంబరత్వము శాస్త్ర విరుద్ధము. ఈ నియమమునకు విజ్ఞులు మూఢులు అందరు సమానులే" యని వచించిరి. ఈ పూర్వ పక్షమునకు మొదలే 'సర్మద్' ప్రత్యుత్తర మిచ్చియుండెను,

" దొంగచిత్రముజూడు వస్త్రము దోచుకొని పోయె "

అని,

ఆలంగీరు చక్రవర్తియొక్క తుదికాలమున 'ఖలీఫా యిబ్రాహిం బదఖుషానీ' అను నొక్క పూజ్యుడగు విబుధుడుండెను. అతని పలుకాకులుగా 'వాలెః ధాగిస్తానీ' అను రచయిత ఈకథ నీక్రింది విధముగా దెలుపుచున్నాడు. ఆపతితుల సభలో 'సర్మద్' ను వస్త్రములను ధరించుమని బలికిరట. ఆతడు కాదనియెను. చక్రవర్తి పండితులతో దిగంబరత్వము వధించుటకు పాత్రునిజేయు యధికారమును పలుకుచు 'సర్మద్' ను 'కల్మా' చదువుటకై కోరెను. కారణమేమన 'సర్మద్' కల్మా చదువునపుడు 'లాఇలా' అనిమాత్రోముచ్చరించు వాడు; 'అల్లల్లా' అను కొసభాగముచ్చరింపడు. ఈసంగతి తెలిసియే చక్రవర్తి ఇట్లుకోరెను. 'సర్మద్' అట్లే 'లాఇలా' అని చదివి విరమించెను. ఇది కేవలము నాస్తికతయని పండితులు విజృంభించిరి. 'సర్మద్' అందుకు నేనింకను నాస్తియనుటలోనే పడియున్నాను. 'ఆస్తి' యని పలుకు మెట్టునకు చేరలేదు. చేరనిదే యట్లనిన నసత్యమగు హృదయమున లేనిది వాక్కున కెట్లువచ్చును ? యని బదులు చెప్పెను. ఇట్లనుట నిస్సందేహముగా నాస్తికతయని పండితులు నిర్ణయించిరి దీనికి శిక్ష వధయని తీర్మానించిరి. ఈపండితమ్మన్యులు ఆస్తినాస్తియను శుష్కవాదములందు బడి 'సర్మద్' ఈమెట్టునుదాటిన వాడనియు తమశిక్షలకు వెలవడనియు తెలుసుకొనలేదు. వీరు తమ ప్రాంగణమునను నిలుచుండి తమ యౌన్నత్యముచే గర్వించుచుండిరి. అతడు 'కాబా' దేవాలయము రెండు సమానముగా నగపడుచు రెంటి ధ్వజములొకేసారి ఏకముఖముగా నెగరుచుండుట గనపడునట్టి ప్రణయ సౌధాగ్ర భాగమునుండి చూచుచుండెను.

'సర్మద్' తన మహాభావమును నిస్సంశయముగా వెల్లడించి యుండెను. అనుమాన ప్రమాణములచే సంతృప్తి నొందని జిజ్ఞాసువులు ప్రత్యక్ష స్వరూప దర్శనముచే దమ విశ్వాసమును దృఢీకరించు కొన గోరెదరు. ఈ ప్రత్యక్ష స్వరూప దర్శనమింకను 'సర్మద్'కు లభింపకుండెను. అందువల్ల తాను దేరిచూడని పదార్థము 'కలదని' ఎట్లనును? జిజ్ఞాసా మార్గమున నడచు పాంథులందరికీ పయనమున దోవలో నిట్టి మెట్టుల దాటవలసియుండును. 'సర్మద్' గావించిన దోషమేమన, ఇతరులు పరోక్షముగా దాగుచు ద్రావెడు మధువును 'సర్మద్' ప్రత్యక్షముగాను నిర్భయముగా నోటికి పట్టెను. అందువలన శిక్షకు పాత్రుడయ్యెను. ఇట్లు నిర్భయము ప్రకటించుట గూడ 'సర్మద్' కవసరమైన యుపకరణమే! పరమేశ్వర సాక్షాత్కార మేకోరుచున్న వానికి నీ విధమున సారూప్యమును బొందుటయే ఫలము. ఇట్లు 'సర్మద్' పండితుల యాజ్ఞను శిరసావహించుట కియ్యకొనన నందున వధ్యుడని తీర్మానింపబడియెను. మరునాడు వధ్యశిలకు తీసికొని పోయిరి. ఇది ౧౦౭౦ హిజ్రీ యనగా ఆలంగీరు చక్రవర్తి పట్టాభిషిక్తుడైన రెండవ సంవత్సరము. "అనల్ హక్" (సోహంబ్రహ్మ) యని జీవ బ్రహ్మైక్య సిద్ధాంతము నుచ్చరించు పరమయోగి పుంగవుడగు 'మన్‌సూరు' ఒకడు. రెండవ వాడీ 'సర్మద్' ఇతని వధ్యశిలకు గొంపోవునపుడు గుంపులు గుంపులుగా పురజనులందరు గుమిగూడి ఈ యజ్ఞమును కనులారగాంచిరి. తలవరి తన కర వాలమును మెరపించుచు ముందుకు దుముకుచుండ 'సర్మద్' ముందునకు నడచి "రమ్ము! రమ్ము! వచ్చితివా! నీవేస్వరూపమున వచ్చినను నిన్నునే నెరుంగుదును." అని స్వాగత మొసంగెను. ఈ క్రింది పద్యమును చదువుచు ధైర్యముతో తల కరవాలమున కెరగావించెను.

వినబడె తీవ్రి నినాదము వీనుల కొకనిమిషం
కనలేదను కలమరచితి కనుల విప్పితినినే
కనబడె కుటిల నిశీధిఁ కారుమబ్బు లొకవంకఁ
కనుమరగఁ కూర్కుచుంటినే గాని నిదుర వచ్చెనే!

గ్రంధకర్తలు చక్రవర్తియొక్క స్తోత్ర పాఠములనుండి 'సర్మద్' యొక్క రక్తసిక్తమగు శవముపై రెండు కన్నీటి చుక్కలనేని విడుచుటకు తీరిక చిక్కలేదు. కాని ఇంతటితో తృప్తిజెందక నీరక్త పాతమునుగూడ యాలంగీరుయొక్క సుగుణవర్ణనాకథనంబున నొక రత్నముగా పరిగ్రహించి ఈ సుకృత ఫలంబు నపేక్షించు చున్నాడు.

'సర్మద్' యొక్క సమాధియని తలంపబడు ప్రదేశము సమాధి కాదనియు వధింపబడిన స్థలమనియు కొందరి మతము. కాని వధింప బడిన స్థలముననే యతని శవమును సమాధి స్థలమొనర్చిరని "వాలెః దాగిస్తానీ" విశదీకరించి యున్నాడు. కావున రెండు నొకటియేయని నమ్మదగును. మరియు నేను రెండవసారి యీసమాదిని దర్శించితిని. అన్నిజు తావులందును దానిపై పచ్చిక మొలచియుండును. ఈవిచి త్రిము రెండవ మఁసూరనదగు నీతని మాహాత్మ్యమేమో! యని వ్రాసుకొన్నాడు. ఈగ్రంధకర్త మహమ్మద్‌షాః కాలముత క్రీ. శ. ౧౧౬౦లో దన గ్రంథమును రచించెను. ఇప్పటికి నీసమాదిని దర్శిం చినవారు 'ఫాతెహా' శాంతి పాఠమొనర్చి వెళ్ళుదురు.

బ్రతికియుండినపుడు 'లాఇలా' యను ప్రథమభాగము మాత్రము బలుకుచుండిన 'సర్మద్' యొక్క ముఖము కంఠవిచ్ఛేదితమై 'లాఇలా హల్లిల్లా' యను పరిపూర్ణ వాక్యమును మూడుసారు లుచ్చరించె ననియు, లోకులీ దృశ్యమును గాంచిరనియు, వినిరనియు, 'ఖలీఫా

ఇబ్రాహిం బదఖ్శానీ' వాక్యములను ప్రమాణముగా గొని పైగ్రంధకర్త వ్రాయుచున్నాడు. ఈకాలమున నిట్టి గాధలను పుక్కిటి పురాణములని జనులు విశ్వసించక పోవచ్చును కాని సత్యాన్వేషణకు పూనుకొనిన వానికిని, వసంతమున వికసించిన పువ్వులను హేమంతమున శుష్కించిన కొమ్మలను మాటలాడుచు వినినవానికిని, ప్రణయబలినొసంగిన 'సర్మద్' యొక్క శిరచ్ఛేదితములగు పెదిమెలు కదలుట కనబడుట హాశ్చర్య జనకమా ?

పట్టాభిషిక్తుడైన రెండవయేట నీరక్తపాత మొనర్చిన యాలంగీరు చక్రివర్తి తరువాత (౫౨) సంవత్సరములు రాజ్యమొనర్చెను. ఈకాలమున నెప్పుడాతనికి శాంతి లభించలేదు. మరణముకూడ పలస్థలములోను విషాదావస్థయందును సంభవించినది. ఏమహాత్ముని రక్తబిందువుల ప్రభావమో ! కాని యా మహాత్ములొక వాక్యమేని బలుకనప్పుడు మనకేల చక్రవర్తిపై కోపము ?

# సర్మద్ గీతములు

'సూఫీసర్మద్' యొక్క జీవితగాధను అబుల్‌కలాం ఆజాద్‌గారి మాలముననుసరించి భారతి జూలై సంచికలో ప్రకటించియుంటిని. సూఫీలలో గొప్పవారందరు కవులే. మౌలానారూం ఫారసీ కవులలో నగ్రగణ్యుడు. సూఫీలలో ముఖ్యాతిముఖ్యుడు. ఈవేదాంతులు హిందువుల సాంఖ్య సిద్ధాంతములను గ్రీక్కుల Neopla foric సంప్రదాయమునకు చెందిన భక్తితత్వములను స్వీకరించిరి, సత్యస్వరూప మజ్ఞేయమనియు, సర్వాంతర్యామియగు శక్తి నిర్గుణమనియు, జీవుడు కర్మబద్ధుడనియు, జీవితము క్షణభంగురమనియు కావున ప్రేమలో భక్తియే

ముక్తిసాధనమనియు సూఫీల యుపదేశము. వైరాగ్యము నుపదేశించినను జీవిత సామగ్రి నుపయోగించుకొనుచునే యుండవలయునని వారి యభిప్రాయము. లౌకికప్రేమ దైవప్రేమకు మార్గదర్శకమను తలంపుచే ఈసూఫీకవులు భక్తి శృంగారములను కలిపి ద్వ్యర్థి కావ్యము లనదగు గీతములను వ్రాసియున్నారు. రసపరిప్లుతములగు వీరి గీతములందు ఫారసీ కవితా సంప్రదాయము ననుసరించి మధుసేవ కవుల కుత్ప్రేక్షాసామగ్రిగను భక్తులకు పారవశ్య చిహ్నముగను ఉపకరించుచున్నది. అందువల్ల వీరు మధుసేవ కూడదని వాదించు మౌలవీలను జాహిద్‌లను (విరాగులను) వెక్కిరించుచుందురు. ఈసూఫీల తెగకు చెందినవాడే 'సర్మద్'.

ఉమర్ ఖయ్యాం యొక్క రుబాయీలు (గీతములు) ఫిట్ జెరాల్డ్ వంటి రసికావతంసుని కలము బలమువల్ల ప్రపంచము నందెల విఖ్యాతిని గాంచెను. తెలుగున శ్రీ రాయప్రోలు సుబ్బారావు, దువ్వూరి రామిరెడ్డి, ఆదిభొట్ల నారాయణదాసు, ఉమరలీషా మున్నగు కవిసత్తముల ప్రతిభావంతములగు అనువాదములవల్ల ఆంధ్ర పాఠకులకు సుపరిచితములైనవి. కాని 'సూఫీ సర్మద్' యొక్క రుబాయీలకీ యదృష్టము పట్టలేదు. ఢిల్లీ యొక్క షాఃజహాఁ ప్రెస్సువారు ప్రకటించిన 'రుబాయియాతె 'సర్మద్' అను ప్రతియందు (321) రుబాయీలు (చతుష్పాద గీతములు) కలవు. ఇందులోని కొన్ని గీతములు 'ఉమర్ ఖయ్యాం' గీతములందు కనపడును. 'ఉమర్' యొక్క గీతముల నిజమైన సంఖ్యను నిరూపించుట కష్టమని ఆ గ్రంథకర్తలందరు ఒప్పుకొను చున్నారు. కనుక రెంటిలో కనపడు గీతములు నిజముగా నెవ్వరివో తెలిసికొనుటకు తగిన యాధారములులేవు. ఈ 'సర్మద్' యొక్క ఈ 321 గీతములలో ప్రక్షిప్తములైనవి యుండ

వచ్చును కాని మొత్తముపైన ఈ రుబాయీలు ఫారసీ మూలమునందు 'ఉమరు ఖయ్యాం' యొక్క గీతములకు తీసిపోవని చెప్పవచ్చును. ఈ గీతముల నుండి యుదాహరణమునకై కొన్నిటిని తెనిగించితిని. ప్రతిభావంతులగు కవులచే ముందెప్పుడైన నీ 'రుబాయీలు' మరింత సుందరముగా యనువదింపబడ వచ్చునను యాశతో నాయిట్టి ప్రయత్నమును ప్రకటించు చున్నాను.

---

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.
Acc. No

# రెడ్డిరాజుల కాలపు మతసంస్కృతులు

ఆంధ్రుల చరిత్రమున స్వతంత్రముగా రెడ్డియుగమని పరిగణింప బడుకాలము కొద్దిదే. క్రీ. శ. 1315 నుండి క్రీ. శ. 1450 వరకు అయినను ఈకొలది కాలమున రెడ్డిరాజు లాంధ్రదేశము నత్యున్నతదశకు తీసికొని వచ్చినందునను యీ యుగానంతరము కొలది కాలముననే ఆంధ్రుల స్వతంత్ర రాజ్యము లంతరించినందునను యీయుగమును స్వర్ణయుగమని పేర్కొనుట అతిశయోక్తి కానేరదు. చాళుక్యులపిదప నీ రెడ్డివీరులాంధ్రదేశమున స్వతంత్ర పతాకమును స్థాపించి తెనుగు దేశమును తెనుగుబాసను వెలయజేసి కృష్ణాగోదావరీ మండలములను కర్నూలు కడప మండలములలోని పెక్కుభాగములను హైదరాబాద రాష్ట్రములోని మహబూబునగరు, రాయచూరు, మెదకు, నల్లగొండ, వరంగల్లు మున్నగు మండలములను, దాదాపు ముప్పదివేల చదరపు మైళ్ళవిస్తీర్ణతగలదేశమును స్వతంత్రులుగా నూటఏబది సంవత్సరములు పరిపాలించిరి. పిదప నొకవంక వెలమవీరుల యొక్కయు, మరియొక వంక ముస్లిం సేనలయొక్కయు, యాక్రమణమునకు బలియై తమ శోభను గోల్పోయిరి. వారు నిర్మించిన కొండవీడు, అద్దంకి, ధరణికోట వినుకొండ, బెల్లంకొండ, కొండపల్లి, కోలూరు, కోరుకొండ, మెదకు, రాయచూరు మొదలగు దుర్గరాజములు, వారొందిన కృతులు, రచించిన యుద్గ్రంథములు, స్థాపించిన శాసనములు, కట్టించిన ప్రఖ్యాత దేవాలయములు, దానమొసంగిన బ్రాహ్మణాగ్రహారములును నేటికి చరిత్రమున శాశ్వతముగ నున్నవి. ప్రస్తుత మీ వ్యాసమున నాకాలపు తమ సంబంధ

ములగు పరిస్థితులపై క్లుప్తముగా నొక సింహావలోకన మొనరించుటకు ప్రయత్నించెదను.

రెడ్లు రాష్ట్రకూట వంశస్థులైన క్షత్రియులనియు, కాలవశమున వైదికాచారములను గోల్పోయినందున శూద్రులని పరిగణింప బడిరని యొకవాదము. అనేక కృతులందు చతుర్థ వర్ణమునకు చెందినవారని వ్రాయించుకున్నందున వారు శూద్రులేయని రెండవ వాదము, ప్రాచీనార్య క్షత్రియులకును, రెడ్లకును గల సంబంధములను గురించి ఇద మిద్ధమని నిర్ణయించుటకింకను పరిశోధన కావలసియున్నది. అది యెట్లున్నను, వారు స్వయముగా ననేక శాసనములందు చంద్రవంశీయు లనియు, సూర్య వంశీయులనియు వర్ణింపబడినారు. ఇతర ప్రసిద్ధ రాజవంశీయులు వారితో వియ్యమొందినారు. స్వతంత్రరాజ్య పరిపాలనము, ధర్మసంస్థాపనము గావించినారు. వారికాలపు మతసంస్కృతులను మనకు లభ్యమైన ఆధారములనుబట్టి పరిశీలించినను వారి గుణ కర్మ భావములనుబట్టి క్షత్రియులుగానే పరిగణింప బడవలసి యుందురు. వైదిక మత పునరుద్ధరణమునందాంధ్రదేశమున రెడ్లు గావించినసేవ యపారమైనది. ఇతర చారిత్రికాధారము లెట్లున్నను వారు నిర్వర్తించిన ధర్మమునుబట్టి వారిని క్షత్రియులని పరిగణించుట యుక్తమగును.

ఈరెడ్డియుగపు 150 సంవత్సరముల మతచరిత్రలను అర్థము చేసికొనుటకై కొంత పూర్వచరిత్ర స్మరణమవసరము. భారత దేశమున ప్రాచీనకాలమునుండి ఆర్యుల మతమున రెండు స్వతంత్ర శాఖలుగనుపడుచున్నవి. వైదిక శాఖలు, తాంత్రిక శాఖలు, మొదటివి కర్మ ప్రధానమైనవి. రెండవవి వైరాగ్య ప్రధానమైనవి. అవైదిక ములనబడు బౌద్ధ జైనమతములు ప్రబలినతరువాత తలుకుబడి తగ్గి,

ఆమత విప్లవముధాటి కాగలేక సనాతన మతములతి విషమస్థితిలోనున్న సమయమున బౌద్ధమతమునందు రెండు చీలికలుద్భవించి రానురాను క్షీణదశ నొందుచువచ్చెను. ఆకాలమున దక్షిణాపథమును చాళుక్యులు చోళులు పాండ్యులు పరిపాలించుచుండిరి. త్రిమతాచార్యులగు శ్రీశంకర రామానుజ, మాధవులు ఉదయించి జీర్ణించుచున్న జైన, బౌద్ధమతముల నిర్మూలన మొనర్చిరి. వీరు పూర్వమునుండి వచ్చుచున్న తాంత్రిక వైదికశాఖల రెంటిని సమన్వయించి వైదిక కర్మానుష్ఠానముతోపాటు తాంత్రికుల వైరాగ్యవిధిని, ఉపాసనాపద్ధతిని, కలిపి ప్రజామోదమును బడయజాలునటుల మతము నుద్ధరించిరి. తాంత్రిక విధులు బౌద్ధులలో నంతకుపూర్వమే సుపరిచితములు గావింపబడినందున ఈపునరుద్ధరింపబడిన బ్రాహ్మణమత మతితొందరగా ప్రసరింపదొడంగెను. కాకతీయ యుగారంభమునాటికి-జైన, శైవ, వైష్ణవ మతములహమహమికతో స్పర్థావైషమ్యములతో ప్రచారము బొందుచుండెను.

క్రీ. శ. 12వ శతాబ్దమున దక్షిణ భారతమందు మహారాష్ట్ర, కర్ణాట, ద్రావిడాంధ్ర కళింగులు సుస్థిరమైన ఏకసామ్రాజ్యము నెలకొల్పుటకై తమ యావచ్ఛక్తులను వినియోగించుచు పరస్పర వైషమ్యముల వలన దేశమును భయంకరమగు యుద్ధరంగముగ మార్చిరి. చక్రవర్తులు, మహారాజులు సామాన్యముగ శైవమతావలంబులై యుండ మాండలికులనేకులు సామంతులు జైనులగుటచే వీరితోపాటు జనసామాన్యమునందు జైనమతమే విజృంభించి యుండెను. దీనినరికట్టి తమతమ సామ్రాజ్యములను స్థాపించుటకై శైవ, వైష్ణవ, బ్రాహ్మణ మతాచార్య లభినివేశముతో ప్రయత్నించు చుండిరి. పండ్రెండవ శతాబ్ధారంభమువ కర్ణాటక, మహారాష్ట్ర దేశముల పశ్చిమ చాళుక్యులకు,

ద్రవిడాంధ్ర దేశములు పూర్వ చాళుక్యులకును లోబడి యుండెను. ఈ రెండు చాళుక్య సామ్రాజ్యముల కాలమునందే ఆర్య బ్రాహ్మణ మత మనేక సంస్కారములనందినది. దక్షిణార్యులు ద్రావిడ సంపర్కమువలన శివారాధన మవలంబించినను కర్మ ప్రధానమైన వైదిక మతమే వారికి ముఖ్యమై యుండెను. ఈ మత ప్రసారమునకు ముఖ్యకారుకుడు సుప్రసిద్ధుడగు కుమారిలభట్టు. వాగ్వివాదములందు జయించియు మహారాజులను వశులను గావించుకొని బోధించియు వైదికులు జైనమతమును నిర్మూలింప జాలరైరి. ఈ కేవల వైదిక మత మంత ప్రజారంజకముకాలేదు. ఇట్టి పరిస్థితిలో భక్తి ప్రధానమైన వైష్ణవ మతము శఠగోపుడు, నాథముని, పుండరీకాక్షుడు. రామ మిశ్రుడు, యామునాచార్యులు, మున్నగు వారిచే బోధింప బడుచుండెను. అయినను శ్రీ రామానుజు లవతరించు వరకు కర్మ ప్రధానమైన వైదిక మతమునుగాని, వైరాగ్య ప్రధానమైన శైవమతమునుగాని మించి, భక్తి ప్రధానమైన యీ వైష్ణవ మతము గూడ విశేషవ్యాప్తిని గాంచలేదు. క్రీ. శ. 8వ శతాబ్దాంతమున యవతరించిన శ్రీ శంకరులచే పునరుద్ధరింపబడి రాను రాను యభివృద్ధి నొంది పండ్రెండవ శతాబ్దమునాటికి జైన, బౌద్ధాచార్యుల కాటపట్టగు కాంచీపురి బ్రాహ్మణాధీనమగుటతో కాంచీపురి బ్రాహ్మణ మతమునకే పట్టుగొమ్మ యయ్యెను. ఇక్కడనే శ్రీ రామానుజులు తమ సిద్ధాంతములను బోధించిరి. శ్రీ రామానుజుల విశిష్టాద్వైత బోధను కులోత్తుంగ చోళ దేవుడు సహింపనందున హొయసల రాజుచే పరిపాలింప బడుగాంగ వాడి రాజ్యమునకేగి వారు విఠల దేవరాయు నాశ్రయించి వైష్ణవ మత ప్రచారము గావించిరి. క్రీ. శ. 1117 మున విష్ణువర్ధనుడే వైష్ణవ మతమును స్వీకరించెను. భక్తి ప్రధానమగు వైష్ణవ మతము జైనులగు జనసామాన్యమును ఆకర్షించి విజృంభించి

నది. ఒకవైపు వీరవైష్ణవము, ఒక ప్రక్క జైనమతము, వేరొక వంక వైదిక స్మార్తమతము అభివృద్ధి నొందుచుండ కాలచుర్య వంశీయుడగు బిజ్జలరాజు యొక్క మంత్రియగు బసవేశ్వరుడు వీర వైష్ణవ మతమును పునరుద్ధరించి మరియొక విప్లవమును ప్రవేశ పెట్టెను. ఇట్లు నలువైపుల రాజకీయరంగమందే కాక—మతము నందును పండ్రెండవ శతాబ్దము పరస్పర సంఘర్షణకాలము. జైనుల నేకులు వీరవైష్ణవులుగా మారిపోయిరి. ఇట్లుమత సాంఘిక పరిస్థితులు పరిపూర్ణముగా తారుమారైన యీ కాలములోనే తిరిగి పౌరాణిక మత విజృంభణ మారంభించినది. కనుకనే క్రీ. శ. 11వ శతాబ్దము నుండి 14వ శతాబ్దము వరకు జరిగిన మూడు వందల సంవత్సరముల కాలములోని బంధ గ్రంథ రచన విరివిగా జరిగెను. ధారేశ్వరుడు, విజ్ఞానేశ్వరుడు. అపరార్కుడు, హెమాద్రి సాయనుడు మున్నగునిబంధ గ్రంథకారు లీకాలము వారే.

కాకతి రాజుల కాలముననే బసవేశ్వరుడు, పండితా రాధ్యులు, విశ్వేశ్వరశివ దేశికులు మున్నగు వారి ప్రతిభా విశేషము వలన శైవ మతము ప్రబలుచుండెను. వారి సామంతులు మండలేశ్వరులగు రెడ్డి ప్రభువులు గూడ శివభక్తులే. రేచెర్ల బేతిరెడ్డి రేచెర్ల రామిరెడ్డి యను రెడ్డి వీరులు మొదట ప్రతాపరుద్రుని ప్రఖ్యాత సేనానులు. వారి గృహనామము రేచర్లవారు. వీరి శాసనముల తెంలగాణా శాసనమున లను గ్రంథములో ప్రకటింపబడినవి. ఈ గృహనామముగల రెడ్డి దొరలు మన తెలంగాణమున గలరు. 'పిల్లల మఱ్ఱి' నాగుల పాడు, శాసనముల వల్ల వీరు ఆమనగల్లు ప్రభువులని తెలియుచున్నది. ఇట్లే కాకతిరాజుల సామంతులు, మండలేశ్వరు లితరులు లింగ ప్రతిమలను గావించి శివాలయములను గట్టించి బ్రాహ్మణాగ్రహారముల నొసంగి

సప్త సంతానముల నిర్మించి, తమ కీర్తిని చిరస్థాయిగా నొనర్చుటయేగాక బ్రాహ్మణ మతము నుద్ధరించుట కధికముగా సాయపడిరి, గణపతి దేవుని కాలమున జైనులయెడ విద్వేషము పెరిగి జైనులు, బౌద్ధులు హింసింపబడిరి. ఈ చక్రవర్తి యద్వైతవాది యని శాసనముల వలన దెలియుచున్నది. ఇతని కాలముననే కంసాలుల నుండియు సెట్టి పెద్దలునైన తెలగాల నుండియు గ్రామకరణోద్యోగములు తొలగింపబడి నియోగి బ్రాహ్మణుల వశము గావింప బడెను.

రెడ్లు ఆకాలము నుండియే బ్రాహ్మణ భక్తిని, బ్రాహ్మణ మత పక్ష పాతమును గనబరచు చుండిరి. ఈ విషయముకూడ వెలమలతో వీరి వైరమున కొక కారణముగా గనబడు చున్నది. "రెడ్డి సంతతికి మారొడ్డి భేదనమైన కుల ముద్ధరించిరీ వెలమవారు" అనిరావు వంశీయ చరిత్ర మందుగల నొక పద్యములో నున్నది. దీని నాధారముగా గొని పల్నాటి వీర చరిత్రలో వర్ణింపబడిన బ్రహ్మనాయని యుద్ధమొక "కులముపో" రనియు, బ్రహ్మ నాయడు, మాలలు మాదిగలు, గొల్లలు, కంసాలులు, కమ్మరులు, కుమ్మరులు, రజకులు, రెడ్లు మొదలగు నందరిని గలిపి 'చాపకూడు' గుడుచుటయు నాయుద్ధమునకొక కారణమై యుండునని శ్రీచిలుకూరి వీరభద్రరావుగారూహించు చున్నారు ఇది ఎట్లున్నను రెడ్డి ప్రభువు లధికముగా శివ భక్తులు, బ్రాహ్మణ మత పక్షపాతులునై యుండిరని శాసనములన్నియు జాటుచున్నవి. రాయచూరు దుర్గమును నిర్మించిన గోనగన్నారెడ్డి దుర్గముపై లభించిన శాసనమునందు ఇతర వీరోచిత బిరుదావళితో పాటు "శ్రీసోమనాధదేవ దివ్య శ్రీపాద పద్మారాధకుండ"నియు 'సంతతార్చిత శశిమౌళి' యనియు బేర్కొనబడి యున్నారు. ఈగన్నారెడ్డి యొక్క సేనాధిపతి విఠల నాధుడు విష్ణుభక్తుడు. శ్రీలక్ష్మణరావుగారి యూహ ప్రకారమీ విఠల

నాథుడు గన్నారెడ్డి తమ్ముడు. ఈవిఠలనాథుని పేరెనే గోనబుద్ధారెడ్డి రంగనాథ రామాయణమునువ్రాసి యతని వైష్ణభక్తిని చాటెను. బూదు వూరు శాసనమువలన బుద్ధారెడ్డి కూతురు కుప్పాంబింక లింగప్రతిష్ఠ గావించినట్లు తెలియుచున్నది. ఇట్లీకాలమున శైవ వైష్ణవ మతములు జంటగా విజృంభించుచు నొకేవంశమున నొక సోదరుడు శైవుడును, మరియొకడు వైష్ణవుడుగా నుండుచు వచ్చిరని తెలియుచున్నది. కాకతీయ యుగాంతమున జూడ ప్రతాపరుద్రుడును శైవమతాభినిరతి గలవాడగుటచే పెక్కుశైవ మఠములు స్థాపింప బడియుండెను. ద్రాక్షారామము, త్రిపురాంతకము శ్రీశైలము ముఖ్య క్షేత్రములుగా భావింప బడుచుండెను. మండలేశ్వరులైన మహారాజులకు సామంతులకును గురువు లారాధ్య బ్రాహ్మణులును, శివయోగులైన బ్రహ్మచారులును. మంత్రులు లింగధారులైన నియోగి బ్రాహ్మణులు, సేనాధిపతులు మున్నగువారికి గురువులు జంగమదేవరలు—మొత్తముమీద జైన మతావలంబులును స్మార్త మతావలంబకులునైన బ్రాహ్మణులుగాక తక్కిన యగ్రవర్ణములవారిలో శైవులును, వైష్ణవులుగను నుండిరి. వీరిలో వీరశైవులు రాజ్యాధికార ప్రాబల్యముగల వారగుటచే బ్రాహ్మణులు వీరితో మైత్రిగలగి యుండిరి. మొదటి ప్రతాపరుద్రుని కాలము నుండియు కాకతీయాంధ్ర చక్రవర్తులు జైనులయెడ నిరాదరణ జూపుచుండిరి. అనేకులు త్రిలింగదేశమును విడిచి కర్ణాటక మహారాష్ట్రముల జేరుకొనిరి. నిలచిపోయినవారు బాధింపబడిరి. మహావిద్వాంసులైన జైనమతాచార్యు లనేకులు వైష్ణవ మతాచార్యులుగ మారిపోయినట్లు కనబడుచున్నది, కాకతీయ యుగాంతమువరకు జైన మతము త్రిలింగదేశమున నాశనమైనది. వల్లభామాత్యుని క్రీడాభిరామమందు వర్ణితులైన మైలారుదేవుడు, భైరవుడు, ఏకవీరాదేవి మున్నగు దేవతల యుత్సవములు మహావైభముతో వీరశాక్తేయ విజృం

భణమును స్పష్టపరచుచున్నవి. ఇవి కాకతీయ యుగాంతముయొక్క మత సాంఘిక పరిస్థితులు. పూర్వచరిత్రను భూమికగా నుంచుకొనినచో రెడ్డియుగముయొక్క పరిస్థితులను సులభముగా దెలసికొన గలము.

(శోభ ఆగస్టు 1947)

రెండవ ప్రతాపరుద్రుఁడలపు ఖానునిచే బందీ కృతుడగుటలో క్రీ. శ. 1323 వ సంవత్సరమున నోరుగల్లు పతనము చెందినది. అప్పటి నుండియు రెడ్డి యుగము ప్రారంభమైనదని చెప్ప వచ్చును. కాకతి సామ్రాజ్య మంతరించిన తరువాత గాకతీయుల సామంతులగు పద్మనాయకులును రెడ్లును గొందరు తమ తమ మండలములను స్వతంత్రముగా బరిపాలించుచు జిన్న చిన్న రాజ్యముల నేర్పరచుకొనిరి. వానిలో రెడ్డి రాజ్యములు నాలుగు : (1) కోరుకొండ రెడ్లు (2) కొండ వీటి రెడ్లు (3) కందుకూరి రెడ్లు (4) అల్లాడి రెడ్లు.

కోరుకొండ రెడ్డి కాలము క్రీ. శ. 1325 మొదలుకొని 1380 వరకు, అలపుఖానుడు రాజమహేంద్ర వరము నాక్రమించుకొని పరిపాలించుచుండ బ్రతాపరుద్రుని సేనానాయకులలో నొక్కఁడగు ప్రోల నాయకుడు, కాపనాయక కూనపనాయకుల సహాయముతో దండెత్తి పోయి విజయము గాంచెను. ఈ కాపభూపతి తురుష్కునిచే నాక్రమింపబడిన బ్రాహ్మణాగ్రహారములను బునర్దత్తములు గావించెనని యార్యవట శాసనము వలన దెలియు చున్నది.

ఈ కాపభూపతి బంధువుడే కోరుకొండలో దుర్గము నిర్మించెను. ఇతని పేరు మంచి కొండ మానారెడ్డి. కోరుకొండ దుర్గము రాజమహేంద్ర వరమునకు బదునొకండు మైళ్ళ దూరమున నున్నది. అప్పుడట పట్టణముగా నిర్మింపబడెను. ఇప్పటి గోదావరీ మండలమీ

కూన భూపాలుని రాజ్యమై యుండును. ఇతడు 1325 నుండి 1340 వరకు బరిపాలించెను. ఇతని తరువాత బెద్దకొడుకు ముమ్మడి నాయకుడు పట్టాభిషిక్తుడై క్రీ. శ. 1340 నుండి 1370 వరకు ముప్పది సంవత్సరములు రాజ్యముచేసెను. "ఆంధ్ర సురత్రాణ" బిరుదాంకితుడగు కాపభూపాలుని మేనగోడలి నితడు వివాహ మాడెను. వైరివీర సంహారుడై, విద్యావంతులైన పండితులను బోషించుచు నీయన జన రంజకముగా బరిపాలించెననియు, నీయన రాజ్యము గౌతమీతటము యొక్క యిరు ప్రక్కల వ్యాపించెననియు దెలుపు శాసనాధారములు గలవు. ఈ ముమ్మడి నాయకుడు తాను కోరుకొండ యందుండి యొక తమ్ముని కోట్యము నందును మరొకనిని ధాడి పాక యందును నుంచి యత్యంత సామర్థ్యముతో బరిపాలించినట్లు తెలియుచున్నది. ఇతని కాలమున శ్రీ రంగము నుండి పరాశర భట్టర్ కోరుకొండకు వచ్చి ముమ్మడి నాయకుని శిష్యునిగా జేసికొని వైష్ణవ మతమును గోదావరీ మండలమున వ్యాపింపజేసెను. ఈ పరాశరభట్టర్ శ్రీవైష్ణవ గురు పరంపరలో నేడవవాడు. వీరింత దూరము వచ్చి ముమ్మడి నాయకుని శిష్యునిగా నొనరించు కొనుట వింతగాదు. తన్మూలముననే రాజ్యమున వైష్ణవ మతము వ్యాప్తమయ్యెను. ఈ ముమ్మడి నాయకునకు రంగవర్ధనుడను నామముగూడ నుండినట్లు శ్రీరంగములోని శాసనము వలన దెలియుచున్నది. ఈ పరాశరభట్టర్‌వారు ముమ్మడి నాయకునితో దాను పరమ పదించిన తరువాత "గోరుకొండలో లక్ష్మీ నృసింహస్వామియై యవతరించెద" నని చెప్పినట్లును, బిదపనీ విషయము లక్ష్మీ దాసి యను వేశ్య వలన జ్ఞాపకము తెచ్చికొని కోరుకొండ లక్ష్మీ నృసింహస్వామి దేవాలయము 1353లో నిర్మించి నట్లును ఆ దేవాలయమునందలి శాసనము వలన దెలియుచున్నది. శ్రీ వేదాంత దేశికులవారు వీరి సమకాలికులు,

ఈకాలములో ముమ్మడి నాయకుడు, అతని తమ్ముడు సింగమ నాయకుడు నాయుర్వేద విశారదులగు పరహితాజార్యులు మున్నగువారికి దానములొసంగినట్లును, రంగనాథదేవాలయము నిర్మించినట్లును, స్వామి కైంకర్యములకు దానము చేసినట్లును, కేశవస్వామిని ప్రతిష్ఠించి నట్లు నునేక భూదానముల నిచ్చినట్లును దెలియుచున్నది. ఈకూనారెడ్డియు నతని తమ్ముడును గలిసి పదునైదు సంవత్సరములు పరిపాలించిరి. తరువాత నతనికొడుకు ముమ్మడిరెడ్డిరాజ్యము త్వరలో నంతమొందెను. కొండవీటి కుమారగిరిరెడ్డి యొక్క బావయు మంత్రియునగు కాటయ వేమారెడ్డిచే జయింపబడి యీరాజ్యము కొండవీటి రాజ్యమున జేరిపోయెను.

ఈ కోరుకొండ రెడ్లకాలము స్వల్పమైనది. వీరు విద్యాసక్తులు ధర్మరక్తులు వైష్ణవ మతాభినివేశము కలవారునై యుండిరి. వీరి కాలమున వైష్ణవ మతము ప్రబలినదని చెప్పుటకంటె నెక్కువ స్థితిగతు లను దెలిసికొనుటకు దగిన సామగ్రిలేదు. ఈ కోరుకొండ భట్టరు వారి శిష్యులిప్పటికి నాచార్య పురుషులు. వారి కగ్రహారము లీనాములు తెలంగాణమునందు గూడ గలవు.

## కొండవీటి రాజులు

రెడ్డిరాజులలో నందరికంటె విఖ్యాతులు కొండవీటివారే. ఈ వంశమువారు నెల్లూరినుండి సింహాచలము వరకుగల తెనుగుదేశమును బరిపాలించి, తుదిని స్వతంత్రాంధ్ర రాజ్యమును నిర్వహించి స్వర్ణయుగము నకు గారకులైరి. కావుననే, యీవంశముయొక్క దాతృత్వము, కళాపోషణము, విద్యావైదుష్యము పరాక్రమ మునాంధ్రదేశ చరిత్ర మందు సుప్రసిద్ధమై యొప్పుచున్నది. పంటశాఖీయులగు దేసటి వంశపు

MEMORIAL
ARLA
D.P.R.I
Acc. No

వేమారెడ్డి ఈ వంశమునకు గర్త. ఇతడు నితని పూర్వీకులును గాకతీయ సేనాధిపతులు. ఈవంశమువారు మొదటినుండియు క్షాత్రము నవలంబించినట్లును, వీరి పూర్వీకులలో నొక్కఁడగు వేమభూపాలు డద్దంకి రాజధానిగా బాకనాటి నేలినట్లను దెలియుచున్నది.

ఈ వేమారెడ్డి దేసటి ప్రోలయరెడ్డి ద్వితీయ కుమారుడు. ఈ దేసటివంశమువారును రాజమహేంద్రవరపు టల్లాడవంశమువారలునుజ్ఞాతులు. వేమారెడ్డి క్రీ. శ. 1324 నుండి 1350 వరకు బరిపాలించి యుండెను. కాకతీయ సామ్రాజ్య విధ్వంసము తరువాత నార్యధర్మములు విచ్ఛిన్నము లగుచుండ నార్యధర్మాభిషిక్తులై కృష్ణా నదీతీర ప్రాంత దేశములందలి తురుష్కుల నోడించి పూగినాటి దేశమున నీయన రాజ్యమును స్థాపించియుండెను. యెఱ్ఱాప్రెగడ యితని నవదాత చరితంబున 'నఖిల జనరంజనం బొనర్చుటంజేసి రాజశబ్దంబునకు భాజ నంబయ్యె' ననియు 'నన్వయైక పావను'డనియు వర్ణించి యున్నాడు. 'చుట్టపు మేరు'వని స్తుతించి యున్నాడు. వేమారెడ్డి బిరుదనామము లనేకములు. అందులో నర్థి ప్రత్యర్థి, హేమాద్రి దాననిరతుడు, నపరిమిత భూదాన పరశురాముడు, ననేక నగరోపకంఠ ప్రతిపాదిత బహువిధారాముడు. పర్వతా హోబల నిర్మితసోపానుండు. బసవ శంక రుడుమొదలగునవి. ఇతడు నితని మంత్రియగు రామాప్రెగ్గడయు ధర్మ పరాయణులై తమ పరిపాలనము నార్యోక్త ధర్మానుసారముగా నిర్వ హించిరని తెలియుచున్నది. ఇతని సహోదరు లన్నారెడ్డి, మల్లారెడ్డి; పుత్రుడనపోతారెడ్డి; మేనమరది సూగారెడ్డియునితని సుప్రసిద్ధ సేనానులు. వీరందరు శివభక్తులు, బ్రాహ్మణ పూజాతాత్పరులని తెలియుచున్నది. వీరిలో మల్లారెడ్డి యెఱ్ఱాప్రెగడకు నాశ్రియమిచ్చి యాతనిచే రామాయణము, హరివంశము రచింపజేసినాడు. అన్నారెడ్డి

సకలార్ధ సమన్వితుడు, అన్నదాన సంపన్నుడు, భవాంఘ్రి సరోజ పూజాసన్నుతి తత్పరుడు. వేమారెడ్డి కొడుకు కనపోతారెడ్డి 'కీర్తనీయ సుగుణస్తోమంబు లందేమియు౯ రామస్ఫూర్తికి లొచ్చుగాక సరియై రాజిల్లి'న వాడు. ఎఱ్ఱాప్రెగడవంటి మహాకవి పవిత్రశీలుడు వర్ణించుట వలన నిజముగా వీరందరు ధర్మాభిరతు లనియే విశ్వసింపవలసి యున్నది. 'నన్నయభట్ట తికనాధులు జూపిన త్రోవ బావనంబెన్న బరాశరాత్మజ మునీంద్రుని వాజ్మయ' మను విశ్వాసముతో "భారత పరాంశ"మగు హరివంశమును దెలుగుజేసి భారతారణ్యమును బూరించి రామాయణ నృసింహ పురాణములను రచించిన శంభుదాసుని కాలమువరకును శైవ వైష్ణవ మతముల పరస్పర విద్వేషములు తగ్గి శివకేశవ భేదరహితమగు 'భాగవత ధర్మము'ను బండితులైన వారు పెద్దలు స్వీకరించు చుండినట్లు విదితమగు చున్నది. పోతనా మాత్యుని యాదర్శమిదియే. నృసింహ పురాణము నరాంకితముగా జేయక య హోబల నృసింహున కంకిత మొనర్చెను. ఆ నువంశికముగా శైవుడగు పోతన్న రామభక్తుడగుటయు నతని బావమరది రుద్రాక్ష మాలలు ధరించి శివభక్తుడుగా నుండుటయు నీ విషయమునే స్పష్ట మొనరించు చున్నవి. ఒక కుటుంబములోని వారు భిన్నభిన్న సంప్ర దాయము లవలంబించి యేవిధమైన వైరుధ్యములేక యుండినట్లా నాటి సారస్వతమున నుదాహరణములు కనుపించు చున్నవి? ఈరాజు నకు "బాౢపైన" యవచి దేవయసెట్టి శివభక్తుడు, ఆతని శివభక్తిని, దాతృత్వమును శ్రీనాధుడు హరవిలాసమున వర్ణించినాడు.

అవచి దేవయ సెట్టి యాకాలపు వైశ్య శిఖామణులలో నగ్రే సరుడు. ఈయన నాదర్శముగా గ్రహించిన ధర్మనిరతులగు వైశ్యులా కాలమున గొందరైన నుండకపోరు.

వేమారెడ్డి యాస్థానము వేద వేదాంగ కోవిదుల తోడను, షట్ శాస్త్ర విదులైన పండితులతోడ నభిరామమై యుండెను, గీర్వాణాంధ్రి భాషా కోవిదులైన కవిసత్తము లాయాస్థానము నలకరించి యుండిరి. వారి సామంతులును, దండ నాధులును, రాజ బంధువులను వారి ననుకరించిరని విశ్వసింప వచ్చును. అందులకు దగిన యాధారములు గూడ గలవు.

ఈ వేమ పాభూపాలుని యనంతర మాతని పెద్దకొడుకు కన పోతరెడ్డి క్రీ. శ. 1350 నుండి 1392 వరకు రాజ్యమును బాలించెను. ఇతడు మహా పరాక్రమశాలి, యనేక యుద్ధములుజేసి యే యుద్ధమునందైనను నోడిపోయినట్లు కానరాదు. ఇతడు నార్య ధర్మ ప్రచారము గావించుచు, వేదాధ్యయన సంపన్నులైన బ్రాహ్మణోత్తములకు దండ్రి యొసంగిన దానములను గాపాడుచు, దానునుదాన ధర్మములు జేయుచుండెను. రామ ప్రెగడ వంశము వారే మంత్రి పదవులను నిర్వహించుచు లింగ ప్రతిష్ఠలను గావించు చుండినట్లు శాసములు తెలుపు చున్నవి. ఈ యనపోతరెడ్డిగారి కాయురారోగ్యైశ్వర్యాభివృద్ధి కొరకై యమరేశ్వర దేవాలయమును బునః ప్రతిష్ఠించి పైమల్లయ్య మంత్రి కీర్తి మంతుడయ్యెను. ఆ కాలములో రాజుగారి పేరను, బితృ పితామహాదులకు బుణ్యముగాను, దేవాలయ ప్రతిష్ఠలు, దానములు గావించుట కలదు. సనాతన ధర్మాను సారముగ మంత్రులు, దండ నాధులు, స్థానాధి కారులు మున్నగు వారందరిట్టి దానము లనేకములు గావించిరి. ఈ యనపోతరెడ్డి కాలమున మోటుపల్లి రేవు పునః ప్రతిష్ఠితమై నౌకావ్యాపారమున కాలవాలమై యాంధ్రుల వాణిజ్యకీర్తి దేశమున వెలయించెను.

ఈ యనపోతభూపాలుని తరువాత నాతనితమ్ముడగు వేమా రెడ్డి రాజ్యమును బాలించెను. అనవేముడు హేమాద్రి దానధీరుడై దారిద్ర్య విద్రావణుడై, శిబి, కర్ణ, దధీచులంబోలి ప్రసిద్ధి గాంచెనట.

నల్లగొండజిల్లా మిర్యాలగూడెము తాలూకా వాడపల్లి గ్రామములో నీరాజు శాసనము శ్రీయగస్త్యేశ్వర స్వామివారి యాలయ ప్రాకారమునందు శిలాస్తంభముపై గలదు. ఈ ప్రదేశ మపుడెట్లు కొండవీటి రాజ్యమున జేరెనో తెలియకున్నది. ఈ యనవేముడు తండ్రివలె బ్రాహ్మణ వృత్తులను గాపాడుట, ధర్మములను రక్షించుట యేగాక యగ్రహారములు, భూదానములు బ్రాహ్మణుల కొసంగుట యనునది యొక వ్యసనముగా గలవాడని యీతనిచే లిఖింపబడిన శాసనము తెలుపుచున్నది.

ఇతనితరువాత గుమారగిరిరాజు కాటయవేమారెడ్డి సహాయమున 1383 మొదలుకొని 1400 వరకు బరిపాలించెను. ఈరాజు, భోగలాలసుడనియు, వసంతోత్సవ ప్రియుడనియు, వసంతరాజను బిరుదముగలవాడనియు దెలియుచున్నది. అవచి తిప్పయసెట్టి యీరాజునకై దేశదేశములనుండి సుగంధ ద్రవ్యములు, మాణిక్య గాణిక్యాదులును దెప్పించు చుండెడివాడు. శ్రీనాధుని హరవిలాసమున కీతడే కృతిపతి. ఆగ్రంధములో నితడు శ్రీనాధునకు జెప్పినమాటల వలన నాకాలపు వైశ్యుల యైశ్వర్య సంపదయేగాక వారి ధర్మానురక్తియు, దైవ బ్రాహ్మణభక్తియు దెల్లమగుచున్నవి. వణిగ్వంశ చరిత్రవలన నాకాలమున సముద్రయానము, విదేశ వ్యాపారము బహిష్కార భయములేక జరుగుచుండెడివని తెలియుచున్నది, తరువాత నేకారణమున సముద్రయానము నిషేధింపబడెనో తెలియరాకున్నది.

కుమారగిరి తరువాత గొండవీటిని పెదకోమటి వేమభూపాలుడు 1400 నుండి 1420 వరకు బాలించెను. ఇతడు తన పూర్వులమార్గమునే యనుసరించి పాలించెను. ఇతని మంత్రి శ్రీనాధుని నైషధమునకు గృతిపతియైన మామిడిసింగనామాత్యుడు బ్రాహ్మణ్యమును క్షాత్రమును సమానముగా నడుపు నియోగికులాలంకారుడు. కోమటి వేమారెడ్డి తరువాత రాచవేమన 1420-1424 వరకు మాత్రమే పాలించెను. తరువాత గొండవీటి రాజ్య మీవంశమునకు నిలువలేదు.

కందుకూరి రెడ్లను గురించి విశేషముగా వ్రాయవలసినది లేదు. వీరు కొండవీటి వేమ భూపాలుని తమ్ముడగు మల్లారెడ్డి వంశస్థులు. వీరు కందుకూరు దుర్గము నుండి పూగినాటి సీమను బాలించుచుండిరి. వీరిలో శ్రీగిరిరెడ్డి పరాక్రమ వంతుడు. సంగీత విద్యా నిపుణుడు. ఇతనికి బడియరాయలు శ్రీ గిరిగారు గురువులు. హేమాద్రి దాన చింతామణి యని ప్రఖ్యాతిగాంచినాడు. గొప్ప చెరువులను నిర్మించెను. ఇతని తమ్ముడు బహు దానములు గావించినట్లు శాసనములు గలవు. 1424 తరువాత నీ వంశము వారు విద్యానగర చక్రవర్తియగు ప్రౌఢ దేవరాయనికి సామంతులైరి. ఈ వంశములోని శివలింగ భూపతి యను రాజు మిక్కిలి విద్వాంసుడై, సంస్కృతమున గ్రంధములు రచించినాడు. వీరి మంత్రి కొమ్మనామాత్యుడు. వైదిక కార్యము లందు శ్రద్ధగలిగి యనేక యజ్ఞయాగాదులను నొనరించి, యజ్ఞేశ్వరుని బ్రతిష్ఠ గావించెనట. ఇతండనేక దేవాలయములు గట్టించెను. తరువాతి శాసనముల వలన నీవంశము వారు విద్యానగర విరూపాక్ష దేవాలయమున కనేక భూదానములు చేసినట్లు కనబడుచున్నది.

క్రీ. శ. 1386 నుండి 1415 వరకు గాటయవేమభూపాలుడు రాజమహేంద్రవర రాజ్యభాగమును బరిపాలించెను. ఈయన సింహా

చలమువరకు దనరాజ్యమును వ్యాపింప జేసిన పరాక్రమశాలి, పండితుడు, కవి. కుమారగిరి యనంతరము రాజమహేంద్రవరమును స్వతంత్రముగా బాలించు చున్నందున బెదకోమటి వేమ భూపాలునకు స్పర్థలు పెరిగి వైరముగా బరిణమించెను. ఇందులో నల్లాడరెడ్డి యితని పక్షమున నిలచెను. ఈ విధముగా జ్ఞాతివైరము పెరిగి రాజ్యపతమునకు గారణమయ్యెను. కాటయ వేమ భూపాలుని సంస్కృత భాషాభిమానము, వేద శాస్త్రాది విద్యా పోషణ, హిందూ మతాభిమానము· బ్రాహ్మణ భక్తియు పాలకొలను, సురవరము, భీమవరము, మున్నగు శాసనముల వలన దెలియుచున్నవి. ఈయన యనేక దానధర్మములు గావించి యున్నాడు. ఇతని తరువాత బాలించిన యల్లాడరెడ్డి శ్రీనాథుని భీమేశ్వరపురాణము కాశీఖండములలో వర్ణింపబడి యున్నాడు· పెదకోమటి వేముని యుద్ధమున నోడించెననియు, నతడు "రాయ గురు పరమేశ్వర సాధుజనవిధేయ ఘోడెరాయ సకల కళాధామాది బిరుద భాస్వరుండనియు· భీమయ గురువరేణ్య కరుణాకటాక్షవీక్షణా లబ్ధాష్టైశ్వర్య ధుర్యుడనియు, నీయన వర్ణింప బడినాడు. ఈయల్లాడ రెడ్డి పూర్వులు నెల్లూరు మండలములోని దువ్వూరు వారట. ఈయల్లాడ రెడ్డికి సంగ్రామ స్థలీ గాండీవులు నలుగురు కొమారులు.

బెండపూడి లింగనామాత్యు డీతనికి బ్రధాన మంత్రి. ఇతనిని శ్రీనాథుడు చాల బొగడినాడు. అల్లాడరెడ్డిచే జిన్న చిన్న రాజులను జయింపజేసి తెలుగు భూమి నేలింపజేసి నాడనియు, ననేక భూదానములను జేయించెననియు, ఖండ శర్కర, జున్ను, కండ చక్కెరలు, దోసెలు వడలు మున్నగు పంచ భక్ష్య పరమాన్నములతో బ్రాహ్మణులకు భోజనములు పెట్టించు చుండెననియు, శ్రీ నాథుడు వర్ణించినాడు.

ఈ కాలములో బ్రాహ్మణులకు మిక్కిలి హాయిగా నుండియుండును. ఈవిధముగా భోజనము లభించుచున్న భోజన ప్రియులగుటకు సందేహ ముండదు. ఈయన తరువాత గుమారులగు నల్లాడ వేమభూపతి వీర భూపతి యిద్దరుండిరి. తమ్ముని పట్టాభిషక్తుజేసి యన్నయగు వేమభూపతి యాతని తరపున బరిపాలనము గావించెను. వీర భూపతియే శ్రీనాథుని యేలికయగు వీరభద్రారెడ్డి. యవన కర్ణాటక సామ్రాజ్యముల పెనుగు లాటలో నిరువది సంవత్సరములైనను వీరి రాజ్యము ప్రవర్థ మానమై జన రంజకముగా బరిపాలనలో నుండినది. అప్పటి రాజ్య వైభవమును శ్రీనాథుడు కాశీఖండ భీమఖండములలో వర్ణించినాడు. వీరికుల గురువు ఘోడెరాయ భీమేశ్వరు డారాధ్య శైవ బ్రాహ్మణుడు. వారుసేయు శివారాధనావిధానమున శ్రీ నాథుని వర్ణనా ప్రకారముగ వారు క్షత్రియులుగారు, శూద్రులనుటకు బొత్తిగా వీలుండదు. త్ర్యంబ కాచల కన్యకాంబుపూరంబులో నఘ మర్షణ స్నాన మాచరించి, మూల మంత్రాక్షరములతో విభూతి మంత్రించి, పుండ్రకంబు ఫాలమున ధరించి, క్రొత్త ముత్యములతో రుద్రాక్షమాలిక లష్టోత్తర శతంబు లురుత దాల్చి, పుండరీకాసనమున గూర్చుండి రెండవ శంభునివలె వేమ విభుడు పూజచేసెడి వాడట. వీరుశైవమతావ లంబకులైనను బరమత సహనము మిక్కిలి కలిగిన వారని తెలియు చున్నది. బ్రాహ్మణుల కీకాలమున మిక్కిలి సుఖ జీవనము గలిగినట్లు శ్రీ నాథుని వర్ణనల వలన దెలియు చున్నది. "ధరియింప నేర్చిరి దర్భవెట్టెడు వ్రేళ్ళ లీల మాణిక్యాంగుళీ యకములు." మున్నగునవి నిదర్శనములు.

ఈ కాలములోనివాడే బెండపూడి అన్నామాత్యుడను మంత్రి ఇతడు నిరంతర శివపూజా ధురంధరుడని వర్ణించుచు నితడు గావించిన ప్రతిష్ఠాపనలను గూడ శ్రీనాథుడు వర్ణించినాడు.

వల్లభాభ్యుదయము, వీధినాటకము మున్నగు గ్రంథముల నాధార మొనర్చుకొని శ్రీనాథుడు శృంగార ప్రియుడనియు, విభవలంపటు డనియు నిశ్చయమునకు వచ్చుట సరిగాదని తోచుచున్నది. విభూతి పుండ్రములు, నూర్ధ్వపుండ్రములు కవితా రసికత కడ్డురావు. రుద్రాక్ష మాలాలంకృతులైనను దులసీదామ భూషితులైనను జపతపాద్యనుష్ఠాన నిరతులైననువారి మతాభినివేశములు రసవత్కవిత కాటంకములుగావని మన పూర్వ సారస్వతమున ననేకోదాహరణములు జూపింపవచ్చును. కాశీఖండ మతని వైదిక విద్యావైదుష్యమును దెలుపుచున్నది. ఈతడు లింగధారియోకాదో కాని విద్వేషరహితుడగు నద్వైతియనుట మాత్రము నిశ్చయము. శ్రీనాథుడు రచించినవని చెప్పబడు వీధినాటకము చాటుపద్యముల వలన నానాటి సాంఘిక పరిస్థితులు తెలియుచున్నవి. కాని యందులో ప్రక్షిప్తము లెన్నియో తెలియదు.

ఎట్లయినను గ్రామీణులును జానపలునగు వారి మతపరిస్థితులను దెలిసికొనుట కాధారములు లేవు. మత సంబంధములగు నీయాదరములు నితర జనులందరికి మార్గదర్శకములై యుండునని యూహింపవచ్చును.

మనదేశములో రెండు మత సంస్కృతలు పురాతన కాలము నుండి వచ్చుచున్నవి. మొదటిది అగ్రవర్ణము లనిపించుకొన్నవారి వేద వేదాంగ ప్రతిపాదితమగు వైదికపురాణమతము. రెండవది జాతి మాత్రే మున్నగు కారణములవల్ల పైమతమువారి [illegible] వారి యజ్ఞానమునకు దగిన గ్రామ్యతమము. అదివారి గ్రామదేవతోపాసన యందును' జాతరలందును' నుత్సవములందును, మొక్కుబడులందును బ్రతిఫలించును.

NARLA MEMORIAL LIBRARY V.R.N D.R.P.T. Acc. No 1562

(శోభ మాసపత్రికలు సెప్టెంబరు, అక్టోబరు, 1947)

మో సెస్ అండ్ కో..
కింగ్సువే, శికింద్రాబాద్,

110

BCL

AOUA102B126

## మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA102B126 |
| పుస్తకం పేరు | సారస్వత వ్యాసముక్తావళి |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 115 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | C.C. BCI 4 |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | M. Raji |
| పేజీలు విడదీసినది | M. Raji |
| స్కాన్ చేసినది | Lavanya |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |